నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

NAMASTE TELANGANA

మంగళవారం TUESDAY 1.10.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14 Pages: 14

సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 117 ‖ వెల (Price) రూ.6.50

మంగళ వారం, సూర్యోదయం: 6-06, సూర్యాస్తమయం: 6-05. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: చతుర్దశి రాత్రి 9-40 వరకు. నక్షత్రం: పూర్వఫల్గుణి ఉదయం 9-16 వరకు, తదుపరి ఉత్తరఫల్గుణి. వర్జ్యం: సాయంత్రం 5-25 నుంచి రాత్రి 7-13 వరకు. రాహుకాలం: పగలు 3-04 నుంచి సాయంత్రం 4-34 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-30 నుంచి ఉదయం 9-18 వరకు, పునర్ దుర్ముహూర్తం: రాత్రి 10-53 నుంచి రాత్రి 11-41 వరకు. అమృతకాలం: తెల్లవారుజామున 4-14 నుంచి మర్నాడు ఉదయం 6-03 వరకు.



సచ్చుడో, బతుకుడో తెలుస్తలేదు.. కంటనీరు ఆగుతలేదు

సోమవారం అత్తాపూర్‌లో పర్యటించిన కేటీఆర్ ముందు గోడు వెళ్లబోసుకున్న మూసీ బాధితురాలు రేణుక



మా ప్రాణం పోయినా మకాన్ ఖాళీ చెయ్యం

నోటీసులకు వ్యతిరేకంగా కిషన్‌బాగ్‌లో నినదిస్తున్న వృద్ధురాలు, చిన్నారి



వాడ వాడనా.. ఒకే వేదన



ఐదు వేలు తీసుకొని మూసీ బాధితులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నరని మంత్రి శ్రీధర్‌బాబు అంటున్నడు. కాంగ్రెస్‌లాగా 50 కోట్లకు పీసీసీ ప్రెసిడెంట్, 500 కోట్లకు సీఎం పదవిని అమ్ముకోవడం, మంత్రులు పర్సంటేజీలు పంచుకోవడం లాంటి దిక్కుమాలిన అలవాట్లు ప్రజలకు ఉండవు. గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు ఏడుస్తుంటే పైసలు తీసుకొన్నరని మాట్లాడ్డానికి మంత్రికి మనసెలా ఒప్పింది?
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పేదలను ఇబ్బందులు పెట్టే ఇసొంటి సీఎంను ఇప్పటిదాక చూడలే. ఎవరెవరో వస్తరు.. ఇంటిపై ఏదో రాస్తరు.. ఖాళీ చేయాలని బెదిరిస్తరు.. పిల్లలు, మహిళలు, గర్భిణులు బిక్కుబిక్కుమంటున్నరు. రాత్రింబవళ్లు భయంలోనే బతుకుతున్నం. కాంగ్రెస్ వస్తే పరిస్థితి ఇంత దారుణంగా మారుతదని అస్సలు ఊహించలే. అక్రమంగా ఇల్లు కట్టుకోలేదు. పర్మిషన్లతోటి కట్టుకున్నం. డాక్యుమెంట్లన్నీ ఉన్నయ్.
-సునీత, భరత్‌నగర్ కాలనీ, అత్తాపూర్

బాధితులకు అండగా ఉంటం.. బుల్డోజర్‌ను అడ్డుకుంటం

-కథనాలు 2,5 పేజీల్లో..

- 2400 కి.మీ 'నమామి గంగే'కు 40 వేల కోట్లు.. 55 కి.మీ మూసీకి లక్షన్నర కోట్లా?
- కుర్చీ కోసం రేవంత్ నజరానా.. ఢిల్లీకి 25 వేల కోట్లు.. కాంగ్రెస్‌కు ఇదో 'రిజర్వ్‌బ్యాంక్'!
- పేదల ఇండ్లను మూసీలో కలుపుతుంటే బీజేపీ నాయకులు నోరెందుకు మెదపరు?
- పేదల పాలిట కాలయముడిలా రేవంత్.. రాహుల్, ప్రియాంకకు ఈ ఆక్రందన పట్టదా?
- మీ రెడ్‌లైన్లు కాదు.. మీకు మేమే డెడ్‌లైన్లు పెడతాం.. అవసరమైతే మరో సాగరహారం
- బాధితులకు కేటీఆర్ భరోసా.. మూసీ పరీవాహక ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ నేతల పర్యటన

చెప్పినా వినరా! జైలుకు పంపాల్నా?

ఈ ఏకపక్ష కూల్చివేతలేంది? ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారా?

రేపు హైకోర్టు, చార్మినార్‌లనూ కూల్చమంటే యంత్రాలను, సిబ్బందిని పంపుతారా?

పొలిటికల్ బాసులో, పై ఆఫీసర్లో చెప్పినట్టు నడుచుకుంటే బలయ్యేది మీరే: హైకోర్టు

- శని, ఆదివారాల్లో, కోర్టు సెలవుల్లో ఇండ్ల కూల్చివేతలేంది?
- కూల్చివేతలపై ఉన్న శ్రద్ధ కోర్టు ఆర్డర్ చదవడంలో లేదా?
- ఉరి తీసే ముందు కూడా చివరి కోరిక అడుగతరు.. మీరు ఇచ్చిన నోటీసులకు వివరణ కూడా వినలేరా?
- 48 గంటల నోటీస్ ఇచ్చి 40 గంటల్లోనే కూల్చేస్తరా?
- హైడ్రా నోడల్ ఏజెన్సీనే!.. దానికున్న చట్టబద్ధతేంది?
- చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్లకు పంపితే తెలిసివస్తుంది..!
- హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు స్ట్రాంగ్ వార్నింగ్
- అమీన్‌పూర్ తహసీల్దార్‌పైనా న్యాయమూర్తి ఆగ్రహం
- హైడ్రా ఏర్పాటు జీవో-99పై స్టే ఇస్తామని హెచ్చరిక
- తదుపరి విచారణ 15కు వాయిదా.. స్టేటస్ కో జారీ

చట్టాలను అమలు చేయకుండా కోర్టు ఉత్తర్వులను ఖాతరు చేయకుండా కూల్చివేతలే ఏకైక లక్ష్యంగా దూకుడుగా చర్యలు తీసుకునే వాళ్లను చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్లకు పంపితే పరిస్థితులు తెలిసివస్తాయి. కూల్చివేతలకు ముందు నోటీసులు జారీచేసి ఆక్రమణదారుడి వివరణ కోరాలని తెలియదా? ఉరితీసే ముందు కూడా ఆ వ్యక్తి చివరి కోరిక అడుగుతారు కదా.

> ప్రజలను భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తున్నారా? చట్టాలతో పనిలేకుండా కూల్చివేత చర్యలు తీసుకుంటుంటే హైకోర్టులు ఏమీ చేయకుండా కూర్చుని ఉంటాయని అనుకుంటున్నారా? నోటీసులు జారీ చేసినప్పుడు వారి వాదన కూడా వినాలని తెలియదా? శనివారం సాయంత్రం నోటీసు ఇచ్చి.. ఆదివారం కూల్చివేస్తారా? కోర్టు పనిదినం సోమవారం వరకు ఆగలేకపోతున్నారా? **- హైకోర్టు**

› 6

మూసీ ఆక్రమణలపై నోటీసులు ఇప్పుడా?

1900లో ఎఫ్‌టీఎల్ నిర్ధారిస్తే ఇప్పుడు నిర్మాణాల తొలగింపునకు చర్యలా?

ఆక్రమణల తొలగింపుపై మీ విధానమేమిటి?

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

చట్టప్రకారమే చర్యలు ఉండాలని ఆదేశం

విచారణ ఈ నెల 16కు వాయిదా › 6





కూల్చివేతలపై సుప్రీం సీరియస్

వారించినా వినని అస్సాం సర్కారుకు కోర్టు ధిక్కరణ నోటీసు

తమ అనుమతి లేకుండా ఇండ్లు కూల్చొద్దని పునరుద్ఘాటన › 7

కాంగ్రెస్‌లో హైడ్రా చిచ్చు

బుల్డోజర్ కూల్చివేతలపై రెండుగా చీలిన పార్టీ.. ప్రభుత్వం హైడ్రా కొంపముంచుతున్నదని బహిరంగంగానే విమర్శలు › 6

పేదల గూడు కూల్చే పార్టీగా కాంగ్రెస్ మిగులుతదని ఆవేదన



మిథున్‌కు దాదా సాహెబ్ ఫాల్కే › 12

డిస్కో డాన్సర్‌కు అత్యున్నత పురస్కారం

అదనంగా 2.5 లక్షల వీసా అపాయింట్‌మెంట్లు › 7

భారతీయులకు అమెరికా శుభవార్త

సుదీర్ఘ పోరాటానికి సిద్ధం!

ఇజ్రాయెల్ భూతల దాడులకు దిగినా ఎదుర్కొంటాం: హెజ్బొల్లా ప్రకటన › 7

సెంట్రల్ బీరుట్‌పై తొలిసారి ఇజ్రాయెల్ వైమానిక దాడి



కామారెడ్డి జిల్లా గాంధారిలో రుణమాఫీపై నిర్వహించిన అఖిలపక్ష ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

రబీ వచ్చినా రైతుభరోసా ఏదీ?

- సోమవారంతో ముగిసిన వానకాలం పంట సీజన్
- పంట కోతలు మొదలైనా అందని పెట్టుబడి సాయం
- కమిటీలు, అభిప్రాయ సేకరణ పేరుతో హంగామా
- పెంచి ఇస్తామంటూ ఎన్నికల్లో కాంగ్రెస్ వాగ్దానం
- ఉన్నదీ ఊడగొడ్తున్నారంటూ రైతుల ఆగ్రహం

11 సీజన్లు నిర్విరామంగా ఇచ్చిన కేసీఆర్ సర్కారు

రెండు సీజన్లకే కాంగ్రెస్ సర్కారు ఆపసోపాలు › 10



డీఎస్సీ ఫలితాలు విడుదల

- వెబ్‌సైట్‌లో జనరల్ ర్యాంకింగ్ లిస్టు
- నేటి నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్
- 9న నియామకపత్రాల అందజేత
- డీఎస్సీ జిల్లా టాపర్‌గా ఆటో డ్రైవర్
- జిల్లా ర్యాంక్ కొట్టిన తండ్రీ కొడుకు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఉద్దేశించిన డీఎస్సీ-2024 ఫలితాలు విడుదలయ్యాయి. మొత్తం 11,062 పోస్టులకు సంబంధించిన ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం సచివాలయంలో విడుదల › 11వ పేజీలో

సిద్ధరామయ్యపై ఈడీ కేసు

ముడాపై మనీలాండరింగ్ అభియోగం

మరిన్ని చిక్కుల్లో కర్ణాటక సీఎం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: ముడా భూముల కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరిన్ని చిక్కుల్లో కూరుకుపోతున్నారు. ఈ స్కామ్‌పై తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా రంగంలోకి దిగింది. రాష్ట్ర లోకాయుక్త పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా సిద్ధరామయ్య, మరికొందరిపై మనీలాండరింగ్ కేసు నమోదుచేసింది. ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఆదేశాల మేరకు లోకాయుక్త పోలీసులు శుక్రవారం సిద్ధరామయ్యపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఇందులో సిద్ధరామయ్యను ఏ1గా, ఆయన భార్య బీఎం పార్వతిని ఏ2గా, బావమరిది › 7వ పేజీలో

23వ సారి ఢిల్లీకి సీఎం రేవంత్

తాజా పరిణామాలతో హడావుడిగా పయనం

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం రాత్రి ఢిల్లీకి వెళ్లారు. ఆయన మంగళవారం రాత్రి లేదా బుధవారం తిరిగి వస్తారని సమాచారం. వాస్తవానికి ఆయన షెడ్యూల్‌లో ఢిల్లీ పర్యటన లేదని, తాజా పరిణామాల నేపథ్యంలో హడావుడిగా బయల్దేరినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆదివారం అస్వస్థతకు గురైన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లారని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. కానీ, › 11వ పేజీలో



సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లిలో దుండగులు నిప్పుపెట్టడంతో పాక్షికంగా దెబ్బతిన్న తెలంగాణ తల్లి విగ్రహం

తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పు

సిద్దిపేట జిల్లా చౌటపల్లిలో దుండగుల దుశ్చర్య

పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు

అక్కన్నపేట, సెప్టెంబర్ 30: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహానికి ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టారు. గ్రామంలోని బురుజు చౌరస్తా వద్ద నిరుడు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. త్వరలో విగ్రహావిష్కరణ చేయాల్సి › 10వ పేజీలో

రాజకీయాల్లోకి దేవుళ్లను లాగొద్దు!

చంద్రబాబుకు సుప్రీం తలంటు

- తిరుమల లడ్డూలో కల్తీ జరిగినట్టు సాక్ష్యాలున్నాయా?
- కల్తీ జరుగలేదని ఈవో చెప్పాక.. మీరెలా జరిగిందంటారు?
- కల్తీపై ఇతర ల్యాబ్స్‌లో సెకండ్ ఒపీనియన్ తీసుకొన్నారా?
- జూలైలో నివేదిక వస్తే, సెప్టెంబర్‌లో తీరిగ్గా చెప్పడమేంటి?
- సిట్ విచారణకు ఆదేశించిన తర్వాత ముఖ్యమంత్రి మీడియా ముందుకొచ్చి మాట్లాడాల్సిన అవసరమేంటి?
- రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న సీఎం ఇలా చేయొచ్చా?
- తన వ్యాఖ్యలతో భక్తుల మనోభావాలను గాయపర్చారు
- తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- కల్తీపై ఆధారాలేవీ కనిపించట్లేదన్న సర్వోన్నత న్యాయస్థానం



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారన్న వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ అంశంపై సోమవారం విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిని తీవ్రంగా తప్పుబట్టింది. కనీసం దేవుడినైనా రాజకీయాలకు దూరంగా ఉంచాలని హితవుపలికింది. లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారనడానికి తగిన ఆధారాలు తమకైతే కనిపించడంలేదన్న అత్యున్నత ధర్మాసనం.. కల్తీ నెయ్యిని లడ్డూలో వాడారో లేదో పూర్తిగా తెలియకుండా ఎలా ప్రకటన చేస్తారని చంద్రబాబును నిలదీసింది. ఈ వివాదంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) రాష్ట్రప్రభుత్వం నియమించిందని గుర్తుచేసిన ధర్మాసనం.. ఒకవైపు సిట్ విచారణ జరుగుతున్న సమయంలో సీఎం మీడియా ముందుకు వచ్చి ప్రకటన చేయాల్సిన అవసరం ఏమున్నదని సూటిగా ప్రశ్నించింది. ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా నియమించిన సిట్ సరిగ్గా విచారణ › 7వ పేజీలో



హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డికి తమగోడు వెళ్లబోసుకుంటున్న మూసీ బాధితురాలు



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తమ సమస్యలను చెప్పుకుంటున్న హైదర్‌గూడ మూసీ బాధితులు

లోకం పోకడ



సొమ్ముల సంగతి తర్వాత..
ఊరెళ్లి వచ్చేసరికి ఇల్లే పోయేటట్టుంది!

రాష్ట్రం నుంచి ఢిల్లీకి 25వేల కోట్లు!

కుర్చీ కోసం ఢిల్లీ పెద్దలకు రేవంత్ నజరానా • అందుకే లక్షన్నర కోట్లతో మూసీ ప్రాజెక్టు

- బఫర్‌జోన్ అని మూసీ వెంట మార్కింగ్..
- మరి దుర్గం చెరువు ఎఫ్‌టీఎస్‌లో ఉన్న రేవంత్ సోదరుడి ఇంటిని ఎందుకు కూల్చరు?
- పేదలను ముంచే సుందరీకరణ ఎందుకు?
- పేదల ఇండ్లను మూసీలో కలుపుతుంటే బీజేపీ నేతలు నోరెందుకు తెరువరు?
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మూసీ ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ నేతల పర్యటన

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : మూసీ పేరిట ఢిల్లీ పెద్దలకు రూ.25 వేల కోట్లు ఇచ్చేందుకే లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఆరాటపడుతున్నాడని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కోట్ల విలువజేసే ఆస్తులకు డబుల్ బెడ్రూం ఇండ్లను పరిహారంగా ఇవ్వాలనుకోవడం కాంగ్రెస్ సర్కార్ దుర్మార్గమైన చర్యలకు నిదర్శనమని నిప్పులు చెరిగారు. రెక్కల కష్టంచేసి కట్టుకున్న ఇండ్లను కూల్చివేసేందుకు వస్తున్న రేవంత్‌రెడ్డికి ఆడబిడ్డల ఉసురు తగులుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మూసీ పరీవాహక ప్రాంతాలైన హైదర్‌గూడలోని లక్ష్మీనగర్, బహదూర్‌పురాలోని కిషన్‌బాగ్ ప్రాంతాల్లో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మహమూద్ అలీ, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులతో కలిసి కేటీఆర్ సోమవారం పర్యటించారు. మూసీ వెంట మార్కింగ్ జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి బాధితుల గోడు విన్నారు. పేదల ఇండ్లను మూసీలో కలిపే సుందరీకరణ ఎందుకు? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీఎం సీటును కాపాడుకునేందుకు రేవంత్‌రెడ్డి ఢిల్లీ పెద్దలకు రూ.25 వేల కోట్ల నజరానా ఇచ్చేందుకే లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నాడని విమర్శించారు. పేదల గూడులను కూల్చేసే మూసీ ప్రాజెక్టుతో ఎవరికీ ప్రయోజనం లేదని స్పష్టం చేశారు. బఫర్‌జోన్ పేరిట మూసీ వెంట మార్కింగ్ చేస్తున్న రేవంత్‌రెడ్డి, దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఆయన సోదరుడి ఇంటిని ఎందుకు కూల్చడం లేదని నిలదీశారు. ఓవైపు బుల్డోజర్ రాజ్యానికి తావు లేదని రాహుల్ గాంధీ చెప్తుంటే.. మరోవైపు రేవంత్‌రెడ్డి తెలంగాణలో బుల్డోజర్లు దింపుతున్నాడని మండిపడ్డారు. రాహుల్ ఏమో చౌకీదార్ చోర్ అంటుంటే.. మోదీ తన పెద్దన్న అంటూ రేవంత్ ఆలింగనం చేసుకుంటాడని, కాంగ్రెస్, బీజేపీల మధ్య ఉన్న చీకటి ఒప్పందానికి తెలంగాణ సాక్ష్యంగా మారిందని చెప్పారు. పేదల ఇండ్లను మూసీలో కలుపుతుంటే బీజేపీ నాయకులు ఎక్కడికి పోయారని, ఏ ఒక్కరూ నోరెందుకు తెరవడం లేదని అసహనం వ్యక్తంచేశారు. పేదల ఇండ్లకు తామే అడ్డుగా నిలబడతామని భరోసా ఇచ్చారు. మూసీ సుందరీకరణ పేరిట పేదల భూములను లాక్కొంటున్న రేవంత్‌రెడ్డి, మన్మోహన్‌సింగ్ తెచ్చిన భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మూసీ పేరిట జరుగుతున్న బాగోతాలను బీఆర్‌ఎస్ అడ్డుకుంటుందని, బాధితుల పక్షాన పోరాడుతుందని స్పష్టంచేశారు.



హైదర్‌గూడలో మూసీ బాధితులతో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో ఎంపీ రవిచంద్ర, మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు గోపీనాథ్, కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు



హైదర్‌గూడలో మాట్లాడుతున్న మూసీ బాధితురాలు రేణుక. చిత్రంలో కేటీఆర్, మధుసూదనాచారి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి తదితరులు



హైదర్‌గూడలో కేటీఆర్‌తో మాట్లాడుతున్న మూసీ బాధితులు. చిత్రంలో మాజీ మంత్రి మహమూద్ అలీ



కిషన్‌బాగ్‌లో కేటీఆర్ పర్యటన సందర్భంగా భారీగా తరలివచ్చిన మూసీ బాధితులు



నాడు అధికారులకు తెల్వదా

పైసాపైసా కూడబెట్టుకొని పేదలు భూములు కొని ఇండ్లు కట్టుకున్నరు. ఈ స్థలం ఎఫ్‌టీఎల్‌లో ఉన్నదా? బఫర్ జోన్‌లో ఉన్నదా? అనేది నాడు అధికారులకు తెల్వదా? ఎట్ల పర్మిషన్లు ఇచ్చిండ్రు? కరెంటు, మంచినీటి బిల్లులు ఎట్ల ఇచ్చిండ్రు? ఇవన్నీ లెక్కలోకి తీసుకోకుండా కూల్చడం మంచి పద్ధతి కాదు. వెంటనే ప్రభుత్వం మూసీ సుందరీకరణ, కూల్చివేతల నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలి.

-వనం నర్సింహ, నందనవనం, హైదర్‌గూడ



ఈ దుస్థితి ఎవరికీ రావద్దు

ప్రజలను కష్టాలపాల్జేయడమే ప్రజాపాలనా? ప్రజలు బిక్కుబిక్కుమని బతికే పరిస్థితి తెచ్చిండ్రు.చిన్న పిల్లలు, వారి తల్లిదండ్రుల బాధలు, కన్నీళ్లు చూడలేకపోతున్నం. ఆడోళ్లు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నరు. ఇలాంటి దుస్థితి ఎవరికీ రావద్దు.

-అప్పారెడ్డి ముఖేశ్, అత్తాపూర్



కాంగ్రెస్ నాయకులు చోద్యం చూస్తాండ్రు

మేమంతా తిండెక్కువై రోడ్లమీదికి వస్తలేం.. అన్యాయాన్ని ప్రశ్నిస్తున్నం. కాంగ్రెస్ పెద్దలు ఒక్కరు కూడా బయటకొచ్చి మా మంచిచెడ్డలు చూస్తలేరు. ఇండ్లళ్ల కూర్చొని చోద్యం చూస్తున్నరు. డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తమంటున్నరు. వాటిలో సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు ఉండాలి. అప్పుడు మేం కూడా వచ్చి ఉంటం. మా కాయకష్టంతో కట్టుకున్న ఇంటిని వదిలి వెళ్లేందుకు ఏమాత్రం ఒప్పుకోం.

- త్రినాథ్, అత్తాపూర్



సచ్చుడో.. బతుకుడో తెలుస్తలేదు

మా పరిస్థితి సచ్చుడో.. బతుకుడో తెలుస్తలేదు. మంచి చేస్తమని నమ్మించి ఇప్పుడు నట్టేట ముంచుతున్నరు. పేదలను ఇబ్బంది పెట్టుడు తప్ప మంచి చేయాలని రేవంత్‌రెడ్డికి లేనట్టున్నది. తినే తిండి కూడా కడుపులకు పోతలేదు. మా పరిస్థితి తలుచుకుంటే కండ్ల నీళ్లు ఆగుతలెవ్వు. -రేణుక, అత్తాపూర్



ఇక్కడ బత్కాలంటే భయమైతాంది

ఇక్కడ బత్కాలంటే భయమైతాంది. రోజుకొకడు వచ్చి వేధిస్తున్నరు. ఇల్లు ఖాళీ చేయాలని బెదిరిస్తున్నరు. మా ఆయన చిన్న ఉద్యోగం చేసి రిటైర్డ్ అయితే వచ్చిన డబ్బుతో చిన్న ఇల్లు కట్టుకున్నం. అప్పుడు కాంగ్రెస్సే ఉన్నది. మరి అప్పుడెట్ల పర్మిషన్ ఇచ్చిండ్రు? మేం కష్టపడి కట్టుకున్న ఇంటిని ఉన్నపళంగా కూల్చేస్తామంటే ఏడికి పోవాలె? మా పాణం పోయినా ఈన్నే ఉంటం.

-చంద్రకళ, వృద్ధురాలు, అత్తాపూర్

నిర్మాణరంగంలో తీవ్ర సంక్షోభం

ప్రభుత్వ ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణాలు పడక • 'హైడ్రా'తో ప్రైవేటు నిర్మాణాలు బంద్
భయంలో ఇండ్ల కొనుగోలుదారులు • ఉత్పత్తి నిలిపేస్తున్న సిమెంట్ కంపెనీలు
కరెంటు బిల్లులు కూడా చెల్లించలేని స్థితిలో స్టోన్ క్రషర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిర్మాణ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన వివిధ ప్రాజెక్టులు, భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తిగా పడకేశాయి. దీనికితోడు హైడ్రా కూల్చివేతలతో బిల్డర్లు నిర్మాణాలను నిలిపివేయగా.. ఇండ్ల కొనుగోలుదారులు సైతం భయభ్రాంతులకు గురవుతున్నారు. దీంతో నిర్మాణ రంగానికి సంబంధించిన పరిశ్రమల ఉనికి ప్రశ్నార్థంగా మారింది. ఇప్పటికే సిమెంట్, కంకర, రెడీమిక్స్ విక్రయాలు దాదాపు 50% మేరకు పడిపోవడంతో పలు పరిశ్రమలు తమ ఉత్పత్తులను నిలిపివేస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మాణ రంగం ఉత్పత్తుల విక్రయాలు 40 ఏండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయినట్లు పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా సిమెంట్ విక్రయాల్లో గణనీయంగా తగ్గుదల నమోదు కావడంతో కొన్ని కంపెనీలు తమ ఉత్పత్తులను నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కొవిడ్ సంక్షోభం నాటి పరిస్థితులు పునరావృతమయ్యాయని, 6 నెలలుగా పరిస్థితి ఘోరంగా మారిందని పరిశ్రమ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. స్వరాష్ట్రంగా ఏర్పడిన తర్వాత పదేండ్లపాటు తెలంగాణ అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందడంతోపాటు, పలు జాతీయ అవార్డులను కూడా సొంతం చేసుకున్నది. భారీ నీటి పారుదల ప్రాజెక్టులతోపాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నిర్మాణ కార్యకలాపాలు ఊపందుకోవడంతో ఇసుక, సిమెంట్‌కు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. గత పదేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వమే లక్షల టన్నుల సిమెంట్‌ను కొనుగోలు చేసింది. ఆ తర్వాత తెలంగాణలో ప్రభుత్వం మారడంతో అభివృద్ధికి ఒక్కసారిగా బ్రేకులు పడ్డాయి. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లను కూల్చివేస్తుండటం, నిర్మాణ అనుమతుల్లో విపరీతంగా అవినీతి పెరిగిపోవడంతో బిల్డర్లు తమ ప్రాజెక్టులను నిలిపివేశారు. మరోవైపు, కొనుగోలుదారులు సైతం ఏ భవనం సక్రమమో, ఏ భవనం అక్రమమో, ఏ భవనాన్ని ఎప్పుడు కూల్చివేస్తారో తెలియక తీవ్ర గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఫలితంగా ఇండ్ల విక్రయాలు అమాంతం పడిపోయాయి. దీంతో సిమెంట్ పరిశ్రమలు, స్టోన్ క్రషర్లు, ఇటుక బట్టీలు, రెడీమిక్స్ ప్లాంట్ల ఉనికి ప్రశ్నార్థంగా మారింది. పనులు దొరక్క లక్షల మంది కార్మికులు తమ సొంత ఊళ్లకు వెళ్లిపోతున్నారు.

ఉత్పత్తి నిలిపివేస్తున్న సిమెంట్ కంపెనీలు

డిమాండ్ లేక టన్ను సిమెంట్ ధర రూ.వెయ్యికి క్షీణించిందని, దీంతో విక్రయాలు జూలైలో 40%, ఆగస్టులో 30 శాతానికిపైగా పడిపోయాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఉత్తర తెలంగాణలోని ఓ ప్రముఖ సిమెంట్ కంపెనీ జూలైలో 10 రోజులు, సెప్టెంబర్‌లో 12 రోజులపాటు ఉత్పత్తిని నిలిపివేసిందని, మిగిలిన కంపెనీలు సైతం తమ ఉత్పత్తులను 40% మేరకు తగ్గించుకున్నాయని చెప్తున్నారు.

రెడీమిక్స్ ప్లాంట్లు బంద్

రెడీమిక్స్ ప్లాంట్లు కూడా తమ కార్యకలాపాలు నిలిపివేశాయి. ప్రభుత్వంతోపాటు బిల్డర్ల నుంచి బిల్లులు రాకపోవడం, ప్రైవేటు బిల్డర్ల నుంచి కూడా గిరాకీ లేకపోవడంతో ఇప్పటికే పలు ప్లాంట్లను తాత్కాలికంగా నిలిపివేసినట్టు ఆర్‌ఎంసీ పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. గత 3 నెలల్లో ఆర్‌ఎంసీ విక్రయాలు 40% మేరకు పడిపోయినట్టు తెలిపాయి.

స్టోన్ క్రషర్లు, ఇటుక బట్టీల మూత

నిర్మాణ రంగం సంక్షోభ ప్రభావం స్టోన్ క్రషర్లు, ఇటుక బట్టీలపై కూడా పడింది. రాష్ట్రంలోని దాదాపు 470 స్టోన్‌క్రషర్లలో ఇప్పటికే చాలా మూతబడినట్టు తెలుస్తున్నది. ఆర్డర్లు లేక కంకర, రోబో శాండ్ నిల్వలు పేరుకుపోవడం, గత 3 నెలల్లో విక్రయాలు 50 శాతానికిపైగా పడిపోవడం, కరెంటు బిల్లులు చెల్లించే పరిస్థితి లేకపోవడం ఇందుకు కారణమని స్పష్టమవుతున్నది. మిగిలిన క్రషర్లలోనూ తరచుగా ఉత్పత్తిని నిలిపివేస్తున్నట్టు ఆ పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, గత 3 నెలల్లో ఇటుకల విక్రయాలు కూడా 50% మేరకు పడిపోవడంతో ఇప్పటికే చాలా బట్టీలను మూసేసినట్టు వాటి యజమానులు తెలిపారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి తెలంగాణకు వచ్చే ఇటుక కూడా పూర్తిగా నిలిచిపోవడంతో ప్రస్తుతం తమ వద్ద పేరుకుపోయిన నిల్వలను అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు.

కాంగ్రెస్, బీజేపీ చీకటి స్నేహం?

కేంద్రంలో పోరాటం.. రాష్ట్రంలో చెట్టపట్టాల్
రేవంత్ ప్రజావ్యతిరేక విధానాలపై బీజేపీ మౌనం
రాష్ట్రంలో పరిణామాలపై పరిశీలకుల అభిప్రాయం

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): అక్కడ కయ్యం, ఇక్కడ వియ్యం అన్నట్టుగా రెండు ప్రధాన జాతీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయని తెలంగాణలో రోజువారీ పరిణామాలను గమనిస్తున్న పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్రంలో బద్ధ విరోధులుగా ఉంటున్న కాంగ్రెస్, బీజేపీ రాష్ట్రంలో మాత్రం స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నట్టున్నాయని పేర్కొంటున్నారు. పది నెలల పాలనలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నా బీజేపీ ఇంతవరకు స్పందించకపోవడం అనుమానాస్పదంగా ఉన్నదని అంటున్నారు. హైడ్రాకు వికృతరూపమిచ్చి పేదల ఇండ్ల మీదికి వదలడంతో వందల కుటుంబాలు రోడ్డు పడుతున్నాయి. రూ 2 లక్షల రుణమాఫీ కోసం లక్షల మంది రైతులు గంపెడు ఆశతో ఎదురుచూస్తున్నారు. రైతు భరోసా అందక, అప్పు పుట్టక రైతన్నలు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా బీజేపీ నాయకులు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మీద ఒక్క విమర్శ కూడా చేయకపోగా.. ఏ అధికారమూ లేని బీఆర్‌ఎస్‌ను, కేసీఆర్‌ను టార్గెట్ చేస్తూ విమర్శించటం పట్ల స్వయంగా ఆ పార్టీల శ్రేణులే విస్మయం వ్యక్తంచేస్తున్నాయి.

బంధానికి అనుమానాలెన్నో


అమృత్ స్కీం టెండర్లలో జరిగిన కుంభకోణాన్ని బహిర్గతం చేసిన బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బాధ్యులను చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు సైతం ఆయన ఆధారాలతో సహా లేఖ రాశారు. ఈ విషయంలో మొదట్లో కొంత హడావుడి చేసినట్టు కనిపించినా బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆ తరువాత మౌనం దాల్చారు. ఇక హైదరాబాద్‌లో హైడ్రా ఆగడాలతో పేదలు గూడులేని పక్షులుగా మారిపోతున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నా బీజేపీ నేతలు మాత్రం స్పందించలేదు. చివరికి తాము ఎక్కడ వెనుకబడిపోతామోనన్నట్టు కేంద్ర మంత్రి బండి సంజయ్ సోమవారం స్పందించారు. చెరువులు, కుంటలను ఆక్రమించి సంపన్నులు నిర్మించిన భవనాలను హైడ్రా కూల్చివేస్తుందని భావించామని, కానీ పేద, మధ్య తరగతి ప్రజల ఇండ్లను కూల్చి వాళ్లకు నిలువ నీడలేకుండా చేస్తున్నదని విమర్శించారు.

- రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచిపోయింది. ఇప్పటివరకు మహిళలకు ఉచిత బస్సు మినహా ఏ గ్యారెంటీని అమలు చేయలేదు. ఉచిత బస్సుతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపలేదు. ఫలితంగా 9 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేస్తున్నారు. ప్రజాభవన్ సాక్షిగా ఒక ఆటోడ్రైవర్ తన ఆటోను తగులబెట్టి నిరసన వ్యక్తంచేశారు. ఈ పరిణామాలపై బీజేపీ పల్లెత్తు మాట మాట్లాడకపోవడమే కాకుండా అసలది సమస్యే కాదన్నట్టుగానే వ్యవహరిస్తున్నది.
- రాష్ట్రంలో ఇంకా 22 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కానేలేదు. కాంగ్రెస్ పాలన 10 నెలల మైలురాయిని దాటకమందే రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు 300 మార్కును దాటేశాయి. దీనిపై బీఆర్‌ఎస్ వీధి పోరాటాలు, ధర్నాలు, రస్తారోకోలు చేస్తున్నది. ఈ విషయంలో మొదట్లో కొంత హడావుడి చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆ తరువాత మిన్నకుండిపోయారు. ప్రతి జిల్లాలో రైతుల ఆందోళనలు ఉధృతమవుతున్న నేపథ్యంలో.. ఇంతకాలం మౌనం వహించిన బీజేపీ నేతలు తప్పనిసరి పరిస్థితిలో సోమవారం రైతుల పక్షాన నిరసన దీక్ష చేపట్టారు.
- రాష్ట్రంలో బియ్యం టెండర్లలో రూ.1100 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని బీఆర్‌ఎస్ అసెంబ్లీ లోపలా, బయటా ఆధారాలతో సహా వెల్లడించింది. ప్రభుత్వం స్పందించకపోవటంతో ప్రజాధనాన్ని కాపాడాలనే ఉద్దేశంతో హైకోర్టును సైతం ఆశ్రయించింది. తొలుత ఈ వ్యవహారాన్ని బయటపెట్టిందే తామేనన్నట్టు, పేటెంట్ తమదే అన్నట్టు చెప్పుకున్న బీజేపీ నేతలు నాలుగైదు మీడియా సమావేశాలు పెట్టి ఆ తరువాత చడీచప్పుడు లేకుండా ఉండిపోవడం అనుమానాలకు తావిస్తున్నది.
- కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు కొత్తచట్టాలను ఇండియా కూటమిలోని పలు భాగస్వామ్యపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. తమిళనాడు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఆ చట్టాల అమలు విషయంలో పునరాలోచించాలని కేంద్రానికి లేఖలు రాశాయి. ఈ చట్టాలపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ప్రకటించాలని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సర్కార్ మాత్రం ఆ చట్టాలను అమలు చేస్తున్నది.
- ఇటీవలి భారీ వర్షాలతో అతలాకుతలమైన ఖమ్మం పట్టణంలో ప్రభుత్వం పునరావాస, సహాయక చర్యలను గాలికి వదిలేసింది. దీనిపై బీజేపీ నేతలు ప్రభుత్వాన్ని పల్లెత్తు మాట కూడా అనలేదు. దీంతో కాంగ్రెస్, బీజేపీ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.
- సీఎం రేవంత్‌రెడ్డితో బీజేపీ మైత్రిబంధం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బహిరంగ రహస్యమైందనే చర్చ సాగుతున్నది. కరీంనగర్ పార్లమెంటు స్థానం నుంచి పోటీచేసిన బండి సంజయ్ సునాయాసంగా గెలవటానికి వీలుగానే అక్కడ కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థిని నిలబెట్టిందనే ఆరోపణలువచ్చాయి.

సుందరీకరణతో బాగుపడేదెవరు?

- రేవంత్‌కు కూల్చుడు తప్ప నిర్మించడం రాదు: హరీశ్

సిద్దిపేట/సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 30: సీఎం రేవంత్‌రెడ్డికి కూల్చడం తప్ప నిర్మించడం రాదని, మనుషులు బతుకుడు ముఖ్యమా? సుందరీకరణ ముఖ్య మా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. మూసీ సుందరీకరణతో ఎవరి బతుకులు బాగు పడతాయని ప్రశ్నించారు. సోమవారం సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో ఆటో క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేల కుటుంబాలను ప్రభుత్వం ఆగం చేస్తున్నదని, లక్షల మంది రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభు త్వం హైడ్రా పేరిట డ్రామాలు ఆపాలని అన్నారు. 56 మంది ఆటో కార్మికులు చనిపోతే ప్రభుత్వ పెద్దలు ఒక్క కుటుంబాన్నీ పరామర్శించ లేదని, ఒక్క కుటుంబాన్ని ఆదుకోలేదని తెలిపారు. చనిపోయిన ఆటో కార్మికులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.


చనిపోయిన ఆటో కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం చెక్కులు అందజేస్తున్న మాజీ మంత్రి హరీశ్

బుల్డోజర్ రాజ్‌ను నిరోధించండి

తెలంగాణలో బుల్డోజర్ రాజ్‌ను నిరోధించేలా సీఎం రేవంత్‌రెడ్డికి సూచించాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి మాజీ మంత్రి హరీశ్‌రావు సూచించారు. రాష్ట్రంలో దుర్మార్గపాలన సాగుతున్నదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ పౌరహక్కులను నిరంతరం ధిక్కరిస్తున్నదని పేర్కొంటూ రాహుల్‌గాంధీకి ఆయన బహిరంగ లేఖ రాశారు. మానవత్వాన్ని, న్యాయాన్ని బుల్డోజర్ కింద తొక్కి అణచివేస్తున్నదని దుయ్యబట్టారు. మూసీ రివర్ ఫ్రంట్, హైడ్రా ప్రాజెక్టుల విషయంలో సోమవారం హైకోర్టు చేసిన వ్యాఖ్యలే నిదర్శమని ఉదహరించారు.

ఉత్తరాదిలో బీజేపీ తరహాలో పాలన

ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, గుజరాత్, అసోం, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో పేదలు, మధ్య తరగతిపై బీజేపీ ఎలా బుల్డోజర్లను ఉపయోగించిందో తెలంగాణలో కాంగ్రెస్ కూడా అలాగే ఉపయోగిస్తున్నదని హరీశ్ ఉదహరించారు. బుల్డోజర్ విషయంలో రేవంత్‌పాలన బీజేపీ దారిలో నడుస్తున్నదని విమర్శించారు. బుల్డోజర్ కూల్చివేతలపై సుప్రీం కోర్టు తీర్పు ఉన్నా కనీస సర్వేలు కూడా చేయకుండా సరైన విధానాలను అనుసరించకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పేదల ఇండ్లను బుల్డోజ్ చేస్తూ వారిని నిరాశ్రయులను చేస్తున్నదని వివరించారు. 'సహజ న్యాయ సూత్రాలను, చట్టాలను గౌరవించే విధంగా ముఖ్యమంత్రికి సలహా ఇవ్వండి' అని సూచించారు. రాష్ట్రంలో ఖూనీ అవుతున్న ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

రూల్ ఆఫ్ లాకు వ్యతిరేకంగా ప్రభుత్వ తీరు

సుప్రీంకోర్టు తీర్పును కాదని, రాష్ట్ర ప్రభుత్వం రూల్ ఆఫ్ లాకు విరుద్ధంగా వెళ్తున్నదని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు అనేది లా ఆఫ్ ది ల్యాండ్‌గా భావించాల్సి ఉంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్లు, ఫుట్‌పాత్, రైల్వే, నది, చెరువు అంతర్భాగాలు అక్రమించుకున్న వాటిని మినహా ఏ ఇతర నిర్మాణాలను కూల్చవద్దని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినట్టు గుర్తు చేశారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే, ప్రజాక్షేత్రంతో పాటు న్యాయస్థానాల్లో వాటిని ఎదుర్కోవాల్సివస్తుందని హెచ్చరించారు.

హైడ్రా ఆర్డినెన్స్‌కు గవర్నర్ కొర్రీలు?

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): హైడ్రాకు చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌కు ఇంకా గవర్నర్ ఆమోదం లభించలేదని సమాచారం. ఆమోదానికి వెళ్లిన ఫైలుపై గవర్నర్ పలు కొర్రీలు వేసినట్టు తెలుస్తున్నది. హైడ్రా ఏర్పాటు, పరిధి, విధివిధానాలకు సంబంధించి న్యాయపరమైన పలు అంశాలను ప్రస్తావించినట్టు సమాచారం. సెప్టెంబర్ 20న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో హైడ్రాకు సంబంధించిన ఆర్డినెన్స్‌ను తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గవర్నర్‌కు అధికారులు వివరించారు. అయితే, గవర్నర్ పలు అనుమానాలను వ్యక్తం చేసినట్టు తెలిసింది.

అక్రమ నిర్మాణాలను తొలంగించాల్సిందే: సీపీఐ

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలను తొలంగించాల్సిందేనని, అయితే ముందుగా పేదలకు పునరావాసం కల్పించిన తర్వాతే వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ సూచించారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, నాలాలను ఆక్రమించి నిర్మించిన విల్లాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లలోని నిర్మాణాలను తక్షణమే తొలగించాలని డిమాం డ్ చేశారు. మఖ్దూంభవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా బడాబాబుల జోలికి వెళ్లకుండా పేదల ఇండ్లను తొలగిస్తూ భయాభ్రంతులకు గురిచేయడం తగదని పేర్కొన్నారు.

కూల్చివేతలు బంద్‌పెట్టు.. హామీలపై దృష్టిపెట్టు

- హైడ్రాకు కర్త, కర్మ, క్రియ సీఎం రేవంత్‌రెడ్డే
- వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే హై'డ్రామా'
- ఇందిరమ్మ రాజ్యమంటే పేదల ప్రాణాలు తీయడమా?
- శాసమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ఫైర్


సోమవారం అసెంబ్లీ హాల్‌లో మీడియాతో మాట్లాడుతున్న మధుసూదనాచారి తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): 'పది నెలల పాలనా కాలంలో సీఎం రేవంత్‌రెడ్డి పేద, మధ్య తరగతి ఇండ్లను కూల్చుడు.. కేసీఆర్‌ను తిట్టుడు తప్ప చేసిందేమీ లేదు. ఇకనైనా కూల్చుడు బంద్ పెట్టి ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టు' అని శాసమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. హైడ్రాకు కర్త, కర్మ, క్రియ రేవంత్‌రెడ్డేనని, ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకే దీనిని తెచ్చి ప్రజలను బాధపెడుతున్నారని విమర్శించారు. మొన్న హైడ్రా, నిన్న మూసీ, ఇప్పుడు ఫోర్త్‌సిటీ పేరుతో డైవర్షన్ డ్రామాకు తెరతీశారని ఆరోపించారు. పది నెలలుగా రాష్ట్రంలో పాలన పడకేసిందని విమర్శించారు. దవాఖానల్లో మందులు కరువయ్యాయని, గురుకులాల్లో మెస్సులు లేవని దుయ్యబట్టారు. మహాలక్ష్మి స్కీం కింద తెచ్చిన ఉచిత బస్సు పథకం తుస్సుమన్నదని విమర్శించారు. పంటకాలం పూర్తవుతున్నా రైతు భరోసా ఊసే లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తులం బంగారం, నాలుగువేల పింఛన్ మాటే ఎత్తడం లేదని నిప్పులు చెరిగారు. సోమవారం ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎల్ రమణ, నవీన్‌రెడ్డితో కలిసి అసెంబ్లీహాల్‌లో విలేకరులతో మధుసూదనాచారి మాట్లాడారు. హైడ్రా కూల్చివేతలతో మహానగరంలో ప్రజలు హాహాకారాలు చేస్తున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే శుభకార్యాలతో మొదలు పెట్టాలని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి కూల్చివేతలను ప్రారంభించారని విమర్శించారు. హైడ్రా కూల్చివేతలను హైకోర్టుతో పాటు ప్రతిఒక్కరూ తప్పుపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ మిత్రపక్షమైన సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సైతం హైడ్రాకు దారితెన్ను తెలియడంలేదని విమర్శించారని గుర్తుచేశారు. రేవంత్ వ్యవహారం ఉట్టికి ఎగరలేనమ్మ.. స్వర్గానికి ఎగిరినట్టుగా ఉన్నదని వ్యాఖ్యానించారు.

దౌర్జన్యమే ఇందిరమ్మ పాలనా?

ఇందిరమ్మ పాలన అంటే పేదలపై దౌర్జన్యానికి దిగడమేనా? అని మధుసూదనాచారి ప్రశ్నించారు. 1976లో ఇందిరాగాంధీ ఢిల్లీలో తుర్క్‌మన్ గేటులో పేదల ఇండ్లపై బుల్డోజర్లు ఎక్కించి అడ్డొచ్చిన పది మంది పేదల ప్రాణాలు తీశారని గుర్తుచేశారు. 2008లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం భీంరావువాడ బస్తీవాసులపై ఇలాగే దౌర్జన్యకాండకు దిగిందని విమర్శించారు. ఇప్పుడు అన్ని అనుమతులు ఉన్న ఇండ్లను కూల్చివేస్తూ ప్రభుత్వమే ప్రజలకు సమస్యగా మారిందని చెప్పారు. దిక్కుతోచని పరిస్థితుల్లో ప్రజలు రేవంత్‌ను తిట్టని తిట్లు తిడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు వారు కేసీఆర్ పాలన కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. 'రేవంత్‌రెడ్డి కూల్చివేతలను ఆపకుంటే బీఆర్‌ఎస్ చూస్తూ ఊరుకోదు.. ఖబర్దార్' అని హెచ్చరించారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు డబ్బులిచ్చి ప్రభుత్వాన్ని తిట్టిస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు చెప్పారు. ప్రజల ఆవేదనను, ఆవేశాన్ని డబ్బుతో ముడిపెట్టడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. పిచ్చిపిచ్చి విమర్శలు మాని, ఇంటెలిజెన్స్ నుంచి నివేదికలు తెప్పించుకుంటే ప్రజల ఆవేదన తెలుస్తుందని సూచించారు. ఎల్ రమణ మాట్లాడుతూ హైడ్రా పేరిట ప్రభుత్వం పేదల గుండెల్లో గునపాలు దించుతున్నదని విమర్శించారు. ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా కూల్చివేతలు చేస్తుండడంతో బాధితులు భరోసా కోసం తెలంగాణ భవన్‌కు క్యూ కడుతున్నారని తెలిపారు. సీఎం తక్షణమే హైడ్రా కూల్చివేతలు ఆపాలని డిమాండ్ చేశారు.

మూసీ మార్కింగ్‌తో మాకు సంబంధం లేదు

రంగనాథ్ ట్వీట్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): హైడ్రా పరిధి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు మాత్రమేనని, హైడ్రా పేదల ఇండ్ల జోలికి పోదని, నివాసం ఉండే ఇండ్లను కూల్చేయదంటూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. సోమవారం ఆయన ఎక్స్ వేదికగా వరుసగా ట్వీట్లు చేశారు. మూసీ నదికి ఇరువైపులా కొనసాగుతున్న సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదని పేర్కొన్నారు. నదీ పరివాహక ప్రాంతంలోని ఇండ్లపై హైడ్రా మార్కింగ్ చేయలేదని స్పష్టంచేశారు. మూసీ పరిధిలో నివసిస్తున్న వారిని హైడ్రా తరలించడం లేదని, నదిలో ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదని తెలిపారు. మూసీ సుందరీకరణను మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతున్నదని వివరించారు. ప్రకృతి వనరుల పరిరక్షణ, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటం, వర్షాలు, వరదల సమయంలో రహదారులు, నివాస ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవడం హైడ్రా బాధ్యత అని తెలిపారు. కాగా ఇప్పటివరకు క్లారిటీ లేకుండా ఎందుకు దూకుడుగా వ్యవహరించారని నెటిజన్లు హైడ్రా కమిషనర్‌పై మండిపడుతున్నారు.

పేదల ఇండ్లను కూల్చితే ఊరుకోం

కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్

కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 30: హైడ్రా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లను కూల్చివేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అవసరమైతే తమ ప్రాణాలను అడ్డు పెట్టి అయినా ప్రజల ఆస్తులను కాపాడతామని స్పష్టం చేశారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ ప్రాణాలను తీసిన తరువాతే హైడ్రా పేదల ఇండ్లపైకి వెళ్లాలని సూచించారు. జీతాలకే పైసల్లేక అల్లాడుతుంటే మూసీ ప్రక్షాళన పేరుతో అప్పు తెచ్చి దోచుకునేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని దుయ్యబట్టారు. హైడ్రా తీరు చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కొరివితో తలగోక్కుంటున్నట్టు ఉన్నదని అన్నారు.


పాతబస్తీలో హైడ్రాకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేస్తున్న పోలీసులు

పాతబస్తీలోకి వచ్చే దమ్ముందా?

ముఖ్యమంత్రి రేవంత్, హైడ్రా అధికారులకు ఎంఐఎం సవాల్

- కూల్చడానికి ముందు మాపై నుంచి వెళ్లాలి
- హైడ్రా హటావో.. ఘర్ బచావో.. నినాదాలు
- పాతబస్తీలో అట్టుడికిన ఆందోళనలు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): 'హైడ్రా హటావో.. ఘర్ బచావో' నినాదం పాత బస్తీలో మార్మోగింది. సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రాకు వ్యతిరేకంగా ఎంఐఎం ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నాయకులు బహదూర్‌పుర, కిషన్‌బాగ్‌లో సోమవారం పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా బహదూర్‌పుర ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ మాట్లాడుతూ.. పాత బస్తీలోకి బుల్డోజర్లు వచ్చే దమ్ముందా.. వస్తే తామేంటో చూపిస్తామని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం మొండిగా ఇండ్లను కూల్చడానికి యత్నిస్తే.. బుల్డోజర్ల ముందు తాము నిలబడతామని సవాల్ విసిరారు. ఎవరూ భయపడాల్సిన అవసరంలేదని చెప్పారు. ఎలాంటి నష్టపరిహారం, ప్రత్యామ్నాయ నివాసం ఏర్పాటు చేయకుండా రేవంత్ సర్కార్ పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నదని విమర్శించారు. 'హైదరాబాద్ కలెక్టర్‌తో చర్చించామని.. 2003లో మూసీ నది ఫిజికల్ సర్వే ప్రకారం స్వాధీనం చేసుకోవాలని సూచించినట్టు పేర్కొన్నారు. మూసీ నిర్వాసితులకు మద్దతుగా ఆందోళన చేసిన కార్పొరేటర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్‌కు తరలించగా ఎంఐఎం నాయకులు వెళ్లాక విడుదల చేశారు.

హైడ్రాకు ఎంఐఎం సవాల్

హైడ్రా ఏర్పాటు నుంచి ఎంఐఎం పార్టీ వ్యతిరేక గళం వినిపిస్తూనే ఉన్నది. పాతబస్తీలోని ఫాతిమా కాలేజీ కూల్చివేయాలని ప్రచారం జరగడంతో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ఘాటుగా స్పందించారు. 'కావాలంటే నాపై మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి.. కత్తులతో దాడి చేయండి. కాలేజీలను మాత్రం కూల్చేయకండి' అంటూ అక్బరుద్దీన్ చేసిన కామెంట్స్‌పై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. విద్యాసంవత్సరం మధ్యలో విద్యార్థులకు నష్టం చేయమని హైడ్రా వెనక్కి తగ్గి, పేదల ఇండ్లను కూల్చుతుండడంపై విమర్శలు వస్తున్నాయి.

- హైడ్రాపై ఎర్రబావుటా


హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద మూసీ బాధితులు నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న సీపీఎం నేతలు

- హైడ్రాపై వినూత్న నిరసన


ఆక్రమణల పేరిట పేదల ఇండ్లే టార్గెట్‌గా కూల్చివేతలకు పాల్పడుతూ, పెద్దల జోలికి వెళ్లని హైడ్రాపై కాంగ్రెస్ మాజీ నాయకుడు బక్క జడ్సన్ వినూత్న రీతిలో నిరసనకు దిగారు. హైడ్రా తరహాలోనే పలు ప్రభుత్వ భవనాలపై మార్కింగ్ చేశారు.

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

చెడగొట్టు సర్కార్‌కు చెంపపెట్టు

పిల్లాపాపలతో తలదాచుకున్న గూడుపై రాబందులు విరుచుకుపడిన బీభత్స, భయానక దృశ్యం రాష్ట్ర ప్రజలను వేధిస్తున్నది. అక్రమ నిర్మాణాల కూల్చివేత పేరిట రాష్ట్రంలోని నిరంకుశ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ధ్వంసరచన కనీవినీ ఎరుగని స్థాయిలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. హైడ్రా పేరిట సర్కారు సాగిస్తున్న కర్కోటకం ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నది. దీని ఫలితంగా ప్రభుత్వంపై వ్యక్తమవుతున్న ప్రజాగ్రహం కూడా మిన్ను ముట్టింది. పైసా పైసా కూడబెట్టి కట్టుకున్న కలల గూడు చెదిరిపోతుంటే తెలంగాణ ఆడబిడ్డలు తిరగబడి దుర్మార్గ ప్రభుత్వంపై కురిపించిన తిట్లు వైరల్ అవుతున్నాయి. ఆందోళన తరిమి తరిమి ఆత్మహత్యలకు పురికొల్పుతుంటే మండే గుండెల్లో నుంచి తిట్లు కాక దీవెనలెలా వస్తాయి? అమాయక జనాలను మాయదారి సర్కారు ఆగమాగం చేసిన ఫలితం కాదా ఇది?

బాధ్యత గల ప్రభుత్వం పేదల బాధల గురించి ఆలోచించాలి కదా? నిన్నటిదాకా తెలియదా అక్రమమో, సక్రమమో? జాగా అమ్మకం జరిగినప్పుడు రిజిస్ట్రేషన్ ఆదాయం పొందినప్పుడు లేని, కరెంటు కనెక్షన్ ఇచ్చి బిల్లు వసూలు చేసినప్పుడు లేని, ఆస్తిపన్ను కట్టించుకొన్నప్పుడు లేని అక్రమ ముద్ర రాత్రికి రాత్రే గుర్తుకువచ్చిందా? ఇప్పటికిప్పుడు ఇంటిగోడల మీద రక్తాక్షరాలు రాయడం ఏమిటి? ప్రాణాలు బలిగొనడం ఏమిటి? యుద్ధంలో శత్రుదేశం మీదకు శతఘ్నులను తోలినట్టుగా పేదల ఇండ్ల మీదకు ఉన్నపళంగా బుల్డోజర్లను నడిపిస్తే ఎలా? వారి నుంచి ఇంతకాలంగా వసూలు చేస్తున్న పన్నులూ, సుంకాలూ వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తారా? మూసీ మధ్యన ప్రభుత్వ భవనాలూ ఉన్నాయి. మరి వాటినీ కూలుస్తారా? హైదరాబాద్‌లోని అనేక జలవనరుల్లోని స్థలాలు కాంగ్రెస్, టీడీపీ హయాంలో ఆక్రమణలకు గురయ్యాయి. ఆ పార్టీలను నిలదీస్తారా? సామాన్యులపై ఉక్కుపాదం మోపుతున్నట్టుగానే అస్మదీయుల ఆస్తులూ కూలుస్తారా?

బుల్డోజర్ కథ ఎక్కడో మొదలై, ఎన్నెన్నో మలుపులు తిరిగి చివరికి పేదల ఇండ్ల మీద పిడుగుపాటులా విరుచుకుపడటం మనం చూస్తున్నాం. బాధితుల హాహాకారాలు, ఆర్తనాదాలు దయలేని దగా ప్రభుత్వంపై శాపనార్థాలై విరుచుకుపడటం మనం వింటున్నాం. దిక్కుతోచని పరిస్థితిలో బిక్కుబిక్కుమంటున్న నిస్సహాయులకు బీఆర్ఎస్ నాయకత్వం 'మేమున్నా'మంటూ అండగా నిలవడం ప్రశంసనీయం. జనతా గ్యారేజ్ తెరిచి 24 గంటలు అందుబాటులో ఉంటామని హామీ ఇవ్వడం హర్షణీయం. కట్టడమే తెలిసిన పాలన నుంచి కూలగొట్టడమే పనిగా పెట్టుకున్న పాలనలోకి వెళ్లిపోయామనే బాధ ప్రజల్లో స్పష్టంగా వ్యక్తమవుతుండటం గమనార్హం.

ఈ నేపథ్యంలో హైకోర్టు హైడ్రా వ్యవహారంపై వెలువరించిన తీర్పు చెడగొట్టు ప్రభుత్వానికి చెంపపెట్టు. న్యాయవ్యవస్థతోనే దోబూచులు, దొంగాటలు ఆడుతున్న ప్రభుత్వంపై, ముఖ్యంగా హైడ్రా బాధ్యులపై ఉన్నత న్యాయస్థానం తీవ్ర విమర్శలు చేసింది. అడ్డూఅదుపూ లేని దూకుడుకు కళ్లెం వేసింది. తక్షణమే దారికి రాకపోతే అసలుకే ఎసరు వస్తుందని, ఏకంగా హైడ్రానే రద్దు చేయాల్సి వస్తుందని తాఖీదు జారీచేసింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ అంటూ నాలుగు ముక్కలను పట్టుకుని వీరంగం వేస్తున్న ప్రభుత్వానికి గట్టిగా గడ్డి పెట్టింది. ఇప్పటికైనా ప్రభుత్వం తన బాధ్యతను గుర్తెరిగి తప్పులు దిద్దుకోవాలి. సామాన్యులను కడగండ్ల పాలుచేస్తున్న ఇష్టారాజ్యపు నిర్వాకానికి తెరదించాలి. చేసిన హారాకిరిపై చెంపలు వేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి. లేకపోతే ఇప్పుడు హైకోర్టులో జరిగినట్టుగానే రేపు ప్రజాకోర్టులో పరాభవం తప్పదు.

రేవంత్, రంగనాథ్‌ల అరాచకం

జలాశయాల ఆక్రమణలు, మూసీ ప్రాజెక్టు విషయాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ల వ్యవహారశైలి అరాచకంగా ఉంది. ఆ విషయం సోమవారం నాటి హైకోర్టు విచారణలో మళ్లీ స్పష్టమైంది. అరాచకం అనేది నిజానికి పెద్దమాట. అయితే అందుకు తగిన నిర్వచనం, అర్థం ఉన్నాయి. రాచరికం అంటే ఒక రాజ్యం, దాని వ్యవస్థ. ఆ వ్యవస్థకు తాను స్వయంగా ఏర్పరచుకునే విధానాలు, వాటి అమలుకు తగిన పద్ధతులుంటాయి. అటువంటి విధానాలు, పద్ధతులు లేకపోయినా, ఉన్నప్పటికీ వాటిని అనుసరించకపోయినా, లేదా అందుకు భిన్నంగానో, విరుద్ధంగానో వ్యవహరించినా దానిని అరాచకం అంటారు. జలాశయాల ఆక్రమణలు, మూసీ ప్రాజెక్టుకు సంబంధించి ముఖ్యమంత్రి, హైడ్రా కమిషనర్‌లు వ్యవహరిస్తున్న తీరు అక్షరాలా అరాచకంగానే ఉంది.



టంకశాల అశోక్



మొన్న శనివారం నాడు రంగనాథ్‌తో పాటు, మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ ఎండీ దానకిశోర్ కొన్ని గంటల పాటు జరిపిన మీడియా సమావేశంతోనూ ఆ స్థితి తొలగిపోలేదు. అక్కడ వారు చెప్పినవి అరకొరగా, ప్రస్తుతం తలెత్తిన ప్రశ్నలకు సంబంధించి అసంపూర్తిగా, పరస్పర విరుద్ధంగా, బాధితులకు మసిబూసి మారేడు కాయ చేసేవిగా ఉన్నాయనేవి ఒకటి. అంతకన్న ముఖ్యంగా, ఈ పాటి పని అయినా అసలు హైడ్రా అమలుకు ముందే ప్రజలకు ప్రజాస్వామికంగా, పారదర్శకంగా వివరించే పని చేయటానికి బదులు, ఇప్పుడు బాధితుల ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు, రోదనలు వేదనలు మొదలైన తర్వాత గాని మొదలుకానిది ఎందువల్ల అనేది మరొకటి. ఆ పని చేయని ప్రభుత్వం వారు, ఉన్నతాధికారులు ఇప్పుడు ప్రజల నిరసనలు తీవ్రమవుతుండటంతో, బీఆర్ఎస్ తదితర ప్రతిపక్షాలు రంగంలోకి రావటంతో జంకిపోయి వివరణల పేరిట తిరిగి వంచనలకు పాల్పడుతున్నారు. ఇట్లా ఈ వ్యవహారం మొత్తం అరాచకంగా ఉందనటానికి గల కారణాలు ఏమిటో ముందుగా చూసి, తక్కిన చర్చలోకి తర్వాత వెళదాము.

> **హైడ్రాను ముఖ్యమంత్రి గత జూలైలో ప్రకటించారు. అప్పటినుంచి రెండు నెలలకు పైగా గడిచాయి. జలాశయాలకు సంబంధించి అయిదు రకాల ఉల్లంఘనలు ఉన్నాయన్నారు ఆయన. ఒకటి, చెరువులు, సరస్సుల ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు, రెండు, వాటి బఫర్‌జోన్‌లో నిర్మాణాలు, మూడు నాలాలు, పార్కులను ఆక్రమించి నిర్మాణాలు, నాలుగు, ప్రైవేట్ పట్టాలుండి అనుమతి లేకుండా చేసిన నిర్మాణాలు, అయిదు, ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకుండా చేసిన నిర్మాణాలు. వీటిలో ముందుగా మొదటి మూడింటిపై పూర్తి దృష్టి పెడతామని ప్రకటించారు.**

ఈ ఆక్రమణల వల్ల నీటి ప్రవాహం లేకపోవటం, మురుగు, వరదల కారణంగా ఇప్పటికే చాలా సమస్యలు వచ్చాయని, వాతావరణం దెబ్బతినటం వాటిలో ఒకటని, అది భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే పైన పేర్కొన్న అయిదు చర్యలు అవసరమని అన్నారు. మూసీకి సంబంధించి మూసీ సుందరీకరణ పథకాన్ని లక్షన్నర కోట్ల రూపాయలతో అతి భారీ స్థాయిలో ప్రకటించారు. ఇందుకు రూ.50 వేల కోట్లు అని మొదట చెప్పి అంతలోనే మూడు రెట్లు ఎందుకు పెంచారనే ప్రశ్న ఉంది గాని, దానిని పక్కన ఉంచుదాము.

యథాతథంగా ఈ లక్ష్యాలు మంచివి కావని ఇంతవరకు ప్రతిపక్షాలతో సహా ఎవరూ అనలేదు. అంతేకాదు, బాధిత ప్రజలలోనూ అనేకులు మూసీ శుద్ధి మంచి పనేనని, అందుకు తాము సహకరించటంతో పాటు విరాళాలు ఇవ్వగలమని కూడా స్వయంగా అంటుండటం గమనించదగిన విషయం. మరి సమస్య ఎక్కడ వస్తున్నది? ఇది రాచకంగా సాగటానికి బదులు అరాచకంగా మారింది ఏ విధంగా? సూటిగా చెప్పాలంటే ఇందులో మొదటి దోషి రేవంత్‌రెడ్డి. తర్వాత దోషులు రంగనాథ్, దాన కిశోర్‌లు. ప్రభుత్వం ఏదైనా చేయదలచుకుంటే ఆ విషయాలను రాజుల కాలంలో కూడా ముందుగా ఊరూరా చాటింపులతో చెప్పేవారు. ఇప్పుడు మనం ఆధునిక ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నాం. మనకొక రాజ్యాంగం, చట్టాలు, వాటి అమలు తీరుపై విచారణకు న్యాయస్థానాలున్నాయి. భారతదేశం సంక్షేమ వ్యవస్థ అని, సామాన్యులకు, పేదలకు అనుకూలమని ప్రకటించుకున్నాం. మరొకవైపు ప్రజలకు తమ హక్కుల పట్ల చైతన్యం ఇప్పటికే చాలా పెరిగింది. అయినా ఇటువంటి అరాచకమంటే దుస్సాహసమే.

ఇటువంటి పరిస్థితులలో ముఖ్యంగా రేవంత్ రెడ్డి, తర్వాత రంగనాథ్, దాన కిశోర్‌లు అనుభవజ్ఞులైన సీనియర్ అధికారులుగా చేయవలసిందేమిటి? ఈ లక్ష్యాలు చాలా ముఖ్యమైనవి. వాటి అమలు వల్ల కలిగే ఫలితాలను అట్లుంచి, అమలు క్రమంలో ప్రజల జీవితాలపై, కుటుంబాలపై నివాసాలపై, పరిసరాలపై, ఆర్థిక పరిస్థితులపై, వ్యాపార కార్యకలాపాలపై, చదువులూ, ఉద్యోగాలపై, సామాజిక సంబంధాలపై, కుటుంబ సంబంధాలపై, నిర్వాసితుల పునరావాసాలపై పడే ప్రభావాలు అనేక విధాలుగా ఉంటాయి. అంతేకాదు, ఒక నిర్మాణానికి రెడ్ మార్క్ వేయదలచినప్పుడు అందుకు సంబంధించిన అధికారిక అనుమతుల పూర్వాపరాలపై పలు ప్రశ్నలు తలెత్తుతాయి. నిర్వాసితులకు నష్టపరిహారాలు, పునరావాస ప్రశ్నలు బృహత్తర రూపంలో ముందుకొస్తాయి. మరోవైపు న్యాయపరమైన అంశాలపై కోర్టులు జోక్యం చేసుకుంటాయి. ఇవి పై ముగ్గురికి తెలియనివి కావు. ఊహించలేనివి కావు. అటువంటప్పుడు ఏమి చేయాలి? అసలు జూలైలో హైడ్రాను ప్రకటించటానికి ముందే ఈ విషయాలన్నింటిపై మేధోమథనం జరిపి, పైన పేర్కొన్న అంశాలకు సంబంధించి విధి విధానాలను, సమాధానాలను సిద్ధం చేసి పెట్టుకోవాలి. అది బాధ్యత గల పద్ధతి. తర్వాత వాటిని ప్రజాస్వామికంగా, పారదర్శకంగా ప్రజల ముందుంచి వారి అభిప్రాయాలను, సూచనలను తీసుకోవాలి. సందేహాలు తీర్చాలి. అవసరమైన సవరణలు చేసుకోవాలి. అప్పుడు, ఇంత మంచి ఆలోచనకు మీ సహకారం అవసరమని కోరాలి. స్థిర నివాసాలు గల ప్రజలే గాక చిన్న షెడ్లు వేసుకొని నివసించే, పనులు చేసుకునే పేదలను కూడా పరిరక్షించాలి.

అట్లా చేసి ఉంటే ఇపుడీ రకరకాల సమస్యలు వచ్చి ఉండేవి కావు. ఆ పనిచేసి ఉంటే అది రాచరికం అయేది. చేయలేదు గనుక అరాచకంగా మారింది. ఇందులో రంగనాథ్ గురించి విశేషంగా చెప్పుకోవాలి. ఆయన తీరును హాలీవుడ్ కౌబాయ్‌లతో పోల్చుతూ ఆ పదం మాత్రం వాడకుండా ఇప్పటికి రెండు సార్లు రాశాను నేను. ఇప్పుడు మరొక మాట అనవలసి వస్తున్నది. ఆయనకు గతంలో మంచి పేరైతే వచ్చింది గాని అదే సమయంలో టిపికల్ పోలీస్ సంస్కృతి బాగా వంటబట్టినట్టున్నది. మొదటినుంచి ఆయన మాటలు, చేతలు, చివరికి మూడు సార్లు హైకోర్టు నుంచి మందలింపులు, ప్రశ్నలు ఎదుర్కొనవలసి రావటం, అయినప్పటికీ తన ధోరణి మారకపోవటం ఒకవైపు ఫక్తు పోలీసు సంస్కృతిని, మరొకవైపు హైడ్రా అమలు విషయంలో అరాచకతను, కొంత అహంభావాన్ని సూచిస్తున్నాయి. అవి అప్రజాస్వామికత లక్షణాలు. ప్రజల హక్కులకు భంగకరమైనవి. చట్టానికి కూడా విరుద్ధమైనవి.

శనివారం నాటి మీడియా సమావేశంలో ఆయన రాజ్యాంగ సూత్రాలను, ఎవరో పెద్దాయనను (ఆ పేరు టీవీలో వినిపించలేదు. మరునాడు పేపర్లు రాలేదు) ఉటంకిస్తూ ఎంతో సమున్నతంగా మాట్లాడేందుకు ప్రయత్నించారు. కాని తన వాస్తవమైన తీరు మాత్రం అందుకు అనుగుణంగా లేదు. ఈ విషయమై చెప్పేందుకు ఎన్ని దృష్టాంతాలైనా ఉన్నాయి. అవన్నీ ప్రజలు మాట్లాడుకుంటున్నవే అయినందున ఇక్కడ రాయనక్కరలేదు. ఆయన శనివారం నాడు ఒక విధంగా సంజాయిషీ అనిపించే తీరులో మాట్లాడినవి కూడా ప్రజలను ఒప్పించే విధంగా లేనందున కనీసం ఇప్పటికైనా తన మనస్సాక్షికి తాను సంజాయిషీ ఇచ్చుకుని మారటం అవసరం. గత కొద్దిరోజుల విషయానికి వస్తే, బుచ్చమ్మ ఆత్మహత్య లేదా మరణంతో హైడ్రాకు ఏ సంబంధం లేదంటూ ఆ రోజున టిపికల్ బ్యురాక్రటిక్ శైలిలో చేతులు దులుపుకున్నారు. అది నడవలేదని అర్థమై శనివారం మీడియా సమావేశంలో, తాము నోటీసులేమీ ఇవ్వలేదని, ఎవరో ఆమెను భయపెట్టారని, హైడ్రా వచ్చేస్తున్నదన్నారంటూ తిరిగి అదే టిపికల్ పద్ధతిలో కొత్త ఎస్కేపిస్టు కథను అల్లారు. ఎవరైనా భయపెట్టినా, ఆమె స్వయంగా భయపడి ఉండినా, ఆ పేద వృద్ధురాలి భయానికి సృష్టి ఎక్కడ జరిగింది? ఆయన ధోరణి ఒకప్పుడు ఒరిస్సాలోని కలహండిలో పేదరికం వల్ల పెద్ద సంఖ్యలో ఆకలిచావులు సంభవిస్తుండగా, అవి ఆకలి చావులు కాదు పోషకాహార లోపం వల్ల జరిగినవంటూ ప్రభుత్వం లోకాన్ని వంచింపజేయ చూడటాన్ని గుర్తుకుతెస్తుంది.

> **ఇటువంటి వంచనలు ప్రభుత్వ నేతలకు అవసరం కావచ్చు. కానీ, తమకు కూడా అవసరమని కొందరు అధికారులు ఎందుకు భావిస్తారో వారి మానసికతల గురించి అధ్యయనం చేస్తే గానీ తెలియదు. వారు కనీసం పిల్లల పుస్తకాలను, ఉడుకుతున్న అన్నం గిన్నెలను, షెడ్లలోని సామాన్లను ఎందుకు తీసుకోనివ్వరో అప్పుడు అర్థమవుతుంది.**

పోతే, ప్రభుత్వ అరాచక వ్యవహరణ గురించి కొంత చెప్పుకోవలసి ఉంది. హైడ్రా పరిధి ప్రస్తుతం ఓఆర్ఆర్ వరకు వర్తిస్తుందన్నారు. ఈ పరిధిలో గల చెరువులు, నాలాల సంఖ్యను దాన కిశోర్ చెప్పారు. కాని వాటన్నింటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లపై కచ్చితమైన సమాచారాన్ని జూలైలో హైడ్రా ప్రకటనకు ముందే సేకరించవలసింది. వాటి మ్యాపులు, శాటిలైట్ చిత్రాలు, పంచాయితీ మ్యాపుల మధ్య గల తేడాలు, వేర్వేరు ప్రభుత్వ ఏజెన్సీల మధ్య గల తేడాలను పరిశీలించి ఒకే రూపంలో ప్రామాణికంగా తుది నిర్ధారణ చేయవలసింది. అన్నింటికీ భూమిపై హద్దులు కూడా పాతవలసింది. ఇది చేయనందున సమస్య ఇండియా-చైనా సరిహద్దు వలె తయారైంది. అక్కడ బ్రిటిష్ అధికారి మెక్‌మోహన్ పోతూ పోతూ కాగితాలపై డీ లిమిటేషన్ చేశాడు గానీ, భూమిపై డీమార్కేషన్ నేటికీ జరగలేదు. దానితో ఇద్దరం పేచీ పెట్టుకున్నాం. ఇదే స్థితి ఇప్పుడు దుర్గం చెరువులో కనిపిస్తుంది. ఇదిట్లా ఉండగా, ఈ పరిధులలో ఆక్రమణలు, అమ్మకాలు, అధికారిక అనుమతులు, స్థలాల రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలకు అనుమతులు, అన్నివిధాల పౌర సౌకర్యాల కల్పనలు, దశాబ్దాల తరబడిగా అన్ని రుసుముల వసూళ్లు, దీనంతటిలో నాయకులు, పైరవీకార్లు, బిల్డర్లు, బ్రోకర్లు, రియల్ ఎస్టేట్ వారి పాత్రలు, లంచాలు, ఓట్ల రాజకీయాలు, గూండా గిరీలు వగైరాలతో సమస్తం గజిబిజిగా తయారైంది. ఇక స్వయంగా ప్రభుత్వ ఆక్రమణల సంగతేమిటి?

ప్రభుత్వం వీటిని పరిగణనలోకి తీసుకొని సంబంధిత సమాచారాలు సేకరించిందా? ప్రశ్నలకు జవాబులు కనుగొన్నదా? ప్రభుత్వం వైపు నుంచి ఒక అతి ముఖ్యమైన లోపం ఆక్రమణలు అనే వాటికి వెనుకకు వెళ్లి కటాఫ్ తేదీని ప్రకటించకపోవటం. నిజాం కాలమా, హైదరాబాద్ రాష్ట్ర కాలమా, ఉమ్మడి రాష్ట్రమా, తెలంగాణ ఏర్పడిన 2014గా. నిర్మాణాలు చేసింది వ్యక్తులా, బిల్డర్లా, సహకార సంఘాలా, నిర్మాణం తర్వాత చేతులు మారాయా, కుటుంబ సభ్యుల మధ్య పంపకాలు జరిగాయా, స్థలాలను ప్రభుత్వాలే ఏవో పథకాల కింద పంపిణీ చేశాయా, క్రమబద్ధీకరణలు ఏవైనా జరిగాయా అనే ఆలోచనలు, నిర్ణయాలు ఏవీ చేయలేదు. ఇవి గాని, వివిధ అక్రమ అనుమతులనిచ్చిన అధికారులను, అక్రమ బిల్డర్లను, అక్రమ ఆక్రమణదారులను, అక్రమంగా డబుల్ రిజిస్ట్రేషన్లు చేసిన రిజిస్ట్రార్లను (ఇదొక పెద్ద సమస్య) డాక్యుమెంట్ల పరిశీలనలో గుర్తించటం ఎంతమాత్రం సమస్య కాదు.

కానీ, ఇటువంటి చేయవలసిన పనులేవీ చేయకుండా యథేచ్ఛగా జేసీబీలు నడుపుతున్నారు. ఓఆర్ఆర్ లోపల చెరువులు, నాలాల వివరాలు సేకరించాలని, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తించాలని, అర్హులైన పేదల వివరాలు తయారుచేయాలని, కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి రావద్దని, ప్రజలను ఒప్పించాలని ముఖ్యమంత్రి ఇప్పుడు సెప్టెంబర్ చివరిలో, ఒకవైపు విధ్వంసం కొనసాగుతుండగా సెలవిస్తున్నారు. అంటే అవేవీ ఇప్పుడు లేనట్టు కదా? అనుమతులు, కూల్చివేతలు, నోటీసులు, మార్కింగ్‌లపై రంగనాథ్ శనివారం నాడు మరొక మారు మాటల గారడీ చేశారు. ఒకటి, రెండు కేసులేవో తనకు అనుకూలమైనవి చెప్పి అసలు అరాచకాన్ని దాచిపెట్టజూశారు.. కూల్చివేసినా లోన్లు కట్టాలి అదెట్లా, ఇక్కడినుంచి ఎక్కడికో వెళ్లగొడితే అక్కడ పనిపాటలెట్లా, పిల్లల చదువులెట్లా, ఒక్క డబుల్ బెడ్‌రూంలో మా నాలుగు కుటుంబాలు ఉండేదెట్లా, అన్ని అనుమతులతో కట్టుకున్న మమ్ములను కబ్జాకోరులంటూ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడమేంటి, మా ఇళ్లు కొన్ని దశాబ్దాల పాటు చట్టబద్ధమై ఇప్పుడెట్లా చట్ట విరుద్ధమవుతున్నాయి, గతంలో ఎన్నడూ లేనిది ఇప్పుడు రాత్రింబవళ్లు భయంతో జీవించే పరిస్థితి తెచ్చారెందుకు అంటూ బాధితులు అనేక ప్రశ్నలు వేస్తున్నారు. ఆదివారాలు కూల్చొద్దంటూ సుప్రీంకోర్టు ఉత్తర్వులుండగా ఆ పని ఎందుకు చేస్తున్నారని, స్టే ఉత్తర్వులను ఎందుకు ఉల్లంఘిస్తున్నారని హైకోర్టు ప్రశ్నించింది.

వీటివేటికీ జవాబులు లేని హైడ్రా కమిషనర్ బధిరత్వాన్ని నటిస్తున్నారు. కోర్టు ఉండని శని, ఆదివారాలలో వీకెండ్ టెర్రర్ సినిమాను యథావిధిగా చూపుతున్నారు. ముఖ్యమంత్రేమో అంతా భగవద్గీతానుసారమంటూ మనలను కొంత ఆశ్చర్యానికి, కొంత వినోదానికి గురిచేశారు. కూల్చివేతలలో పార్టీలను చూడబోమన్న ఆయన కొడంగల్‌లో స్వయంగా తన ఇల్లు, దుర్గం చెరువులో సోదరుని ఇల్లు, హిమాయత్‌సాగర్‌లో పొంగులేటి మొదలైన వారి ఇళ్లుంటే, మీడియా ఎత్తిచూపినప్పటికీ పెదవి విప్పటం లేదు. హైడ్రా కమిషనర్ తన చమత్కారమంతా ప్రదర్శిస్తున్నారు. హైడ్రా చట్టబద్ధమా, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల మ్యాపులు ఎక్కడ? నోటీసులు ఇవ్వకుండానో, ఇచ్చిన కొన్ని గంటలలోనో ఎట్లా కూలుస్తారనే హైకోర్టు ప్రశ్నలకు జవాబులుండవు. కొత్తవే కూలుస్తాం, నివాసాలు ఉంటున్నవారివి కూల్చం వగైరాల మాటలు చెప్పే రంగనాథ్, మార్కింగ్‌లు ఎందుకు చేయిస్తున్నారో, తాత్కాలిక గుడిసెలు, షెడ్లలో నివసించేవారు, చిన్న వ్యాపారాలు చేసుకునే వారి బతుకేమిటో మాత్రం చెప్పరు. అసలు ప్రభుత్వానికి ఒక ఆలోచన, ప్రణాళిక ఉంటే గదా చెప్పేందుకు. హైడ్రా చర్యలకు, తక్కిన శాఖలకు ఎటువంటి సమన్వయం లేని అరాచకం నడుస్తున్నది.

శనివారం నాటి మీడియా సమావేశంలో మరి కొన్ని విచిత్రాలు కనిపించాయి. మూసీపై చేస్తున్నది సుందరీకరణ పథకమని ముఖ్యమంత్రి ఇంతకాలం హోరెత్తించగా, అదేమాట ప్రజలలోకి వెళ్లిపోగా, ఆ మాటతో ఇప్పుడు చిక్కులు, వ్యతిరేకతలు వస్తున్నట్లు గ్రహించి కావచ్చు, అది సుందరీకరణ కాదని, మూసీని కాలుష్యరహితం చేసి నది స్వచ్ఛంగా ప్రవహించేట్లు చేయటం మాత్రమేనని చెప్పి నమ్మించేందుకు రంగంలోకి లేట్‌గా ప్రవేశించిన దాన కిశోర్ గట్టిగానే ప్రయత్నించారు. ఎవరినీ బలవంతంగా డబుల్ బెడ్‌రూం ఇండ్లకు పంపబోమని ఇన్నాళ్ల మౌనం తర్వాత ఇప్పుడు హామీ ఇస్తున్నారు. హెల్ప్ డెస్క్‌లని ఇప్పుడు మాట్లాడుతున్నారు. ఆయా ప్రాంతాల పేదలు అక్కడి డబుల్ బెడ్‌రూంల కోసం ఇంతకాలం ఎదురుచూడగా, ఇప్పుడు వాటిని బయటివారికిస్తారా అంటూ గగ్గోలు పెడుతున్నారు. అదైనా, బాధితులు 10,660 మంది కాగా (కొన్ని ఇళ్లలో ఒకటికన్న ఎక్కువ కుటుంబాలున్నాయి మరి) డబుల్ ఇళ్లు నాలుగైదు వేలేనన్న దాన కిశోర్, మరో 15 వేల ఇళ్ల కోసం 700 కోట్లు అడిగామంటున్నారు. ఆ పని ఎప్పటికయ్యేనో ఎవరైనా ఊహించవచ్చు. ఇంతకూ ఇప్పుడు ఇస్తున్నవైనా బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టించినవన్న మాట మాత్రం చెప్పరు.

> **మౌలికంగా ఆలోచిస్తే అర్థమయ్యేది ఇదంతా వ్యవస్థ వైఫల్యం. ఎప్పటినుంచో వీరు వారని గాక అందరివల్ల జరిగిన వైఫల్యాలు. అనేక వైపుల నుంచి జరిగిన వైఫల్యాలు. మొదటనే అనుకున్నట్టు ప్రస్తుత ప్రభుత్వం అరాచకం మాత్రం ప్రజల మెడపై కత్తిలా నిలిచింది. నేరం మరొకరిది కాగా శిక్ష అనుభవిస్తున్నది ప్రజలు. ప్రతిపక్షంలో ఉండగా ఒక మాట, అధికారానికి వచ్చినాక మరొకటి మాట్లాడటం అలవాటైపోయిన రేవంత్‌రెడ్డి ఆ బాధిత ప్రజలతో మాత్రం మాట్లాడరు.**


> **ఇది రాచకంగా సాగటానికి బదులు అరాచకంగా మారింది ఏ విధంగా? సూటిగా చెప్పాలంటే ఇందులో మొదటి దోషి రేవంత్‌రెడ్డి. తర్వాత దోషులు రంగనాథ్, దాన కిశోర్‌లు. ప్రభుత్వం ఏదైనా చేయదలచుకుంటే ఆ విషయాలను రాజుల కాలంలో కూడా ముందుగా ఊరూరా చాటింపులతో చెప్పేవారు. ఇప్పుడు మనం ఆధునిక ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నాం. మనకొక రాజ్యాంగం, చట్టాలు, వాటి అమలు తీరుపై విచారణకు న్యాయస్థానాలున్నాయి.**

వరదల ప్రభావాన్ని సాధ్యమైనంత వరకు నివారించడానికి జలాశయాలను, కాల్వలను రక్షించే క్రమంలో ప్రభుత్వాలు కఠిన చర్యలను తీసుకుంటున్నాయి. అదే సమయంలో ప్రకృతిలో సమతుల్యతను కాపాడేందుకుగానూ పచ్చదనాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత కూడా తమదేనన్న విషయాన్ని ప్రభుత్వాలు మరువకూడదు. జాతీయ అటవీ విధానం ప్రకారం.. దేశంలో పచ్చదనం సాంద్రత 33.33 శాతం ఉండాలి. అయితే, 2023 నాటికి మన దేశంలో 20.71 శాతం పచ్చదనం సాంద్రత మాత్రమే ఉండటం ఆందోళనకరం. అంటే, ఇంకా 12.62 శాతం పచ్చదనం ఉండాలి.

పచ్చని చెట్టుకు చిచ్చు



యన్.సుశీల
97034 15047



పచ్చదనం తగ్గితే కిరణజన్య సంయోగక్రియ తగ్గుముఖం పడుతుంది. తద్వారా వాతావరణంలో బొగ్గుపులుసు వాయువు పెరిగి, ప్రాణవాయువు తగ్గుతుంది. సగటున ఒక పీపీఎం బొగ్గుపులుసు వాయువు పెరిగితే, 2.15 పీపీఎం ప్రాణవాయువు తగ్గినట్టే. గత శతాబ్ద కాలంలో వాతావరణంలో 0.1 శాతం ప్రాణవాయువు తగ్గిందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో పచ్చదనాన్ని పెంచాల్సిందిపోయి అభివృద్ధి పేరిట చెట్లను నరకటం ఎంతవరకు సమంజసం?

హైదరాబాద్‌కు 70 కిలోమీటర్ల దూరంలోని దామగుండం అటవీ ప్రాంతం గురించి ఇటీవల తరచుగా వార్తల్లో వింటున్నాం. వికారాబాద్ జిల్లాలోని పూడూరు మండలంలో ఉన్న దామగుండం అటవీ జీవ వైవిధ్యంతో కూడుకున్న ప్రాంతం. అరుదైన ఔషధ మొక్కలతో పాటు విలువైన వృక్ష, జంతుజాతులకు ఈ ప్రాంతం నెలవు. ఈ నేపథ్యంలో అతి తక్కువ ఫ్రీక్వెన్సీ రాడార్ కేంద్రం కోసం అరుదైన వృక్షజాతులకు ఆలవాలమైన ఈ అటవీ ప్రాంతాన్ని భారత నౌకాదళానికి కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించడం ఆందోళనకరం. ఈ ప్రతిపాదన వచ్చిన నాటి నుంచీ స్థానికులతో పాటు దేశవ్యాప్తంగా పర్యావరణ కార్యకర్తల్లో కలవరం మొదలైంది. ఈ తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయానికి వ్యతిరేకంగా దామగుండం అడవులను రక్షించడా నికి ఒక బృందం ఏర్పడింది. వాస్తవానికి రాడార్ కేంద్రం ఏర్పాటు చేస్తే కలిగే దుష్ప్రభావాల గురించి దామగుండం అటవీ సంరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ నేతృత్వంలో పర్యావరణవేత్తలు దశాబ్దకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దామగుండం అటవీ ప్రాంతంలో సుమారు 2,900 ఎకరాల విస్తీర్ణంలో ఈ రాడార్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. అందుకోసం దాదాపు 12 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుంది. ఈ కేంద్రం వల్ల సమీపంలోని 20 గ్రామాల్లోని 60 వేల మందికి పైగా ప్రజల జీవనం అతలాకుతలమవుతున్నది. చిన్న, సన్నకారు రైతులు, అడవిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నవారు, పాడిరైతుల జీవనోపాధిపై ఇది ప్రతికూలం ప్రభావం చూపుతుంది. అటవీ నిర్మూలన కారణంగా నేల కోత పెరుగుతుంది. తద్వారా మూసీ, కాగ్నా నదులు ప్రభావితమవుతాయి. ఈ కేంద్రం నుంచి వెలువడే రేడియేషన్, అటవీ నిర్మూలన ఫలితంగా జరిగే పుప్పొడి కాలుష్యం కారణంగా శ్వాసకోశ రుగ్మతలు వస్తాయి. అంతేకాదు, చారిత్రక బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయానికి తీరని నష్టం జరిగే ఆస్కారం ఉన్నది.

> **రాడార్ కేంద్రాన్ని నెలకొల్పడం వల్ల స్థానికంగా కొన్ని ఉద్యోగాలు రావచ్చు. మొదట్లో నష్టం చాలా చిన్నదిగా కనపడవచ్చు. కానీ, దీర్ఘకాలంలో భారీమూల్యాన్ని చెల్లించుకోక తప్పదు. ఈ ప్రాజెక్టు నిర్మాణం మొదలైతే చుట్టుపక్కల ప్రాంతం కూడా ఎంతోకొంత అభివృద్ధి చెందుతుంది. అందువల్ల పచ్చదనం మరింతగా తగ్గే ప్రమాదం ఉన్నది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల గాలి, నీరు కలుషితమవుతాయి. దీర్ఘకాలిక పరిణామాల వల్ల అనేక జంతుజాలాలు అంతరించిపోతాయి. అంతేకాదు, మూసీ నదికి కన్నీటి బాధలు తప్పవు. నది గొంతు బిగుసుకుపోతుంది. దామగుండం నదీ పరీవాహక ప్రాంతం కావడంతో మరింత జాగ్రత్త పడాల్సిన అవసరమున్నది. ఆ ప్రాంతంలో ఏ మాత్రం విధ్వంసం జరిగినా దాని ప్రభావం తప్పకుండా హైదరాబాద్ నగరంపై పడుతుంది. వరదలు వచ్చే ఆస్కారమూ లేకపోలేదు.**


తెలంగాణలో ప్రస్తుతం 24.06 పచ్చదనం ఉన్నది. అంటే, ఇంకా 9.27 శాతం పచ్చదనం పెరగాలి. అలాంటి తరుణంలో అటవీ విస్తీర్ణాన్ని పెంచాలే గాని తగ్గించకూడదు. అడవుల నరికివేత వల్ల భూతాపం పెరుగుతుంది. తద్వారా రుతుపవనాలు ప్రభావితమై నీటి చక్రంలో మార్పులు సంభవిస్తాయి. ఒకే ప్రాంతంలో అసాధారణంగా వర్షాలు పడతాయి. ఇప్పటికే, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో వివిధ నిర్మాణాల కారణంగా పచ్చదనం తగ్గిపోయింది. నగరం కాలుష్య కోరల్లో ఉక్కిరిబిక్కిరవుతున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదిక (2024) ప్రకారం.. హైదరాబాద్‌లో గాలి నాణ్యత ఉండాల్సిన దానికంటే చాలా తక్కువగా ఉన్నది. వాయు కాలుష్యం అంతకంతకు పెరుగుతున్నది. తత్ఫలితంగా నగరవాసులు గుండె, ఊపిరితిత్తుల వ్యాధుల బారినపడుతున్నారు. ఈ నేపథ్యంలో పచ్చదనాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అభివృద్ధి సాకుతో పర్యావరణాన్ని పాడు చేసే హక్కు మనకు లేదు. ఈ విషయాన్ని పాలకులు గ్రహిస్తే మంచిది.

అన్నీ గుజరాత్‌కే తరలిపోతున్నాయి!



గత రెండున్నరేండ్లుగా, ముఖ్యంగా ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రి (మహారాష్ట్ర) అయినప్పటి నుంచి అనేక పరిశ్రమలు గుజరాత్‌కు తరలిపోయాయి. ప్రతీది గుజరాత్‌కు తీసుకెళ్లిపోయారు. ముంబై ఎకనామిక్ సెంటర్‌ను కూడా అక్కడికే పట్టుకుపోయారు. మేం పోరాడేది అధికారం కోసం మాత్రమే కాదు, మహారాష్ట్ర దోపిడీకి వ్యతిరేకంగా కూడా.

- ఉద్ధవ్ థాక్రే, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి




తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, పార్టీ నేతలు తుల ఉమ, కార్తీక్‌రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌కు మూసీ బ్యాంక్

2400 కి.మీ 'నమామి గంగ'కు 40వేల కోట్లు • 55 కిలోమీటర్ల మూసీకి 1.50లక్షల కోట్లా? • మూసీ బాధితుల పాలిట కాలయముడిలా రేవంత్

రెడ్‌లైన్లు వేసుడు కాదు.. డెడ్‌లైన్లు పెడుతం • ఢిల్లీ పార్టీలను గెలిపిస్తే గల్లీ ప్రజలకు ఆక్రందనలే • రాహుల్, ప్రియాంకకు బాధితుల గోడు పట్టదా?

బాధితులకు అండగా.. బుల్డోజర్‌కు అడ్డుగా నిలుస్తాం • పేదల పక్షాన హైకోర్టుకు ధన్యవాదాలు • మరో సాగరహారం చేయాల్సి వస్తుందేమో?: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కార్ చెప్తున్న మూసీ సుందరీకరణ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వచ్చే సాధారణ ఎన్నికల కోసం ఈ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు రిజర్వ్ బ్యాంకులా, ఏటీఎంలా ఉపయోగపడుతుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన హామీలు 300 రోజులైనా అమలు కావడంలేదని, ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రజలకు అక్కరకు రాని అంశంపై లక్షన్నరకోట్లు ఖర్చు పెట్టడం ఎవరి కోసమని నిలదీశారు. పేదల పక్షాన హైకోర్టుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'రెండు వేల పింఛన్ నాలుగు వేలవుతుందని, రెండు లక్షల రుణమాఫీ అని, తులం బంగారంతో కల్యాణలక్ష్మిని అమలు చేస్తామని, 10వేల నుంచి 15 వేలకు రైతు బంధు పెంచుతామని, ఆటో డ్రైవర్లకు నెలకు వెయ్యి, మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పారు.. వీటికి మాత్రం పైసల్లేవు, చేతులు రావు.. ఇవన్నీ ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వకుండా అక్కరకు రాని, అక్కరలేని, ప్రజలు కోరుకోని సుందరీకరణ కోసం, ఏ ప్రాధాన్యం లేకుండా రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడుతామంటే ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇందులో ఏం ఆశించి చేస్తున్నారో చెప్పాలి' అని నిలదీశారు. '25వేల కుటుంబాలు, లక్ష మందిని నిరాశ్రయులను చేసేందుకు మూసీ బాధితుల పాలిట ముఖ్యమంత్రి కాలయముడిలా మారాడు' అని మండిపడ్డారు. నేరం చేసిందెవరు? శిక్ష ఎవరికి వేస్తున్నారు? అని ప్రశ్నించారు. 1994లో కాంగ్రెస్ సర్కార్ ఉన్నప్పుడే పట్టాలిచ్చారని, రిజిస్ట్రేషన్లు అయ్యాయని, అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నామని, రిజిస్ట్రేషన్లు చేసుకున్నప్పుడు, నిర్మాణాలకు అనుమతులిచ్చినప్పుడు, ఇంటి పన్ను కట్టించుకున్నప్పుడు, కరెంటు కనెక్షన్ ఇచ్చినప్పుడు, మంచి నీళ్ల బిల్లు కట్టుమన్నప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని బాధితులు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం వద్ద సమాధానం ఉన్నదా? అని నిలదీశారు.

మొదట వారిపై చర్యలు తీసుకోండి

ప్రభుత్వానికి దమ్ముంటే, చేతనైతే వీటికి అనుమతినిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైకోర్టు కూడా ఇదే చెప్పిందని గుర్తుచేశారు. 'కూల్చాల్సి వస్తే మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీస్, ఆ తర్వాత జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం.. ఈ రెండూ నాలా మీద కట్టారు.. ఇతరులకు సుద్దులు చెప్పే ముందు నీ దగ్గరి నుంచే మొదలు పెట్టు' అని కేటీఆర్ సూచించారు.

రాహుల్, ప్రియాంక ఎక్కడ?

మూసీ బాధితులు ఆక్రందనలు చేస్తుంటే కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎక్కడ? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు అశోక్‌నగర్‌లో చాయ్ తాగి, బిర్యానీ తిని ఓట్లు దండుకున్నారని దుయ్యబట్టారు. 'మూసీ ప్రాజెక్టు వల్ల మురిసేది ఎంత మంది?, రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంత?, మూసీ వల్ల ఒక్క ఎకరానికైనా సాగు నీరు వస్తుందా?, ఒక్క రైతుకైనా అదనంగా నీరందుతుందా? ఒక్క రిజర్వాయర్ అయినా వస్తుందా?.. ఏమీ లేకున్నా లక్షన్నర కోట్లు అంటే స్కాం కాదా' అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎం అన్నారని, మరీ మూసీ కాంగ్రెస్‌కు ఏటీఎం కాదా? అని నిలదీశారు. ఇది దేశంలోనే అతిపెద్ద కుంభకోణం కాదా? అని ప్రశ్నించారు.

వాటికే అంతయితే..

నమామి గంగే ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు, సబర్మతి రివర్ ఫ్రంట్‌కు రూ.7,050 కోట్లు, యమున రివర్ ప్రాజెక్టుకు రూ.1000 కోట్లు ఖర్చయితే మూసీకి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చుట? అని కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. పేదల ఇండ్లు కూలగొడుతామని ముందే చెప్పి ఉంటే ఒక్కరంటే ఒక్కరు కూడా కాంగ్రెస్‌కు ఓటు వేస్తుండేనా?' అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి మీడియాకు ముఖం చాటేశారని, మీడియాతో 'చీట్'చాట్ చేసే ఆయన, ఇప్పుడు ఏడి అంటూ ఎద్దేవా చేశారు. ఆయనకు భయం పట్టుకున్నదని, అధికారులను ముందుపెట్టి ప్రజల ఆగ్రహం నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని దెప్పిపొడిచారు.

నీ జాగీరా..

'అన్ని అనుమతులు తీసుకొని కట్టుకున్న ప్రజల ఇండ్లను కూలగొడుతామంటే బీఆర్ఎస్ ఉరుకోదు.. వారికి అండగా నిలబడుతాం. బుల్డోజర్లు వస్తే వాటికి ఎదురుగా మేమే నిలబడుతాం' అని కేటీఆర్ ప్రకటించారు. 'ప్రజల సొమ్మును ఇష్టమొచ్చినట్టు ఖర్చు పెట్టడానికి నీ జాగీరా, నువ్వు ఉంటవు, పోతవు.. నీ విలాసాలకు, హంగులకు ఖర్చు పెడుతవా? పేదలు బలికావాల్నా' అంటూ నిలదీశారు. ప్రజా కోర్టులో ఎండగడుతామని, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తామని స్పష్టం చేశారు.

ఇల్లు అనేది ఎమోషన్

'పేద, మధ్య తరగతి వారికి జీవితకాలం చేసిన కష్టానికి ప్రతీరూపం ఇల్లు. ఇల్లు అనేది ఒక ఎమోషన్. ఆ కుటుంబం మొత్తం కలలుగనే ఒక సౌధం, అది నాలుగు ఇటుకలు, రెండు రాళ్లతో కట్టిన కట్టడం కాదు.. ఇల్లు అనేది జ్ఞాపకాల పొదరిల్లు' అని కేటీఆర్ గుర్తుచేశారు. 'ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామంటే ఎంత బాధ ఉంటదో రేవంత్‌రెడ్డికి తెలియక పోవచ్చు కానీ నాకు తెలుసు. కేసీఆర్ కుటుంబం ఒక్కసారి కాదు.. రెండు సార్లు డిస్‌ప్లేస్ అయింది. నానమ్మకు చెందిన పోసాన్‌పల్లి అప్పర్ మానేరు డ్యాంలో 1940లో మునిగిపోతే చింతమడకకు వచ్చాం. అమ్మమ్మ గ్రామం మిడ్ మానేరులో మునిగిపోయింది. మా జ్ఞాపకాలు, ఇండ్లు అన్నీ అక్కడే పోయాయి' అని గుర్తుచేసుకున్నారు. కాంగ్రెసోళ్లు సునీల్ కనుగోలు డైరెక్షన్‌లో 500 మందిని సోషల్ మీడియాలో పెట్టి బాధితులంతా ఆక్రమణదారులని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 2016లో మొదటిసారిగా హైదరాబాద్‌లో చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను ఖరారు చేస్తూ తమ ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు.

కొనుక్కునే సంస్కృతి మీది..

ఐదు వేలు తీసుకొని మూసీ బాధితులు మాట్లాడుతున్నారంటూ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.50 కోట్లకు పీసీసీ ప్రెసిడెంట్ పదవి, రూ.500కోట్లకు సీఎం పదవి అమ్ముకోవడం, మంత్రులు పర్సంటేజీలు పంచుకోవడం లాంటి దిక్కుమాలిన అలవాట్లు ప్రజలకు ఉండవని ఎద్దేవా చేశారు. 'ఆత్మగౌరవం మీద కొడితే తెలంగాణ ప్రజలు తిరగబడుతరు.. వాళ్లు తిరగబడితే కాంగ్రెసోళ్లు ఊళ్లలో తిరగలేని పరిస్థితి వస్తుంది' అని హెచ్చరించారు. మంత్రి శ్రీధర్‌బాబుపై కొంత గౌరవం ఉండేదని, కానీ ఆయన మాటలతో గౌరవం పోయిందని చెప్పారు.

ముందు వాళ్లవి కూలగొట్టు..

'సీఎం ఇంట్లో నుంచి వచ్చే మురుగునీరు ఎక్కడికి పోతుందో అదయినా తెలుసా?' అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎస్టీపీలు లేవు కాబట్టి ఇండ్లు కూలగొడుతా అంటే హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు కూడా మిగలదు.. కొడంగల్‌లోని రెడ్డికుంట సర్వే నంబర్ 1138లో రేవంత్‌రెడ్డి కట్టుకున్న ఇల్లు కూలగొడుతవా? అని ప్రశ్నించారు. పేదల ఇండ్ల మీదికి వచ్చే ముందు ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి అన్న ఇల్లు, జంట జలాశయాలకు 500 మీటర్ల దూరంలో ఇండ్లు ఉండవద్దని ఉన్న ఆదేశాలను అమలు చేసి ఎమ్మెల్యేలు, మంత్రుల ఇండ్లను కూలగొట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో డిప్యూటీ సీఎం మూసీ డీపీఆర్ తయారు కాలేదని చెప్పారని, కాక ముందే ఇండ్లకు ఎందుకు మార్కింగ్ చేస్తున్నారని ప్రశ్నించారు. 'నువ్వు రెడ్ లైన్లు వేసుడు కాదు.. మేమే నీకు డెడ్‌లైన్లు పెడుతం' అని హెచ్చరించారు.

రేవంత్‌కు బీజేపీ ఎంపీల భజన

కాళేశ్వరం ప్రాజెక్టులో అక్కడి వారందరికీ గౌరవప్రదంగా పునరావాసం కల్పించామని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రాజెక్టులో ప్రజాభిప్రాయ సేకరణ చేయాలనే నిబంధన ఉన్నదనే విషయం ముఖ్యమంత్రికి తెలుసా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఏం చేసినా కాంగ్రెస్ ఎంపీల కంటే బీజేపీ ఎంపీలు ఎక్కువగా తప్పెట తాళాలు వేస్తున్నారని, చెక్కభజన చేస్తున్నారని ఎద్దేవాచేశారు. బీఆర్ఎస్ హయాంలో మూసీ సుందరీకరణకు కేటాయించాలనుకున్నది రూ.16 వేల కోట్లే అని చెప్పారు. సమావేశంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, జీ జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ రవీందర్ రావు, బీఆర్ఎస్ నేతలు కార్తీక్‌రెడ్డి, తుల ఉమ పాల్గొన్నారు.

జైలుకు పంపితే తెలిసొస్తుంది



హైడ్రా ఏర్పాటు జీవో 99 అమలును నిలిపివేస్తూ స్టే ఉత్తర్వులు జారీ చేయాల్సివస్తుంది. చట్టాలను అమలు చేయకుండా కోర్టు ఉత్తర్వులను ఖాతరు చేయకుండా కూల్చివేతలే ఏకైక లక్ష్యంగా దూకుడుగా చర్యలు తీసుకునే వాళ్లను చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్లకు పంపితే పరిస్థితులు తెలిసివస్తాయి. కూల్చివేతలకు ముందు నోటీసులు జారీచేసి ఆక్రమణదారుడి వివరణ కోరాలని తెలియదా? ఉరితీసే ముందు కూడా ఆ వ్యక్తి చివరి కోరిక అడుగుతారు కదా. - హైకోర్టు

- పొలిటికల్ బాస్‌ల మాట వింటే జైలుకే
- తహసీల్దార్ అడిగారని చార్మినార్, హైకోర్టును కూల్చేందుకూ సిబ్బందిని పంపిస్తారా?
- కూల్చివేతలు మాత్రమే హైడ్రాకు తెలుసా?
- ఇలాగైతే జీవో 99పై స్టే ఇవ్వాల్సి ఉంటుంది
- సెలవుల్లో కూల్చొద్దన్న ఆదేశాలున్నా ఇదేంపని?
- హైకోర్టు ఫుల్ బెంచ్ తీర్పు చదవలేదా?
- హైడ్రాకు చట్టబద్ధత ఏంటి.. నోడల్ ఏజెన్సీనే కదా
- కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు వార్నింగ్
- గంటన్నరపాటు సుదీర్ఘ వాదనలు

హైడ్రా చర్యలు ఏమాత్రం సంతృప్తిగా లేవు

మూసీ సర్వే ఇతర అంశాలు తమకు సంబంధం లేదని హైడ్రా కమిషనర్ కోర్టుకు తెలిపారు. దీనిపై తిరిగి కల్పించుకున్న హైకోర్టు.. హైడ్రా చేస్తున్న పనుల పట్ల హైకోర్టు ఏమాత్రం సంతృప్తికరంగా లేదని తేల్చి చెప్పింది. నిర్మాణాలను కూల్చడానికి మీకు ఉన్న అర్హత తెలపాలని కోరింది. కేవలం మీరు కూల్చివేతల పైన దృష్టి పెట్టారని, కూల్చివేతలపై మీ దగ్గర ఉన్న విధానం ఏమిటో చెప్పాలని కోరింది. అక్రమ కట్టడాల తొలగింపు చర్యలు సమర్థనీయమేనని, అయితే, ఆ చర్యలు చట్టాలకు లోబడి ఉండకపోతే ఎలా అని ప్రశ్నించింది. కూల్చివేతల చర్యలు ప్రభుత్వ కార్యాలయాలకు కోర్టులకు సెలవులు, వారాంతపు సెలవులో తీసుకోవడం హైకోర్టు తీర్పుకు విరుద్ధం అవుతుందని, కోర్టు ధిక్కారం అవుతుందని కూడా హెచ్చరించింది. కలెక్టర్ చెబితేనే కూల్చివేత చర్యలు తీసుకున్నామన్న తహసీల్దార్ వాదనను హైకోర్టు తప్పుపట్టింది. ఆదివారం కూల్చివేతలు సరైనవి కావని, ఆ రోజు కూల్చివేతలు చేపట్టవద్దని ఇదే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను చదువు కోవాలని నొక్కి చెప్పింది.

అమెరికాలో ఉద్యోగం చేసి ఆర్జించిన కష్టార్జితంతో హైదరాబాద్‌లో స్థిరపడాలనే కోరితే విల్లా కొనుక్కుంటే చెప్పాపెట్టకుండా ఆ విల్లాలను కూల్చేస్తే వాళ్ల జీవితాలు ఏం కావాలి? ప్రభుత్వమే స్థలాల రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతులు ఇచ్చాక ఆపై రిజిస్ట్రేషన్ చేసిన నాలుగైదేండ్లకు ఆ విల్లానో, ప్లాటునో కూల్చేస్తే వారి పరిస్థితి ఏంటి? -హైకోర్టు

పిటిషనర్‌కు 48 గంటల గడువు ఇచ్చి 40 గంటల్లోనే అది కూడా ఆదివారం సెలవు రోజున ఉదయం ఏడున్నర గంటలకే ఎందుకు కూల్చాల్సి వచ్చింది. హైకోర్టు సెలవుల్లో, సూర్యాస్తమయం అయ్యాక కూల్చివేత చర్యలు తీసుకోరాదన్న ఉత్వర్వులకు విరుద్ధంగా ఎందుకు కూల్చారు? - హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్30 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో కోర్టు ఆదేశాలతో ముడిపడిన భూమిలోని నిర్మాణాలను కూల్చివేసిన తహసీల్దార్, హైడ్రా కమిషనర్లపై హైకోర్టు నిప్పులు చెరిగింది. అనేక ప్రశ్నలతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గంటన్నరపాటు జరిగిన సుదీర్ఘ విచారణలో ప్రశ్న మీద ప్రశ్న వేస్తూ హైడ్రా కమిషనర్ ఆవుల రంగనాథ్, అమీన్‌పూర్ తహసీల్దార్ రాధను ఉక్కిరిబిక్కిరి చేసింది. హైడ్రా ఏర్పాటు జీవో 99 అమలును నిలిపివేస్తూ స్టే ఉత్తర్వులు జారీ చేయాల్సివస్తుందని స్వయంగా హైడ్రా కమిషనర్‌ను హెచ్చరించింది. చట్టాలను అమలు చేయకుండా కోర్టు ఉత్తర్వులను ఖాతరు చేయకుండా కూల్చివేతలే ఏకైక లక్ష్యం దూకుడుగా చర్యలు తీసుకుంటున్న వాళ్లను చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్లకు పంపితే పరిస్థితులు తెలిసివస్తాయని ఘాటు వ్యాఖ్యలు చేసింది. కూల్చివేతలకు ముందు నోటీసులు జారీచేసి ఆక్రమణదారుడి వివరణ కోరాలని తెలియదా? అని నిప్పులు చెరిగింది. ఉరితీసే ముందు కూడా ఆ వ్యక్తి చివరి కోరిక అడుగుతారని పేర్కొన్నది. ఆదివారం, సెలవు దినాల్లో కూల్చరాదని, సూర్యాస్తమయం తర్వాత కూల్చరాదన్న హైకోర్టు మార్గదర్శకాలు మీకు తెలియదా? అని నిలదీసింది. హైడ్రా నోడల్ ఏజెన్సీ మాత్రమేనని, అమీన్‌పూర్‌లో ఆక్రమణల తొలగింపునకు మిషన్లు (బుల్డోజర్లు, క్రేన్లు వంటివి), సిబ్బందిని పంపాలని తహసీల్దార్ లేఖ రాస్తే తాము వాటిని సమకూర్చామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ జవాబు చెప్పడంతో కోర్టు మరింత ఆగ్రహం వ్యక్తంచేసింది. అమీన్‌పూర్‌లో ఏమి కూల్చివేస్తున్నారో, కూల్చివేత చర్యలకు ఉండే చట్టబద్ధత ఏమిటో, చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చారో లేదో, ఆక్రమణదారులని భావించే వాళ్ల వాదనలు విన్నారో లేదో తెలుసుకోకుండా కోర్టు ఉత్తర్వులు ఏమున్నాయో కూడా చూడకుండా బుల్డోజర్లు, స్టాఫ్‌ను ఎలా పంపుతారని ప్రశ్నించింది. రేపు చార్మినార్, హైకోర్టు కూల్చేయాలని తహసీల్దార్ కోరితే మిషన్లు, సిబ్బందిని పంపుతారా? అని నిలదీసింది. హైకోర్టు భవనాన్ని కూల్చేయడానికి మిషన్లు, స్టాఫ్‌ను ఎలా పంపుతామని రంగనాథ్ జవాబివ్వడంతో హైకోర్టు మళ్లీ ఆగ్రహం వ్యక్తంచేసింది. అమీన్‌పూర్‌లో సామాన్యుడికి ఒకలా, హైకోర్టు విషయంలో మరోలా ఉండటం చట్ట సమానమే అవుతుందా? ఇలా చేయడం వివక్షే అవుతుంది కదా అని చెప్పడంతో రంగనాథ్ మౌనం దాల్చారు. చర్యలు చట్ట ప్రకారం ఉండాలి కదా అని హైకోర్టు ప్రశ్నించడంపై రంగనాథ్ స్పందిస్తూ, కావూరి హిల్స్‌లో కూల్చివేత గురించి చెప్పబోయారు. 'మిస్టర్ రంగనాథ్ మీరు జంప్ (దాటవేత) చేయకండి. నేను చాలా నిర్దిష్టంగా అమీన్‌పూర్ కూల్చివేత గురించి ప్రశ్నిస్తున్నాను. కావూరి హిల్స్ గురించి కాదని అని చురకలు వేసింది. అమీన్‌పూర్‌పై మాత్రమే మాట్లాడాలని, కావూరి హిల్స్ గురించి కాదని తేల్చి చెప్పింది.

బాస్‌ల మాట వింటే జైళ్లకే

కూల్చివేతలకు సమయం ఉంటుంది కానీ కోర్టు ఆర్డర్లు చదివే తీరిక మీకు ఉండదా అని రంగనాథ్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఎన్నో ప్రశ్నల తర్వాత దాదాపు విచారణ ముగిసే దశలో తహసీల్దార్ రాధ కల్పించుకుని జిల్లా కలెక్టర్ చెబితేనే చేశామంటూ ఏదో చెప్పబోతుంటే.. చేసిందంతా చేసేశారని, కూల్చాల్సిందంతా కూల్చేశారని, ఇప్పుడు కలెక్టర్ చెప్పారంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తే జైళ్లకు పంపాల్సివస్తుందని హెచ్చరించింది. పత్రికల్లో వార్తలు వచ్చాయని తహసీల్దార్ చెప్పగానే మీరు చట్ట ప్రకారం విధులు నిర్వర్తిస్తారా? లేక పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించడంతో తహసీల్దార్ మౌనంగా నిలబడిపోయారు. అధికారులు చట్ట ప్రకారం కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా అడుగులు వేయాలని, ఇష్టానుసారంగానో, ఉన్నతాధికారి చెప్పారనో, పొలిటికల్ బాస్ చెప్పారనో నడుచుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది.

జవాబులు చెప్పలేక నీళ్లు నమిలిన అధికారులు

హైకోర్టు గత ఆదేశాల మేరకు కమిషనర్ రంగనాథ్ ఆన్‌లైన్‌లో హాజరు కాగా, తహసీల్దార్ రాధ వ్యక్తిగతంగా హాజరయ్యారు. సోమవారం జరిగిన విచారణ సమయంలో న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ నేరుగా, సూటిగా ఇద్దరికీ ప్రశ్నలు సంధించారు. మధ్యలో తహసీల్దార్ తరపున న్యాయవాది కల్పించుకునేందుకు ప్రయత్నించగా, నేరుగా అధికారుల వివరణ కోరుతున్నామని, ఆ తర్వాత న్యాయవాదులు వాదనలు వినిపించేందుకు అవకాశం ఇస్తామని న్యాయమూర్తి చెప్పారు. అనేక ప్రశ్నలకు జవాబు చెప్పలేని పరిస్థితులను ఇద్దరు అధికారులు ఎదుర్కొన్నారు. ఇదే హైకోర్టు విస్తృత ధర్మాసనం కూల్చివేతల విషయంలో అనుసరించాల్సిన విధివిధానాలపై వెలువరించిన మార్గదర్శకాలను ఎందుకు అమలు చేయలేదని హైకోర్టు నిలదీసింది. ఈ తీర్పులను ఈ కేసులోని మధ్యంతర ఉత్తర్వులను చదువుకోవాలని హితవు పలికింది. అమీన్‌పూర్ భూముల్లో జరిగిన నిర్మాణాలపై వెలువడిన మధ్యంతర ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదని కూడా ప్రశ్నించింది. ఈ కేసుల్లో ప్రతివాదులుగా ఉన్న అధికారులు తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు వేయకుండా తీర్పులను అమలు చేయకుండా ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టారని తప్పుపట్టింది.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి కదా

అమెరికాలో ఉద్యోగం చేసి ఆర్జించిన కష్టార్జితంతో హైదరాబాద్‌లో స్థిరపడాలనే కోరితే విల్లా కొనుక్కుంటే చెప్పాపెట్టకుండా ఆ విల్లాలను కూల్చేస్తే వాళ్ల జీవితాలు ఏం కావాలని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వమే స్థలాల రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతులు ఇచ్చాక ఆపై రిజిస్ట్రేషన్ చేసిన నాలుగైదేండ్లకు ఆ విల్లానో, ప్లాటునో కూల్చేస్తే ఎలా అని నిలదీసింది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోతే చివరికి సామాన్యుడు నష్టపోతున్నాడని వ్యాఖ్యానించింది. అన్నీ చట్ట ప్రకారం ఉన్నాయనే నమ్మకానికి కారణమైన సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలనే ప్రశ్నను హైడ్రా కమిషనర్, ప్రభుత్వం ముందుంచింది.

డిజాస్టర్ అంటే కూల్చివేతలే కాదు

డిజాస్టర్ అంటే ఒక్క కూల్చివేతలే కాదని, ఇంకా చాలా ఉన్నయనే విషయం తెలియదా? ఏదీ లేకుండా కూల్చివేతే పరమావధిగా వ్యవహరిస్తారా? హైడ్రా పరిధి ఓఆర్ఆర్ లోపలే కదా? హైడ్రా పరిధిలో ఎన్ని చెరువులు, కుంటలు ఉన్నయో తెలుసా? అని హైకోర్టు ప్రశ్నించింది. ఎన్నింటికి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌పై తుది నోటిఫికేషన్ ఇచ్చారని ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. హైడ్రా తీరు తీవ్ర అందోళనకరంగా ఉందని వ్యాఖ్యానించింది. అక్రమ నిర్మాణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ కోర్టులు సమర్థించబోవని తేల్చి చెప్పింది. అదే సమయంలో అక్రమ నిర్మాణాలతో పేరుతో హైడ్రా, ఇతర అధికారులు చట్ట వ్యతిరేకంగా కూల్చివేత చర్యలకు పాల్పడితే కూడా సమర్థించే ప్రసక్తే లేదని కూడా తేల్చి చెప్పింది. అమీన్‌పూర్ నిర్మాణాలపై స్టేటస్ కో ఆదేశాలు ఇస్తున్నట్టు ప్రకటించింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని హైడ్రా కమిషనర్, తహసీల్దార్‌ను ఆదేశిస్తూ తదుపరి విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసింది. అప్పుడు హాజరుకావాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

హైడ్రా జీవో 99పై స్టే ఇవ్వాల్సివస్తుంది..

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డి పంచాయతీ శ్రీకృష్ణనగర్‌లో మహమ్మద్ రఫీ, గణేశ్ కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించిన దవాఖాన భవనానికి సెప్టెంబర్ 5వ తేదీన జారీచేసిన ఉత్తర్వులను ఉల్లంఘించి తహసీల్దార్, హైడ్రా కమిషనర్ కూల్చివేత చర్యలు చేపట్టారని తీవ్రంగా తప్పుపట్టింది. కూల్చడమే లక్ష్యంగా పనిచేసుకుంటూ పోతే హైడ్రా ఏర్పాటు జీవో 99 అమలును నిలిపివేస్తూ స్టే జారీ చేయాల్సివస్తుందని హెచ్చరించింది కోర్టు ఉత్తర్వులను ఎందుకు ఉల్లంఘించారో చెప్పాలని హైడ్రా కమిషనర్, అమీన్‌పూర్ తహసీల్దార్‌ను ప్రశ్నించింది.

పిటిషనర్ల వాదనలు

అమీన్‌పూర్‌లోని సర్వే నంబర్ 164లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను 48 గంటల్లో తొలగించాలని పేర్కొంటూ నోటీసులు ఇచ్చాక తమ గోడు వినకుండా ఏకపక్షంగా ఆదివారం కూల్చివేత చర్యలకు పాల్పడ్డారంటూ మధుసూదన్, గణేశ్ కన్‌స్ట్రక్షన్స్ పిటిషన్లు దాఖలు చేశారు. వీరి తరపు న్యాయవాది నరేందర్‌రెడ్డి వాదించారు. ఇదే తరహాలో అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడలో 32 విల్లాలకుగాను 26 విల్లాలను కూల్చివేయడాన్ని, మిగిలిన విల్లాల తరపున కోటేశ్వర్ రావు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్ల తరపు ఆర్ చంద్రశేఖర్‌రెడ్డి వాదనలు వినిపించారు. సర్వే నంబర్ 6లో విల్లాలు ఉంటే 12లో ఉన్నాయని, ఇది ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ తహసీల్దార్ కూల్చివేత నోటీసులు ఇచ్చారని చెప్పారు. కోర్టు ఉత్తర్వులను కూడా లెక్క చేయలేదన్నారు.

రేపు చార్మినార్, హైకోర్టు భవనాలను కూల్చేయాలని తహసీల్దార్ అడిగితే మిషన్లు, సిబ్బందిని పంపుతారా? అమీన్‌పూర్‌లో సామాన్యుడికి ఒకలా, హైకోర్టు విషయంలో మరొకలా ఉండటం చట్ట సమానమే అవుతుందా? ఇలా చేయడం వివక్షే అవుతుంది కదా. - హైకోర్టు

ముందు తేదీతో నోటీసు.. గడువు తీరకుండానే కూల్చివేతలు

అమీన్‌పూర్ తహసీల్దార్ ఈ నెల 20వ తేదీతో ఉన్న నోటీసులను 21వ తేదీ సాయంత్రం ఆరున్నర గంటలకు అందజేశారని, 22వ తేదీ ఉదయం ఏడున్నర గంటలకు జేసీబీలు, బుల్డోజర్లు, 50 మంది సిబ్బందితో వచ్చిన హైడ్రా ఐదు అంతస్థుల దవాఖాన భవనాన్ని కూల్చేసిందని నరేందర్‌రెడ్డి చెప్పారు. సర్వే నంబర్ 165, 166లోని మహమ్మద్ రఫీకి చెందిన 270 గజాల స్థలాన్ని గణేశ్ కన్‌స్ట్రక్షన్స్‌కు విక్రయించారని, ఆ స్థలంలో నిర్మాణాలకు 2022 నవంబర్ 10వ తేదీన గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు తీసుకున్నారని వివరించారు. నిర్మాణాలు చేపట్టాక పంచాయతీ జోక్యంపై పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని, ఈ కేసు వాదనల సమయంలో పంచాయతీ నుంచి అనుమతులు ఉన్నందున తాము జోక్యం చేసుకోవడం లేదని పంచాయతీ తరపు న్యాయవాది చెప్పారని గుర్తు చేశారు. దీంతో ఆ పిటిషన్‌పై హైకోర్టు విచారణను మూసేసిందని తెలియజేశారు. ఇటీవల హైడ్రా కూల్చివేత చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో హైడ్రా అధికారులు బెదిరింపుల కారణంగా మరోసారి హైకోర్టును ఆశ్రయించారని చెప్పారు. ఇదే సమయంలో హైడ్రా తరపు న్యాయవాది కటిక రవీందర్‌రెడ్డి అప్పుడు ప్రతివాదనలు వినిపిస్తూ పిటిషనర్‌కు చెందిన దవాఖాన ఉన్న ప్రాంతాన్ని హైడ్రా ఎప్పుడూ సందర్శించలేదని, కూల్చివేత చర్యలకు అధికారులకు ఏవిధమైన ఆదేశాలు జారీ చేయలేదని చెప్పారు. ఏ చర్యలైనా జీవో 99 మేరకే ఉంటాయని కూడా హామీ ఇచ్చారని, దీంతో ఆ పిటిషన్‌పై హైకోర్టు సెప్టెంబర్ 5న విచారణను మూసివేసిందని వివరించారు. ఇదిలా ఉంటే గత ఫిబ్రవరిలో పంచాయతీ ఇచ్చిన అనుమతులను రద్దు చేయగా వాటిని హైకోర్టు సస్పెండ్ చేసిందని తెలిపారు. తిరిగి ప్రభుత్వ భూమిలో ఆక్రమ నిర్మాణాలని పేర్కొంటూ అమీన్‌పూర్ తహసీల్దార్ ఈ ఏడాది ఏప్రిల్ 2న నోటీసు జారీచేశారని, దీనికి 15 రోజులు గడువు కావాలని పిటిషనర్లు కోరినప్పటికీ అనుమతించలేదని చెప్పారు. పిటిషనర్లు 18న వివరణ సమర్పించినప్పటికీ పరిగణనలోకి తీసుకోలేదని, నిర్మాణాలను తొలగించాలంటూ సెప్టెంబర్ 20వ తేదీతో ఉన్న నోటీసులను 21వ తేదీ సాయంత్రం అందజేశారని, 22న ఉదయం 7.30 గంటలకే కూల్చివేత పనులు చేపట్టారన్నారు. హైడా తరపు న్యాయవాది రవీందర్ రెడ్డి వాదిస్తూ, ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగింపునకు యంత్రాలు, సిబ్బందిని పంపాలని అమీన్‌పూర్ తహసీల్దార్ నుంచి ఈనెల 21న లేఖ అందిందని, జీవో 99 ప్రకారం, ఆ లేఖ ప్రకారం ప్రభుత్వ స్థలం రక్షణ కోసం యంత్రాలు, సిబ్బందిని పంపినట్టు వివరించారు.

సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం

ఆదివారం ఇంట్లో ఫ్యామిలీతో గడపకుండా కూల్చివేయడానికి ఎందుకు వచ్చారన్న హైకోర్టు ప్రశ్నకు తహసీల్దార్ స్పందిస్తూ నోటీసు ఇచ్చాక బిల్డింగ్ నిర్మాణం ఆపలేదని చెప్పారు. దీంతో కల్పించుకున్న కోర్టు పంచాయతీ ద్వారా లేదా మీరే ఆ బిల్డింగ్‌ను ఎందుకు సీజ్ చేయలేదని ప్రశ్నించింది. బిల్డింగ్ ఖాళీ చేయాలని నోటీసు ఇచ్చాక తదుపరి చర్యలు ఎందుకు తీసుకోలేదని, ఆ తర్వాత కూడా నిర్మాణాలు జరిగేలా ఎందుకు మౌనంగా ఉంటే నిర్మాణాలకు అనుమతి ఇచ్చినట్టు కాదా అని ప్రశ్నించింది. చనిపోయేప్పుడు కూడా చివరి కోరిక అడుగుతారని, కూల్చివేతలకు ముందుకు పిటిషనర్ వాదనలు వినాలని తెలియదా? ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం కాదా అని ప్రశ్నించింది.

ఆదివారం కూల్చడం తప్పే: రంగనాథ్

సెప్టెంబర్ 21న శనివారం తహసీల్దార్ అడిగితే 22న ఆదివారం మెన్ అండ్ మిషనరీ ప్రొవైడ్ చేశామని రంగనాథ్ అంగీకరించారు. ఆదివారం కూల్చివేతలు చేపట్టకూడదని ఇదే హైకోర్టు ఫుల్ బెంచ్ ఇచ్చిన తీర్పు గురించి తెలియదా? అన్న ప్రశ్నకు.. తెలుసునని, ఆదివారం కూల్చివేతలు చేపట్టడం హైకోర్టు తీర్పును ఉల్లంఘించడమేనని రంగనాథ్ అంగీకరించారు. ఆదివారం మెన్ అండ్ మిషనరీ ఇచ్చేముందు అమీన్‌పూర్ తహసీల్దార్‌కు హైకోర్టు ఆర్డర్ గురించి చెప్పాల్సిన బాధ్యత మీపై ఉంది కదా అని ప్రశ్నిస్తే రంగనాథ్ మౌనం వహించారు. రెండు రోజులు ఆగకుండా కూల్చివేస్తారా? ఐదు నెలలుగా ఉన్న వివాదంలో ఎందుకు తొందర పడ్డారని ప్రశ్నించింది.

అధికారులు చట్ట ప్రకారం కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా అడుగులు వేయాలి. మీ ఉన్నతాధికారి, పొలిటికల్ బాస్‌లు చెప్పినట్టు నడుచుకుంటే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. హైడ్రా జీవోలోని ఇతర అంశాలన్నింటినీ వదిలేసి కూల్చివేతలకు మాత్రమే ఎందుకు పరిమితమవుతున్నారు. -హైకోర్టు

జనాన్ని టెర్రరైజ్ చేస్తారా?

చెరువులు, కుంటల వద్ద స్థలాలు, ఆస్తులు కొనాలంటే జనం భయపడాలంటూ మీరు ఇంటర్వ్యూ ఇచ్చిన వీడియో ఒక న్యాయవాది తన దృష్టికి తెచ్చారని, మీరు ప్రజలను టెర్రరైజ్ చేస్తున్నారా? లేక చట్టాన్ని అమలు చేస్తున్నారా? అసలు మీ ఉద్దేశం ఏమిటని రంగనాథ్‌ను హైకోర్టు ప్రశ్నించింది. తాను ఆవిధంగా చెప్పలేదని రంగనాథ్ బదులిచ్చారు. దీంతో ఆ ఇంటర్వ్యూను ఇంగ్లిషులో తర్జుమా చేసి నివేదించాలని న్యాయవాదిని కోర్టు ఆదేశించింది. 'ఆర్టికల్ 21 గురించి చెప్పారని, రిజిస్టర్ సేల్‌డీడ్, పర్మిషన్ ఉన్న నిర్మాణం, విద్యుత్తు, వాటర్ వంటి కనెక్షన్లు ఉన్నప్పుడు ఆ నిర్మాణాన్ని ఆదివారం కూల్చేస్తారా? ఇదేనా ఆర్టికల్ 21 అమలని నిలదీసింది. బోనఫైడ్ పర్చేజర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అని, అమెరికా నుంచి వచ్చి ఇక్కడ ఆస్తి కొంటే కూల్చేస్తారా? హైడ్రాతో ఏమాత్రం సంతోషంగా లేం. ఇలాగే విధులు కొనసాగిస్తే రేపు జీవో 99ని సవాల్ చేసిన పిటిషన్లు రెండు విచారణకు రానున్నాయి. జీవో 99 (హైడ్రా ఏర్పాటు) అమలుపై స్టే ఇవ్వాల్సివస్తుంది' అని హైకోర్టు హెచ్చరించింది.

హైడ్రా విధానం ఎక్కడుంది?

హైడ్రా అంటే కూల్చివేతలేనా? ట్రాఫిక్ కోఆర్డినేషన్ ఇతర విధులు కూడా హైడ్రాకు ఉంటే కూల్చివేతలు తప్ప మరో పనిచేయలేదు అని హైకోర్టు తప్పుపట్టింది. ట్రాఫిక్ అంశంపై సమీక్ష చేశామని రంగనాథ్ చెప్పడంపై ఆ విధానం ఎక్కడుందో చెప్పాలని అడిగింది. హైడ్రాకు విధానం లేదని, ఎడాపెడా కూల్చివేతలే లక్ష్యంగా పనిచేస్తున్నదని మండిపడింది. ఇదేనా ప్రజల కోసం పనిచేయడమని ప్రశ్నించింది. ప్రభుత్వ ఆస్తులను రక్షించడమే లక్ష్యమని రంగనాథ్ చెప్పడాన్ని సమర్థిస్తున్నామని, అయితే, ఆదివారాలు కూల్చివేయడం, చట్ట వ్యతిరేకంగా చేయడం, విధానం లేకుండా చర్యలు చేపట్టడం ఆక్షేపణీయమని తప్పుపట్టింది. అమీన్‌పూర్‌లో వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయని రంగనాథ్ కోర్టుకు తెలిపారు. 250 చెరువులు ఉండేవని తెలిపారు. 138 చెరువులకు మాత్రమే ఎఫ్‌టీఎల్ ఫైనల్ నోటిఫికేషన్ వెలువడ్డాయని చెప్పారు. ఎఫ్‌టీఎల్‌పై తుది నోటిఫికేషన్ వెలువరించాలని అనేకసార్లు ఆదేశించినా ఫలితం లేకపోయిందని హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. దుర్గం చెరువు విషయంలో ఐదుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు అయ్యాక నోటీసులు ఇచ్చారని, మూసీ విషయంలో 20 లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయని తెలిపింది. జీవో 99 అమలు చేయాలని చెప్పింది. ఒక శాఖ అనుమతిస్తే మరో శాఖ కూల్చేస్తే ఎలాగని, సింగిల్ విండో ఎక్కడుందని ప్రశ్నించింది. ప్రజల విశ్వాసాన్ని కోల్పోవద్దని సుతిమెత్తంగా హెచ్చరించింది.

తొలుత ప్రభుత్వ ఆక్రమణలు కూల్చండి

పిటిషనర్లు 2021లో స్థలాలను కొనుగోలు చేస్తే ఆ భూములపై ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ లో సర్వే చేసిందని, సర్వే చేసే ముందు పిటిషనర్లకు ఎందుకు నోటీసు ఇవ్వలేదని తహసీల్దార్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఏప్రిల్ నుంచి 5 నెలలు ఆగిన అధికారులు 48 గంటల నోటీసు ఇచ్చి 40 గంటలకే కూల్చేయడాన్ని తీవ్రంగా పరిగణించింది. గతంలో చెరువుల ఎఫ్‌టీఎల్ గుర్తింపునకు ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేయాలంటే చేయలేదని తెలిపింది. పేట్‌బషీరాబాద్ ప్రభుత్వ స్థలంలో పోలీస్ స్టేషన్, ప్రభుత్వ కార్యాలయ భవనాలు ఉన్నాయని, ఇలాంటి వాటిని కూల్చాక సామాన్యులవి కూల్చితే బాగుంటుందని సూచించింది. బతుకమ్మకుంట, నల్లకుంట, ఇబ్రహీంపట్నం చెరువుల పరిస్థితి ఏమయ్యాయో బాహాటంగా కనబడుతున్నదని ఆవేదన వ్యక్తం చేసింది.

రాత్రికి రాత్రి సిటీని మార్చలేరు

కూల్చివేతల విషయంలో చట్ట ప్రకారమే చర్యలు చేపట్టాలని హైకోర్టు తేల్చి చెప్పింది. నిబంధనలు పాటించాల్సిందేనని, రాత్రికి రాత్రి సిటీని మార్చేద్దామని అనుకుంటే వీలుకాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని నొక్కి చెప్పింది. హైడ్రా ఏర్పాటు నిబంధనలను పరిశీలిస్తే కూల్చివేత చర్యల నిబంధనను మాత్రమే అమలు చేస్తున్నదని, ఇతర అంశాలను గాలికి వదిలేసిందని తప్పుపట్టింది. మూసీపై మీ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఏంటని ఆరా తీసింది. హైడ్రా ఏర్పాటు లక్ష్యం ఉన్నతంగానే ఉన్నదని, కూల్చివేత చర్యలను ఏనాడూ కోర్టులు ఆపలేదని గుర్తు చేసింది.

మూసీ ఆక్రమణలపై నోటీసులు ఇప్పుడా?

- ప్రభుత్వ చర్యలు ప్రజలకు నమ్మకాన్ని కలిగించాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు
- విచారణ ఈ నెల 16కు వాయిదా



హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): మూసీ, దాని పరివాహక ప్రాంతంలో ఆక్రమణల తొలగింపునకు ఏ విధానాన్ని అమలు చేస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. అసలు ఆక్రమణల తొలగింపునకు ఏదైనా విధానం రూపొందించారో, లేదో చెప్పాలని ఆదేశించింది. విధానం అంటూ ఏమైనా ఉన్నదా? అని ప్రశ్నించింది. 1900లో సర్వే చేసి ఎఫ్‌టీఎల్ నిర్ధారించాక జరిగిన నిర్మాణాల తొలగింపునకు ఇప్పుడు నోటీసులు ఎలా ఇస్తారని నిలదీసింది. మూసీ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఏ చర్య చేపడతారన్నది వివరించాలని స్పష్టంచేసింది. ఏ చర్యలు తీసుకున్నా చట్టప్రకారమే ఉండాలని ప్రభుత్వానికి సోమవారం ఆదేశాలు జారీచేసింది. మూసీ పరివాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాల గుర్తింపులో భాగంగా అధికారులు మార్కింగ్ ప్రక్రియ చేపట్టడంతో కూల్చివేతలు చేపడతారన్న భయంతో పలువురు లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కే లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్ రెడ్డి వాదిస్తూ.. ఇప్పటికిప్పుడు యుద్ధ ప్రాతిపదికన ఆక్రమణల తొలగింపు చర్యలు తీసుకోబోమని చెప్పారు. ఇప్పటికే ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటైందని తెలిపారు. ఆ కమిటీ బాధితులతో చర్చలు జరుపుతున్నదని, ఇండ్లు కోల్పోయిన పేదలకు ప్రత్యామ్నాయంగా ఇండ్లు చూపిస్తామని వివరించారు. సుమారు 2,100 మంది దాకా పేదలు ఉన్నట్టు కలెక్టర్ గుర్తించారని వెల్లడించారు. ప్రభుత్వ హామీని రికార్డుల్లో నమోదు చేసిన హైకోర్టు.. మొత్తం చెరువులన్నింటినీ గుర్తించి ఎఫ్‌టీఎల్ నిర్ధారించాక చర్యలు చేపట్టేలా పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శికి సూచించాలని సలహా ఇచ్చింది. ఏ చర్య చేపట్టినా చట్టప్రకారం ఉండాల్సిందేనని తేల్చిచెప్పింది. విచారణను ఈ నెల 16కు వాయిదా వేసింది.

కాంగ్రెస్‌లో హైడ్రా చిచ్చు

హైడ్రా చర్యలతో ప్రభుత్వంపై వ్యతిరేకత • రెండుగా విడిపోయిన పార్టీ.. ప్రభుత్వం • ప్రభుత్వాన్ని హైడ్రా ముంచేస్తుందని ఆందోళన

బహిరంగంగానే పార్టీ నేతల విమర్శలు • హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లే యోచన • పేదల గూడు కూల్చే పార్టీగా పేరు



హైదరాబాద్, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): హైడ్రా బుల్డోజర్లు పేదల ఇండ్లపైకి దూసుకెళ్లడంపై కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు రేగుతున్నాయి. హైడ్రా చర్యల్ని పార్టీ నేతలు కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. హైడ్రా వ్యవహారంతో పార్టీ, ప్రభుత్వం రెండుగా చీలిపోయి.. కాంగ్రెస్ ప్రభుత్వం వర్సెస్ కాంగ్రెస్ పార్టీగా మారిపోయిందనే చర్చ గాంధీభవన్‌లో జోరందుకున్నది. ఇందులో భాగంగానే ప్రభుత్వం తీసుకున్న హైడ్రా నిర్ణయాన్ని పార్టీలో ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారు. హైడ్రాకు వ్యతిరేకంగా బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, అద్దంకి దయాకర్ వంటి నేతలు హైడ్రాపై బహిరంగంగానే తమ అభిప్రాయాలను వెల్లడించారు. సంగారెడ్డి జోలికి రావొద్దని జగ్గారెడ్డి హెచ్చరిస్తే, పేదల ఇండ్లను తొందరపడి కూల్చొద్దని అద్దంకి దయాకర్ సూచించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సైతం అంతర్గత చర్చల్లో హైడ్రా వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. హైడ్రా చర్యలు పార్టీ, ప్రభుత్వాన్ని ముంచడం ఖాయమనే ఆందోళనను ఆయన వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై ప్రభుత్వం పెద్దలతో మాట్లాడాలని అనుకుంటున్నట్టుగా తెలిసింది. అవసరమైతే హైడ్రాతో పార్టీకి జరుగుతున్న నష్టాన్ని హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లాలని కూడా నిర్ణయించినట్టు సమాచారం.

నీడనిచ్చే పేరు నుంచి గూడు కూల్చే పేరు

హైడ్రా ఆధ్వర్యంలో పేదల ఇండ్లను కూల్చివేయడంపై ఓ మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టుగా తెలిసింది. ఇందిరమ్మ రాజ్యం అంటూ ప్రచారం చేసుకుంటున్న తాము ఇలా పేదల ఇండ్లను కూల్చివేస్తామని ఏనాడు అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారట. పేదలకు గూడు కట్టించి నీడనిచ్చే పార్టీగా కాంగ్రెస్‌కు పేరుందని, ఇప్పుడు హైడ్రా దెబ్బతో పేదోడి గూడును కబళించే పార్టీగా పేరు ఆపాదించుకోవాల్సి వస్తున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. హైడ్రా పేరుతో పేదోడి ఇంటిని ఎందుకు కూల్చివేస్తున్నారో, ఎవరికి కోసం కూల్చివేస్తున్నారో, దీని వల్ల కలిగే ప్రయోజనం ఏమిటో కూడా అర్థం కావడం లేదని వాపోయారట. ఇప్పటికే హైడ్రాతో కూల్చివేతల ప్రభుత్వంగా పేరు గడించామని, ఇంకా కొనసాగితే పేదోడి గుండెల్లో కాంగ్రెస్ పార్టీ జీవితాంతం శత్రువుగా మిగిలిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో ఈ నిర్ణయాలు ఎవరు తీసుకుంటున్నారో వాళ్లు ఇప్పటికైనా ఈ చర్యల్ని ఆపేస్తే అందరికీ మంచిదనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేసినట్టుగా తెలిసింది.

అంతర్గతంగా యుద్ధ వాతావరణం

హైడ్రా విషయంలో ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టుగా తెలిసింది. ఇటు ప్రభుత్వ పెద్దలకు, అటు పార్టీ పెద్దలకు అంతర్గతంగా యుద్ధ వాతావరణం నెలకొన్నట్టు సమాచారం. పైకి మాత్రం హైడ్రాను సమర్థిస్తూ మాట్లాడుతూనే లోలోపల మాత్రం ప్రభుత్వ పెద్దలపై తీవ్ర ఆసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టుగా తెలిసింది. ఇందులో భాగంగానే హైడ్రా చర్యల్ని పార్టీ పెద్దలు వారిస్తుంటే ప్రభుత్వ పెద్దలు మాత్రం పట్టించుకోవడం లేదని చెప్తున్నారు. అభివృద్ధి పేరుతో హైడ్రాను అడ్డంపెట్టుకొని పేదల ఇండ్లను కూల్చడం ఏంటని పార్టీ నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ ప్రజా వ్యతిరేక చర్యలతో కేవలం ప్రభుత్వానికి మాత్రమే నష్టం కాదని, అంతకు మించి మూల్యాన్ని పార్టీ చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం.

సుదీర్ఘ పోరాటానికి సిద్ధం!

- **ఇజ్రాయెల్ భూతల దాడులకు దిగినా ఎదుర్కొంటాం: హెజ్బొల్లా ప్రకటన**
- **సెంట్రల్ బీరుట్‌పై తొలిసారి ఇజ్రాయెల్ వైమానిక దాడి**



బీరుట్‌లోని కోలా జిల్లాలో ఇజ్రాయెల్ దాడుల్లో దెబ్బతిన్న ఓ భవనం

బీరుట్, సెప్టెంబర్ 30: ఎడాపెడా దాడులతో ఇజ్రాయెల్ ఊపిరి సలపనీయకుండా చేస్తున్నప్పటికీ లెబనాన్ ఉగ్రవాద సంస్థ హెజ్బొల్లా మాత్రం తాము వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేస్తున్నది. ఆ సంస్థ చీఫ్ హసన్ నస్రల్లాతో పాటు పలువురు కమాండర్లు ఇటీవల దాడుల్లో మరణించారు. అయినప్పటికీ తాము ఇజ్రాయెల్‌తో పోరాడుతూనే ఉంటామని హెజ్బొల్లా తాత్కాలిక నేతగా వ్యవహరిస్తున్న నయీమ్ కాసీమ్ సోమవారం ప్రతిజ్ఞ చేశారు. పదాతి దళాలతో దాడి చేయడానికి ఇజ్రాయెల్ కనుక వస్తే దానిని ఎదుర్కోడానికి తాము కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. దాడుల్లో కమాండర్లు గాయపడినా, మరణించినా, వారి స్థానాలను డిప్యూటీ కమాండర్లతో వెంటనే భర్తీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ యుద్ధం దీర్ఘకాలం కొనసాగుతుందని తాము భావిస్తున్నామని ఆయన చెప్పారు.

లెబనాన్ టాప్ కమాండర్ కుటుంబం మృతి

లెబనాన్ రాజధాని బీరుట్ నగరంలోని ఓ నివాస భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. సెంట్రల్ బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడం ఇదే తొలిసారి. ఈ దాడిలో ఇద్దరు మరణించారు. మరోవైపు దక్షిణ పోర్టు నగరమైన టైర్‌లోని ఒక శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో లెబనాన్ టాప్ కమాండర్ ఫతే షరీఫ్ అబు ఎల్-అమీన్, అతని భార్య, కుమారుడు, కుమార్తె మరణించినట్టు హమాస్ ప్రకటించింది. వీరే కాక ముగ్గురు మిలిటెంట్లు కూడా మరణించారు.

పేజర్ పేలుళ్లలో కేరళ వాసిపై ఇంటర్నేషనల్ వారెంట్

ఇటీవల లెబనాన్‌లో వాకీటాకీలు, పేజర్లు పేలడం ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే ఈ కేసుకు సంబంధించి కేరళలో జన్మించిన నార్వే వ్యాపారవేత్త రిన్సన్ జోస్ పేరు విన్పిస్తున్నది. బల్గేరియా కేంద్రంగా పనిచేసే ఇతని సంస్థ ద్వారానే లెబనాన్‌లోని హెజ్బొల్లా గ్రూప్‌నకు పేజర్లు సరఫరా అయినట్టు నిర్ధారణ కావడంతో ఆయనపై అంతర్జాతీయ వారెంట్ జారీ అయ్యింది. నోర్టా గ్లోబల్ లిమిటెడ్ కంపెనీ ఈ పేజర్ల డీల్ వెనుక ఉందని హంగేరియన్ మీడియా వెల్లడించింది. దీనిని జోస్ 2022లో స్థాపించారు.

ఇక మిగిలింది అణు కార్డే!

ఇరాన్‌పై సామాజిక మాధ్యమాల్లో ఒత్తిడి

టెహ్రాన్, సెప్టెంబర్ 30: హెజ్బొల్లాపై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్‌కు అడ్డుకట్ట వేయాలని ఇరాన్‌పై ఒత్తిడి పెరుగుతున్నది. అణుబాంబు ప్రయోగించాలని ఛాందసవాదులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అర్మూజ్ జలసంధిని దిగ్బంధించాలని వారు కోరుతున్నారు. ఛాందసవాది సయ్యద్ జలీల్ అనుచరులు ఈ డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఇరాన్ అధ్యక్ష ఎన్నికల్లో సంస్కరణవాది మసూద్ పెజిష్కియాన్ చేతిలో జలీల్ ఓటమిపాలయ్యారు. ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో కొత్త అధ్యక్షుడిపై వీరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ఇరాన్ ఇప్పటికే అన్ని అవకాశాలను ఉపయోగించుకుంది. ఇక మిగిలింది అణు కార్డే. ఇదే పశ్చిమ దేశాలను చర్చలకు కూర్చోబెడుతుంది' ఓ యూనివర్సిటీ ప్రొఫెసర్ సొహ్రాబ్ సాలేహి ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఇరాన్‌కు త్వరలోనే విముక్తి: నెతన్యాహూ

ఇరాన్‌లో పౌరులకు సరైన ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలను కల్పించడంలో ఇరాన్ ప్రభుత్వం విఫలమైందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఆరోపించారు. ఖమేనీ పాలనలో వారు అంధకారంలో కూరుకుపోయారని, పలు రంగాలు పూర్తి నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. ఇరాన్ త్వరలోనే విముక్తి పొందుతుందని పేర్కొన్నారు.

దేవుళ్లను రాజకీయాల్లోకి లాగొద్దు!

మొదటిపేజీ తరువాయి...

జరపగలదా? అన్న సందేహాలు లేవనెత్తింది. ఈ మేరకు లడ్డూ వివాదంపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 3కు వాయిదా వేసింది.





సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించినట్లు ఎలా తెలిసింది? అయినా, కల్తీ నెయ్యిని వాడకుండా పక్కనబెట్టామని టీటీడీ ఈవో చెప్పారు కదా! అలాంటప్పుడు, లడ్డూ తయారీలో ఆ నెయ్యిని వాడినట్లు ఎలా చెప్తారు?
- దీన్నిబట్టి కల్తీ నెయ్యిని లడ్డూలో వాడినట్టు ఆధారాలు లేవని అర్థమవుతున్నది. అలాంటప్పుడు లడ్డూ కల్తీ జరిగిందని ఎలా చెప్తారు?
- లడ్డూ కల్తీ జరిగిందనుకొందాం. అయితే, ఆ శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారా? పంపితే, వాటి రిపోర్టులేవి?
- టెస్టుల కోసం గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ ల్యాబ్‌కే నెయ్యిని ఎందుకు పంపాల్సి వచ్చింది?
- మైసూరు, ఘజియాబాద్‌లో కూడా ల్యాబ్‌లు ఉన్నాయి కదా. సెకండ్ ఒపీనియన్ కోసం అక్కడికి శాంపిల్స్ ఎందుకు పంపలేదు.
- (సీఎం చంద్రబాబును ఉద్దేశిస్తూ..) నెయ్యి కల్తీ జరిగినట్టు జూలైలో నివేదిక వచ్చిందంటున్నారు. మరి ఆ విషయాన్ని సెప్టెంబర్‌లో తీరిగ్గా ఎందుకు చెప్పాల్సి వచ్చింది?
- నెయ్యి కల్తీ అయ్యిందా? లేదా? ఆ నెయ్యిని లడ్డూకి వాడారా? లేదా? అని తేల్చేందుకే సిట్ ఏర్పాటు చేశారు.
- ఒకవైపు సిట్‌ను ఏర్పాటు చేసిన మీరు (సీఎం).. లడ్డూ తయారీలో జంతువుల కొవ్వుతో చేసిన కల్తీ నెయ్యిని గత ప్రభుత్వ హయాంలో వాడారంటూ మీడియా ముఖంగా తేల్చిచెప్పడమేంటి? అలాంటప్పుడు సిట్ దర్యాప్తు ఎందుకు?
- కల్తీ నెయ్యిని లడ్డూలో వాడారో లేదో పూర్తిగా తెలియకుండా మీడియా ముందుకు మీరు (సీఎం) వెళ్లాల్సిన అవసరమేంటి?
- ఇక్కడ మరో విషయం. ఒకవైపు లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారని సీఎం ప్రకటిస్తే, టీటీడీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో) మాత్రం కల్తీగా తేలిన నెయ్యిని అసలు లడ్డూ తయారీలో వాడలేదంటూ స్టేట్‌మెంట్ ఇచ్చారు. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి?
- ఇది కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన విషయం. దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దు. కనీసం దేవుడినైనా రాజకీయాలకు దూరంగా ఉంచండి. సీఎం తన వ్యాఖ్యలతో లక్షలాది మంది మనోభావాలను గాయపర్చారు.
- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం నియమించిన సిట్ సరిగ్గా విచారణ జరపగలదా? అనే అనుమానాలు మాకు కలుగుతున్నాయి.
- ఈ లడ్డూ వివాదంపై కేంద్రం ఏర్పాటు చేసే స్వతంత్ర కమిటీ విచారణ జరిపితే బావుంటుందేమో? అని మాకు అనిపిస్తున్నది.

ఏమిటీ వివాదం?

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీకి గురైనట్టు ఎన్‌డీడీబీ ల్యాబ్ తన నివేదికలో ఆరోపించింది. ఈ విషయాన్ని సెప్టెంబర్ 18న సీఎం చంద్రబాబు మీడియాకు తెలియజేశారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తిరుమల స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి విషయంలో నిజం నిగ్గు తేల్చాలంటూ బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యస్వామి, వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై సోమవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు సీఎం చంద్రబాబు వైఖరిని తప్పుబడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేసింది.

'తాత్కాలిక డీజీపీల నియామకంపై వివరణ ఇవ్వండి'

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): తాత్కాలిక డీజీపీల నియామకం వ్యవహారంలో తెలంగాణ, ఏపీతో పాటు ఏడు రాష్ర్టాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. దీనిపై ఆరు వారాల్లో సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసింది. పలు రాష్ట్ర ప్రభుత్వాలు తాత్కాలిక డీజీపీలను నియమించడాన్ని వ్యతిరేకిస్తూ ఆగస్టు 8న సావిత్రి పాండే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను సోమవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారించింది. డీజీపీ పోస్టు ఖాళీ కావడానికి మూడు నెలల ముందే తదుపరి డీజీపీ నియామకానికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంటుందని సావిత్ర పాండే తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు.

పదవి ఉందని పెదవి జారితే..

- **అబద్ధాలను నిజం చేయాలని చూస్తే ఇలానే ఉంటుంది**
- **ధర్మాగ్రహాన్ని గుర్తించి.. సుప్రీంకోర్టు సత్యం చెప్పింది**
- **తిరుమల లడ్డూ వివాదంపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన**



హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యల నేపథ్యంలో వైసీపీ స్పందించింది. సత్యమేవ జయతే అంటూ అధికారిక ఎక్స్ ఖాతా వేదికగా ట్వీట్ చేసింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యలను ఆ పార్టీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి స్వాగతించారు. ధర్మాగ్రహాన్ని గుర్తించి.. సుప్రీంకోర్టు ధర్మాసనం సత్యం చెప్పిందన్నారు. పదవి ఉందని పెదవి జారితే, అబద్ధాన్ని నిజం చేయాలని చూస్తే.. భక్త ద్రోహం చేయాలని చూస్తే ఇలానే ఉంటుందంటూ విమర్శించారు. తిరుమల లడ్డూపై జరిగిన దుర్మార్గపు ప్రచారం.. మొత్తం ప్రపంచాన్ని కలిచివేసిందని అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలతో హిందూ సమాజంలో భయానక వాతావరణం ఏర్పడిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భగవంతుడు ఆగ్రహించి ధర్మాసనం రూపంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయించినట్లు భావిస్తున్నామన్నారు. టీటీడీ ఈవో చెప్పిన మాటలకు భిన్నంగా.. సీఎం చంద్రబాబు జంతువుల కొవ్వు వాడారని ఎలా చెబుతారని ప్రశ్నించారు. తిరుమల లడ్డూ విషయంలో తప్పు జరిగింది అంటూ విషప్రచారం చేశారని మండిపడ్డారు. తప్పు చేయలేదు కాబట్టే ధైర్యంగా తాము విచారణ కోరామని భూమన అన్నారు. స్వామి వారి వైభవాన్ని తగ్గించే విధంగా చంద్రబాబు, పవన్ మాట్లాడుతున్నారని హిందూ సమాజం వారిని చీకొడుతోందని ఆయన అన్నారు.

బాబు, పవన్‌పై ప్రకాశ్‌రాజ్ మళ్లీ ట్వీట్

తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ మరోసారి ఎక్స్ వేదికగా స్పందించారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలను జోడిస్తూ చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ ఫొటో ఉన్న పోస్టును షేర్ చేశారు. ఆ ఫొటో కింద దేవుడిని రాజకీయాల్లోకి లాగకండి అంటూ ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యానించారు. దీంతో ఆయన వ్యాఖ్యలు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ వివాదానికి సంబంధించి ప్రకాశ్‌రాజ్ ఇటీవల చేసిన కామెంట్స్‌పై పవన్‌కల్యాణ్‌తో పాటు జనసేన నాయకులు, మూవీ ఆర్టిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచువిష్ణు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాజాగా మరోసారి ప్రకాశ్‌రాజ్ లడ్డూ వివాదంపై స్పందిస్తూ ఎక్స్‌లో పోస్టు పెట్టడం చర్చనీయాంశంగా మారింది.

యా యా యా అనొద్దు.. ఇది కాఫీ షాప్ కాదు

న్యాయవాదిపై సీజేఐ ఆగ్రహం

న్యూఢిల్లీ: విచారణ సమయంలో 'యా యా' అనే పదాలను ఉపయోగించిన న్యాయవాదిపై సీజేఐ చంద్రచూడ్ సోమవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సీజేఐగా పని చేసిన జస్టిస్ రంజన్ గొగోయ్‌ని ప్రతివాదిగా చేర్చి ఓ పిటిషన్‌ను ఆ న్యాయవాది దాఖలు చేశారు. తన పిటిషన్‌ను జస్టిస్ గొగోయ్ తప్పుడు పద్ధతిలో డిస్మిస్ చేశారని ఆరోపించారు. ఆయనపై ఇన్-హౌస్ దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ, ఓ న్యాయమూర్తిని ప్రతివాదిగా చేర్చుతూ పిల్ ఎలా దాఖలు చేస్తారని ప్రశ్నించారు. దీనిపై ఆ న్యాయవాది స్పందిస్తూ, 'యా యా, అప్పటి సీజేఐ రంజన్ గొగోయ్. నన్ను క్యురేటివ్ పిటిషన్ దాఖలు చేయమన్నారు' అని చెప్పారు. 'యా యా యా అనొద్దు. 'యెస్' అనండి. ఇది కాఫీ దుకాణం కాదు' అని సీజేఐ అన్నారు.

బుల్డోజర్ కూల్చివేతలపై అస్సాంకు కోర్టు ధిక్కరణ నోటీసు

న్యూఢిల్లీ: అస్సాం ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సోమవారం కోర్టు ధిక్కరణ నోటీసు జారీ చేసింది. తమ అనుమతి లేకుండా ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దంటూ సుప్రీం కోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ధిక్కరించి తమ ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేసిందని ఆరోపిస్తూ 47 మంది పౌరులు అస్సాం ప్రభుత్వంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు విచారించిన జస్టిస్‌లు బీఆర్ గవాయి, కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం, దీనిపై మూడు వారాల్లో స్పందన తెలియజేయాలంటూ అస్సాం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

బుల్డోజర్‌తో కూల్చివేతలు అధికారులపై గ్రామస్థుల దాడి

ఫరుఖాబాద్: తమ గ్రామంలో చేపట్టిన బుల్డోజర్ చర్యపై ఆగ్రహించిన గ్రామస్థులు పోలీసుల సమక్షంలోనే ఇద్దరు రెవెన్యూ అధికారులపై దాడి చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఉక్రా గ్రామంలో సోమవారం ఈ ఘటన జరిగింది. గ్రామంలోని ప్రభుత్వ బంజరు భూమిలో నిర్మించిన పలు నిర్మాణాలను శనివారం అధికారులు బుల్డోజర్లతో కూల్చేశారు. సోమవారం బీజేపీ నాయకులు గ్రామస్థులు, సర్కిల్ అధికారి, ఎస్‌హెచ్‌వోతో మాట్లాడుతుండగా కోపోద్రిక్తులైన గ్రామస్థులు ఇద్దరు లేఖ్ పాలక్‌ల(రెవెన్యూ అధికారులు)పై దాడి చేశారు. పోలీసులు వెంటనే జోక్యం చేసుకొని పరిస్థితిని నియంత్రించారు.

అదనంగా 2.5 లక్షల వీసా అపాయింట్‌మెంట్లు

భారతీయులకు అమెరికా శుభవార్త

న్యూఢిల్లీ: భారతీయులకు అమెరికా శుభవార్త చెప్పింది. భారత పర్యాటకులు, నిపుణులైన కార్మికులు, విద్యార్థుల కోసం అదనంగా 2.5 లక్షల వీసా అపాయింట్‌మెంట్లను ప్రారంభిస్తున్నట్టు భారత్‌లోని అమెరికా ఎంబసీ ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఇటీవల కొత్త స్లాట్‌లను విడుదల చేశామని, అమెరికా వీసాల కోసం దరఖాస్తు చేసుకున్న వేలమంది భారతీయులు సకాలంలో ఇంటర్వ్యూలను పొందేందుకు ఇవి ఎంతో దోహదం చేయడంతోపాటు రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నది. వరుసగా రెండో ఏడాది కూడా 10 లక్షల వలసేతర (నాన్-ఇమ్మిగ్రెంట్) వీసా దరఖాస్తులను అధిగమించామని, ఇప్పుడు కుటుంబాలను, వ్యాపారులను కలపడంతోపాటు పర్యాటకాన్ని సులభతరం చేయడంపై దృష్టి సారించామని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది. కాగా, ఈ ఏడాది ఇప్పటికే 12 లక్షల మందికిపైగా భారతీయులు అమెరికా వెళ్లారు. ఈ సంఖ్య నిరుటి కంటే 35% అధికం. మరోవైపు వరుసగా నాలుగో ఏడాది భారత విద్యార్థులకు అమెరికా రికార్డు స్థాయిలో స్టూడెంట్ వీసాలను మంజూరు చేసింది.

సీఎం పదవి కోసం వెయ్యి కోట్లు రెడీ!

- **ఇప్పటికే 'గ్రేట్ లీడర్' వద్ద సిద్ధంగా నగదు**
- **కర్ణాటక బీజేపీ సీనియర్ నేత యత్నాల్ సంచలన వ్యాఖ్యలు**
- **న్యాయపరమైన చర్యలు తీసుకుంటామన్న డీకే శివకుమార్**



బెంగళూరు, సెప్టెంబర్ 30: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య పదవికి రాజీనామా చేస్తారని కథనాలు వస్తున్న తరుణంలో ఆ రాష్ట్ర బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. మీడియాతో మాట్లాడిన ఆయన 'ఓ గొప్ప నాయకుడు కర్ణాటక సీఎం పదవిని చేజిక్కించుకోవటానికి రూ.1,000 కోట్లతో సిద్ధంగా ఉన్నాడు. ఆ గ్రేట్ లీడర్ ఎవరో ప్రజలందరికీ తెలుసు. ఆయన పేరును నేను బహిర్గతం చేయను. గతంలో ఆయన ఇంట్లో నోట్ల కౌంటింగ్ మిషన్ కూడా దొరికింది. డిసెంబర్ నాటికి రాష్ట్ర రాజకీయాల్లో భారీ తిరుగుబాటు తెచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాడు' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సర్కారును పడగొట్టేందుకు బీజేపీ ఎలాంటి చర్యలు చేపట్టబోదని, దానంతట అదే కూలిపోతుందని వెల్లడించారు. కాగా, యత్నాల్ వ్యాఖ్యలను ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్రంగా పరిగణించారు. సోమవారం ఆ రాష్ట్ర హోం మంత్రి పరమేశ్వరతో భేటీ అనంతరం డీకే మాట్లాడుతూ.. 'కేపీసీసీ సమావేశం నిర్వహించాం. రూ.1,200 కోట్లతో తమ ప్రభుత్వాన్ని కూలదోయాలని కుట్ర పన్నినట్టు చెప్పారు. మా లీగల్ టీంతో దీనిపై చర్చిస్తాం. పార్టీ హైకమాండ్‌కు కూడా నివేదించాం. ఆదాయపన్ను శాఖ ఆధ్వర్యంలో దీనిపై దర్యాప్తు జరగాలి' అని పేర్కొన్నారు.

పరమేశ్వరతో డీకే భేటీ

సీఎం మార్పుపై చర్చ జరుగుతున్న సందర్భంలో పరమేశ్వరతో డీకే భేటీ కావటంపై రాజకీయ వేడి రాజుకుంది. అయితే ఈ భేటీలో ఎలాంటి రాజకీయ చర్చ జరగలేదని డీకే స్పష్టంచేశారు. పార్టీ మ్యానిఫెస్టోపై చర్చించామని తెలిపారు.

సిద్ధరామయ్యపై ఈడీ కేసు

మొదటిపేజీ తరువాయి...

మల్లికార్జున స్వామిని ఏ3గా, దేవరాజును ఏ4గా పేర్కొన్నది. దేవరాజు వద్ద నుంచే మల్లికార్జున స్వామి భూమిని కొని పార్వతికి బహుమతిగా ఇచ్చాడని చెప్తున్నారు. తక్కువ విలువ కలిగిన ఈ భూమిని అభివృద్ధి పనుల కోసం మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) సేకరించి, పరిహారంగా పార్వతికి ఖరీదైన 14 స్థలాలను కేటాయించిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఎఫ్ఐఆర్ ఆధారంగా వీరిపై తాజాగా ఈడీ ఈ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) నమోదుచేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. నిబంధనల ప్రకారం దర్యాప్తు సమయంలో నిందితులను ప్రశ్నించేందుకు, వారి ఆస్తులను అటాచ్ చేసేందుకు ఈడీకి అధికారం ఉంది.

ఆ 14 స్థలాలు వెనక్కిచ్చేస్తా: సిద్ధరామయ్య భార్య

తనకు ప్రభుత్వం కేటాయించిన 14 స్థలాలను వెనక్కి ఇచ్చేస్తానని సిద్ధరామయ్య సతీమణి పార్వతి. ముడా కమిషనర్‌కు లేఖ రాశారు. తన నుంచి ప్రభుత్వం తీసుకున్న కేసరె గ్రామంలోని మూడెకరాల 16 గుంటల భూమికి బదులుగా ముడా మైసూర్‌లోని విజయనగర్‌లో 14 ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించిందని, అయితే దానికి సంబంధించిన సేల్ డీడ్‌ను రద్దు చేయడం ద్వారా స్థలాలు వెనక్కి ఇచ్చేయడానికి తాను సిద్ధమని ముడా కమిషనర్‌కు రాసిన లేఖలో తెలిపారు. ఈ భూముల కేటాయింపుకు సంబంధించి సిద్ధరామయ్యపై లోకాయుక్త విచారణ నేపథ్యంలోనే ఆమె ఈ లేఖ రాసినట్టు భావిస్తున్నారు.

దళిత విద్యార్థికి సుప్రీం అండ

- **గడువులోగా ఫీజు చెల్లించలేకపోయిన విద్యార్థి**
- **అడ్మిషన్ కల్పించాలని ఐఐటీ ధన్‌బాద్‌కు కోర్టు ఆదేశం**

న్యూఢిల్లీ: గడువులోగా ఫీజు చెల్లించలేకపోయిన దళిత విద్యార్థికి సుప్రీంకోర్టు అండగా నిలిచింది. ఆ విద్యార్థిని బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ కోర్సులో చేర్చుకోవాలని ఐఐటీ ధన్‌బాద్‌ను ఆదేశించింది. యూపీలోని ముజఫర్‌నగర్ జిల్లా, టిటోరా గ్రామస్థుడు అతుల్ కుమార్ (18) జూన్ 24 నాటికి రూ.17,500 యాక్సెప్టెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంది. ఆయన తండ్రి రోజువారీ వేతన ఉద్యోగి కావడంతో ఆ ఫీజును చెల్లించలేక సీటును కోల్పోయాడు. మద్రాస్ హైకోర్టు సలహా మేరకు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.



బీహార్‌ను వరదలు ముంచెత్తుతున్నాయి. సోమవారం సుపాల్ జిల్లాలో ఎన్డీఆర్ఎఫ్ వరద బాధితులను సకాలంలో ఇలా రక్షించింది.

హిమాచల్ కాంగ్రెస్ సర్కార్‌కు పెన్షనర్ల సెగ

- **9వ తేదీన పింఛన్లు ఇస్తామని సుఖ్వీందర్ సర్కారు ప్రకటన**
- **తీవ్రంగా మండిపడ్డ పింఛనర్లు.. 1వ తేదీనే ఇవ్వాలని డిమాండ్**
- **లేకపోతే రాష్ట్ర వ్యాప్త నిరసనలకు దిగుతామని ప్రభుత్వానికి హెచ్చరిక**

ధర్మశాల, సెప్టెంబర్ 30: హిమాచల్‌ప్రదేశ్‌లో అలివికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు.. ఇప్పుడు వాటిని అమలుచేయలేక అల్లాడిపోతున్నది. ఉద్యోగులకు వేతనాలు, పింఛన్లు చెల్లించడానికి కూడా సతమతమవుతున్నది. గత నెలలో ఉద్యోగుల వేతనాలు ఐదు రోజులు, పెన్షనర్ల పింఛన్ 10 రోజులు ఆలస్యంగా చెల్లించిన సుఖ్వీందర్ సుఖు సర్కారు.. సెప్టెంబర్ నెలకు సంబంధించిన పింఛన్లను అక్టోబర్ 9న చెల్లిస్తామని ప్రకటించింది. దీంతో పెన్షనర్లు భగ్గుమన్నారు.

కాంగ్రెస్ సర్కార్ నిర్ణయంపై హిమాచల్ ప్రదేశ్ పెన్షనర్స్ సంక్షేమ సంఘం తీవ్రంగా మండిపడింది. 9వ తేదీ కాదు ప్రతినెలా ఒకటో తేదీకి చెల్లించాల్సిందేనని, లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించింది. సవరించిన గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసింది. పెన్షనర్లు, ఉద్యోగుల కారణంగా ఖజానా ఖాళీ అవ్వడం లేదని, మంత్రులు, ఎమ్మెల్యేలు, చైర్‌పర్సన్లు, కార్యదర్శులు వనరులను దోపిడీ చేస్తున్నారని సీఎం సుఖ్వీందర్ ప్రభుత్వంపై సంఘం అధ్యక్షుడు సురేశ్ ఠాకూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ప్రభుత్వం ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల కోసం వరుసగా రూ.1200 కోట్లు, 800 కోట్లు చెల్లించాల్సి ఉంది.

పని ఒత్తిడికి మరొకరు బలి

బజాజ్ ఫైనాన్స్ ఉద్యోగి ఆత్మహత్య

లక్నో: కార్పొరేట్ల విష పని సంస్కృతికి మరో ఉద్యోగి బలయ్యాడు. యూపీలోని ఝాన్సీలో బజాజ్ ఫైనాన్స్ కంపెనీ ఏరియా మేనేజర్‌గా పనిచేస్తున్న తరుణ్ సక్సేనా(42) ఆత్మహత్య చేసుకున్నాడు. టార్గెట్లు సాధించాలంటూ సీనియర్లు గత రెండు నెలలుగా తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారని, అవి చేయకపోతే వేతనంలో కోత విధిస్తామంటూ బెదిరిస్తున్నారని అతను సూసైడ్ నోట్‌లో ఆరోపించాడు. 'పని ఒత్తిడి కారణంగా 45 రోజులుగా నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నా. సరిగ్గా తిండి తినలేకపోతున్నా. అసాధ్యమైన టార్గెట్లతో వేధిస్తున్నారు. చేయకపోతే ఉద్యోగం లోంచి తీసేస్తామంటూ బెదిరిస్తున్నారు' అని సూసైడ్ నోట్‌లో తెలిపాడు. తరుణ్ సక్సేనాకు తల్లిదండ్రులతో పాటు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఆరోపణలపై బజాజ్ ఫైనాన్స్ ఇంకా స్పందించ లేదు.




కొవిడ్ లాక్‌డౌన్ కాలంలో చంద్రుడిపై ఉష్ణోగ్రతలు డౌన్

న్యూఢిల్లీ: కొవిడ్-19 లాక్‌డౌన్‌తో భూమిపై మానవ సంచారం సహా కార్యకలాపాలన్నీ నిలిచిపోయిన వేళ ఆశ్చర్యకరంగా చంద్రుడిపై ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. 2020 ఏప్రిల్-మే మధ్య జాబిల్లిపై ఉష్ణోగ్రతలు అసాధారణంగా పడిపోయినట్టు తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. రాత్రివేళ ఉష్ణోగ్రతలు 8-10 డిగ్రీల వరకు తగ్గిపోయినట్టు పేర్కొంది. అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రిసెర్చ్ ల్యాబరేటరీ పరిశోధకులు కే దుర్గాప్రసాద్, జీ అంబిలీ నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. కరోనా వల్ల పలు రంగాలు పనిచేయకపోవడం వల్ల ఈ ప్రభావం చంద్రుడిపై పడిందని చెప్పారు.



81 ఏండ్ల అందాల బామ్మ

సియోల్, సెప్టెంబర్ 30: సౌత్ కొరియాలో తాజాగా నిర్వహించిన మిస్‌యూనివర్స్ కొరియా పోటీల్లో 81 ఏండ్ల బామ్మ చోయ్ సూన్-హ్వా పాల్గొని రికార్డు సృష్టించారు. యువతులతో పోటీ పడి ఔరా అనిపించారు. క్యాట్ వాక్‌తో హొయలొలికించారు. బామ్మకు కిరీటం దక్కకపోయినా.. బెస్ట్ డ్రెస్సర్ అవార్డు లభించింది. కాగా, ఈ పోటీల్లో 22 ఏండ్ల ఫ్యాషన్ స్కూల్ స్టూడెంట్ హన్ ఏరియల్ మిస్ కొరియన్ కిరీటాన్ని దక్కించుకుంది. నవంబర్‌లో మెక్సికోలో జరిగే మిస్ యూనివర్స్ పోటీలకు ఆమె దక్షిణకొరియా తరఫున పాల్గొంటారు.



నిద్రపోవడం ద్వారా 9 లక్షలు గెలుచుకుంది

బెంగళూరు: బెంగళూరుకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ సాయిశ్వరి పాటిల్ ఎక్కువసేపు నిద్రపోవడం ద్వారా 'స్లీప్ చాంపియన్'గా నిలిచి రూ. 9 లక్షలు గెలుచుకున్నారు. బెంగళూరు స్టార్టప్ ఇనిషియేటివ్ వేక్‌ఫిట్ వరుసగా మూడో సీజన్‌లోనూ 'స్లీప్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం' నిర్వహించింది. పోటీదారులు ప్రతి రాత్రి 8 నుంచి 9 గంటలు నిద్రపోవాల్సి ఉంటుంది. పోటీదారుల నిద్ర అలవాట్లను మెరుగుపరిచేందుకు, స్లీప్ చాంపియన్ టైటిల్ గెలుచుకునే అవకాశాన్ని చేజిక్కించుకునేందుకు స్లీప్ ఎక్స్‌పర్ట్స్‌తో వర్క్‌షాపులు కూడా వేక్‌ఫిట్ నిర్వహిస్తుంది.



అనుపమ్ ఖేర్ ఫొటోతో రూ. 500 నకిలీ నోట్లు

అహ్మదాబాద్: బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ ఫొటోతో రూ.500 నోట్లను ముద్రించిన కేటుగాళ్లు.. వాటితో గుజరాత్‌కు చెందిన బంగారం డీలర్ మెహుల్ ఠక్కర్‌ను నిండా ముంచారు. బంగారం కొనుగోళ్ల పేరుతో రూ.1.6 కోట్ల మేర టోకరా వేశారు. ఠక్కర్ ఉద్యోగుల నుంచి బంగారం బిస్కట్లను తీసుకుని ఉడాయించారు. నకిలీ నోట్లపైన 'రిసోల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' అని రాసి ఉంది. ఈ ఘటన సెప్టెంబర్ 24న జరిగింది. కేటుగాళ్లు రెండు రోజుల క్రితమే హవాలా ఆఫీస్ తెరచి ఈ మోసానికి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు.



ఐఏఎస్ కోచింగ్ ఫీజు కోసం బాలుడి కిడ్నాప్

పాట్నా: ఉత్తరప్రదేశ్‌లోని దేవరియాకు చెందిన ఓ వ్యక్తి (25) యూపీఎస్సీ కోచింగ్ ఫీజు కోసం నేరానికి పాల్పడ్డాడు. నిందితుడు బీహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లాకు వెళ్లాడు. వర్షం పడుతున్నదని, ఇంట్లో కాస్త చోటు ఇవ్వాలని ఓ మహిళను కోరాడు. ఆమె అంగీకరించడంతో ఆ ఇంట్లోకి వెళ్లాడు. ఆమె గదిలోకి వెళ్లి, తిరిగి వచ్చి చూసేసరికి ఆమె ఎనిమిదేళ్ల కుమారుడిని తీసుకుని నిందితుడు పారిపోయాడు. బాలుడిని విడిచిపెట్టాలంటే రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దేవరియాలో బాలుడిని గుర్తించారు.

దేశవాళీ ఆవులు 'రాజ్యమాత-గోమాత'లు

మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటన

ముంబై: అసెంబ్లీ ఎన్నికల ముంగిట మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. దేశవాళీ ఆవులను 'రాజ్యమాత-గోమాత'లుగా ప్రకటించింది. వేద కాలం నుంచి వీటికి గొప్ప ప్రాధాన్యం ఉండటం, మానవుల పోషకాహారం, ఆయుర్వేదం, పంచగవ్య చికిత్స, ప్రకృతి సాగు విధానాల్లో ఆవు పాలు, ఎరువుల వినియోగం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయం, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక, మత్స్య శాఖ సోమవారం ఓ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

కొత్త అసెట్ క్లాస్‌ను తెచ్చిన సెబీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ ఓ కొత్త అసెట్ క్లాస్‌ను పరిచయం చేసింది. అసెట్ కన్‌స్ట్రక్షన్‌లోని ఫ్లెక్సిబిలిటీ టర్మ్స్‌లో మ్యూచువల్ ఫండ్స్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసుల మధ్యనున్న అంతరాన్ని అధిగమించడానికి హై-రిస్క్ ప్రొఫైల్ ఇన్వెస్టర్ల కోసం దీన్ని తెచ్చింది. ఇందులో ఒక్కో ఇన్వెస్టర్ కనీస పెట్టుబడి పరిమాణం రూ.10 లక్షలుగా ఉన్నది. అలాగే ప్యాసివ్ స్కీముల కోసం ఎంఎఫ్ లైట్-టచ్ ఫ్రేమ్‌వర్క్‌కు ఆమోదం తెలిపింది. కాగా, సోమవారం జరిగిన సెబీ బోర్డు సమావేశంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు సవరణసహా మొత్తం 17 ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపారు. సెబీ చైర్‌పర్సన్ బుచ్‌పై హిండెన్‌బర్గ్ ఆరోపణల తర్వాత జరిగిన తొలి బోర్డు సమావేశం ఇదే.

చిన్న మొత్తాలపై వడ్డీ యథాతథం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: చిన్న మొత్తాలపై వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను చిన్న మొత్తాల పొదుపు స్కీంలు, పీపీఎఫ్, ఎన్‌ఎస్‌సీ వడ్డీరేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు వడ్డీరేట్లు వర్తించనున్నదని ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. వరుసగా వడ్డీరేట్లలో మార్పులు చేయకపోవడం ఇది వరుసగా మూడోసారి.

ఫ్లిప్‌కార్ట్‌లో యెజ్డీ అమ్మకాలు

ముంబై, సెప్టెంబర్ 30: వాహన విక్రయాలను పెంచుకోవడమే లక్ష్యంగా యెజ్డీ కంపెనీ వినూత్నంగా ఆలోచించింది. దీంతో ప్రముఖ ఈ-కామర్స్ వేదిక ఫ్లిప్‌కార్ట్‌లో జావా యెజ్డీ మోటర్‌సైకిళ్లు లభించనున్నాయి. అవును.. ఇప్పటిదాకా స్మార్ట్‌ఫోన్లు, టెలివిజన్లు ఇతర కన్జ్యూమర్ డ్యూరబుల్స్, గృహోపకరణాలు, దుస్తులు, పాదరక్షలు, కన్జ్యూమర్ గూడ్స్ మొదలగునవి అమ్ముతున్న ఫ్లిప్‌కార్ట్‌లో ఇకపై యెజ్డీ అమ్మకాలు జరుగుతాయని సోమవారం ఈ బ్రాండ్ మాతృ సంస్థ క్లాసిక్ లెజెండ్స్ ప్రకటించింది. ఈ మేరకు ఇరు సంస్థల మధ్య ఒప్పందం జరిగిందని, ఇది భారతీయ ప్రీమియం మోటర్‌సైకిల్ మార్కెట్ పరిణామంలో కీలక పరిణామమని పేర్కొన్నది. ఫ్లిప్‌కార్ట్‌తో జట్టు కట్టడం వల్ల అందులోని 50 కోట్ల కస్టమర్లకు తమ బ్రాండ్ చేరువ కాగలదన్న విశ్వాసాన్ని ఈ సందర్భంగా క్లాసిక్ లెజెండ్స్ సీఈవో ఆశిష్ సింగ్ జోషి వ్యక్తం చేశారు. ఇదిలావుంటే ఫ్లిప్‌కార్ట్‌లో యెజ్డీ మోటర్‌సైకిల్ కొనుగోళ్లపై నో-కాస్ట్ ఈఎంఐ, బై నౌ-పే లేటర్ స్కీములు, డౌన్ పేమెంట్ లేకుండా ఈఎంఐ ప్లాన్ల వంటివి అందుబాటులో ఉంటాయని చెప్తున్నారు. కస్టమర్లు ఎంపిక చేసిన మోడళ్లపై రూ.22,500 విలువైన ప్రయోజనాలనూ పొందవచ్చు. యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు వినియోగం తదితర మార్గాల ద్వారా వీటిని అందుకోవచ్చు. కాగా, జావా, యెజ్డీ, బీఎస్‌ఏ శ్రేణిలో క్లాసిక్ మోటర్‌సైకిళ్ల బ్రాండ్లున్నాయి.

పాతాళంలోకి కీలక రంగాలు

- మూడున్నరేండ్ల కనిష్ఠానికి వృద్ధిరేటు
- ఆగస్టులో -1.8 శాతంగా నమోదు
- మెజారిటీ రంగాల్లో క్షీణించిన ఉత్పాదకత
- నిరాశాజనకంగా పరిశ్రమల తీరు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: దేశంలో పారిశ్రామిక ప్రగతి పాతాళానికి దిగజారింది. కీలక రంగాల్లో నిర్జీవం ఆవరించింది. మరీ ఆగస్టులో మూడున్నరేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ -1.8 శాతానికి వృద్ధిరేటు పతనం కావడం ప్రమాద ఘంటికల్ని మోగిస్తున్నదిప్పుడు. 2021 ఫిబ్రవరిలో -3.3 శాతంగా నమోదైంది. మళ్లీ ఆ తర్వాత ఇప్పుడే నెగెటివ్ జోన్‌లోకి కోర్ సెక్టార్స్ పడిపోవడం గమనార్హం. ఎరువులు, ఉక్కు రంగాలు మినహా బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, సిమెంట్, విద్యుత్తు రంగాల్లో ఉత్పాదకత క్షీణించింది. ఈ మేరకు సోమవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక గణాంకాల్లో తేలింది. నిజానికి ఈ ఏడాది జూలైలో 6.1 శాతం వృద్ధిరేటు కనిపించింది. ఇక గత ఏడాది ఆగస్టులో ఏకంగా 13.4 శాతం వృద్ధి నమోదైంది. కానీ ఏడాది వ్యవధిలో అంతా తారుమారైపోయింది.

ఐఐపీపై ప్రభావం


భారతీయ పారిశ్రామిక రంగ ముఖచిత్రాన్ని ప్రతిబింబించే పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఎరువులు, ఉక్కు, బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, సిమెంట్, విద్యుత్తు రంగాల వాటా 40.27 శాతంగా ఉన్నది. అయితే ఈ 8 కీలక రంగాల్లో ఇప్పుడు 6 రంగాలు నిరాశాజనకంగా కనిపిస్తున్నాయి. గతంతో పోల్చితే ఈ రంగాల్లో తయారీ దారుణంగా పడిపోయింది. మిగతా 2 రంగాల్లోనూ ఎరువుల తయారీ ఒక్కటే ఆకట్టుకునే స్థాయిలో ప్రదర్శనిచ్చింది. 1.8 శాతం నుంచి 3.2 శాతానికి వృద్ధి చెందింది. అయితే ఉక్కు పరిశ్రమల్లోనూ మందగమన ఛాయలు కనిపిస్తున్నాయి. నిరుడు ఆగస్టులో ఈ రంగం ఉత్పాదకత రేటు 16.4 శాతంగా ఉన్నది. కానీ ఈ ఏడాది ఆగస్టులో ఇది 4.5 శాతానికి దిగజారడం పరిస్థితుల తీవ్రతకు అద్దం పడుతున్నది. దీంతో మొత్తం ఐఐపీనే ప్రభావితం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే రాబోయే నెల్లో ఐఐపీ గణాంకాలు పడిపోవచ్చన్న అంచనాలు ఇప్పుడు గట్టిగానే వినిపిస్తున్నాయి. ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనాల ప్రకారం ఆగస్టులో ఐఐపీ గణాంకాలు 1 శాతానికి పడిపోవచ్చు. జూలైలో ఇది 4.8 శాతంగా ఉన్నది. ఇక సెప్టెంబర్‌లోనూ కీలక రంగాల ప్రదర్శన అసంతృప్తిగానే ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

2024-25 మొదలు..

ఈ ఆర్థిక సంవత్సరం మొదలు కీలక రంగాల పనితీరు అంతంతమాత్రంగానే సాగుతున్నది. ఏప్రిల్-ఆగస్టు మధ్య 8 కీలక రంగాల వృద్ధిరేటు 2023-24 ఇదే వ్యవధితో పోల్చితే 8 శాతం నుంచి 4.6 శాతానికి తగ్గింది. పరిస్థితులు ఇకపైనా ఇలాగే ఉంటే దేశ జీడీపీ అంచనాలను అవి పెద్ద ఎత్తునే ప్రభావితం చేయవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే వినియోగదారుల కొనుగోలు శక్తిని పెంచేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఆర్బీఐ ఇకనైనా వడ్డీరేట్లను తగ్గించాలని అటు ఇండస్ట్రీ, ఇటు మార్కెట్ వర్గాలూ డిమాండ్ చేస్తున్నాయి.

ఆగస్టులో కీలక రంగాలు తీరిది

రంగం	వృద్ధిరేటు (శాతాల్లో)
బొగ్గు	-8.1
ముడి చమురు	-3.4
సహజ వాయువు	-3.6
రిఫైనరీ ఉత్పత్తులు	-1
సిమెంట్	-3
విద్యుత్తు	-5
ఎరువులు	3.2
ఉక్కు	4.5



పతనానికి కారణాలు

- ఎఫ్‌ఐఐలు తమ పెట్టుబడులను చైనా మార్కెట్లకు తరలించడం
- పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న ఉద్రిక్తకర పరిస్థితులు
- అమెరికా నిరుత్సాహక గణాంకాలు, ఫెడ్ చీఫ్ ప్రసంగం
- జపాన్ వడ్డీరేట్లు పెంచడం
- విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా పెట్టుబడులను ఉపసంహరించుకోవడం



యుద్ధమేఘాలు

సెన్సెక్స్ 1,272, నిఫ్టీ 368 పాయింట్ల నష్టం

భారీగా నష్టపోయిన దేశీయ సూచీలు

రూ.3.57 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరి

ముంబై, సెప్టెంబర్ 30: దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అంతర్జాతీయ దేశాల్లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులకు తోడు జపాన్ సూచీలు కుప్పకూలడం దేశీయ మార్కెట్ల పతనానికి ఆజ్యం పోశాయి. బ్యాంకింగ్, ఆర్థిక, వాహన రంగ షేర్లలో క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. ఇంట్రాడేలో 1,300 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 1,272.07 పాయింట్లు (1.49 శాతం) నష్టపోయి 85 వేల దిగువకు 84,299.78 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ కూడా 368.10 పాయింట్లు లేదా 1.41 శాతం పతనం చెంది 25,810.85 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్ల భారీ నష్టంతో లక్షల కోట్ల మదుపరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. బీఎస్ఈ లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.3,57,885.53 కోట్లు కరిగిపోయి రూ.4,74,35,137.15 కోట్లకు (5.66 ట్రిలియన్ డాలర్ల) పడిపోయింది. గడిచిన రెండు నెలలుగా పెరుగుతూ వచ్చిన నిఫ్టీ భారీగా నష్టపోయిందని, చైనా ఇటీవల తీసుకున్న ఉద్దీపన ప్యాకేజీతో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను అక్కడికి తరలించడం కూడా ఇతర దేశాల సూచీలపై ప్రతికూల ప్రభావం చూపాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ హెడ్ దీపక్ జసాని తెలిపారు.

- రిలయన్స్ 3.23 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు యాక్సిస్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, నెస్లె, టెక్ మహీంద్రాలు రెండు శాతానికి పైగా నష్టపోయాయి.
- వీటితోపాటు మారుతి, ఎస్బీఐ, టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, ఐటీసీ, ఎల్‌అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు దిగువముఖం పట్టాయి.
- కానీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎన్‌టీపీసీ, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్, టైటాన్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

రిలయన్స్ షేరు భారీ పతనం

దేశీయ కుబేరుడిలో ఒకరైన ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు కుప్పకూలింది. కంపెనీ షేరు విలువ 3.23 శాతం నష్టపోయి రూ.2,953.80 వద్ద నిలిచింది. అటు ఎన్ఎస్ఈలోనూ షేరు 3.13 శాతం నష్టంతో రూ.2,956.70 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.66,818.76 కోట్లు కోల్పోయి రూ.20 లక్షల కోట్ల దిగువకు పడిపోయింది. చివరకు రూ.19,98,503.98 కోట్లకు పడిపోయింది.

డిసెంబర్ నాటికి లక్ష పాయింట్లకు సెన్సెక్స్

ఈ ఏడాది చివరినాటికి సెన్సెక్స్ లక్ష పాయింట్లకు చేరుకునే అవకాశాలున్నాయని మార్కెట్ పండితులు అంచనావేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుండటం ఇందుకు కారణమన్నారు. గడిచిన మూడు నెలల్లో సూచీ 18 శాతం రిటర్నులు పంచడంతో ఈ ఏడాది చివరినాటికి 1,00,000 పాయింట్లకు చేరుకోవడం పెద్ద కష్టమేమి కాదని వెటరన్ ఎమర్జింగ్ మార్కెట్ ఇన్వెస్టర్ మార్క్ మోబియస్ తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. 2015 తర్వాత ఒకే ఏడాది ఇంతటి స్థాయిలో రిటర్నులు పంచడం ఇదే తొలిసారన్నారు.

9999కు రూ.20 లక్షలు!

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఫ్యాన్సీ నంబర్ల బిడ్డింగ్‌లో భాగంగా ఆర్టీఏ ఖజానాలో సోమవారం రూ.47.12 లక్షల ఆదాయం చేరింది. ఖైతరాబాద్ ఆర్టీఏ కార్యాలయం నిర్వహించిన ఫ్యాన్సీ నంబర్ల వేలంలో టీజీ 09 బీ 9999 నంబర్‌ను రూ.20 లక్షలకు ఒక మొబైల్ కంపెనీ దక్కించుకున్నట్టు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్ తెలిపారు. టీజీ09సీ0001 నంబర్‌కు రూ.10.27 లక్షలు, టీజీ 09 ఈ 0007 నంబర్‌కు రూ.లక్ష పలికినట్టు వెల్లడించారు.

యూట్యూబర్ నరేశ్‌గౌడ్ విడుదల

నాంపల్లి కోర్టులు, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు, యూట్యూబ్ వేదికగా తప్పుడు పోస్టులు పెట్టినట్టు కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో బీఆర్‌ఎస్‌కు చెందిన యూట్యూబర్ సిద్దమోని నరేశ్‌గౌడ్‌ను పోలీసులు విడుదల చేశారు. సెక్షన్లు 67 ఐడీఏ-2000-2008, 353(2), 352, 193, 196 బీఎన్‌ఎస్ కింద కేసు నమోదు చేసి సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి పేరు, ప్రతిష్టలకు భంగం వాటిల్లేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినట్టు అహ్మద్ అస్లామ్ అనే న్యాయవాది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. 41-ఏ నోటీసులు జారీ చేయాలని బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాది లక్ష్మణ్‌గంగా పోలీసులను ప్రశ్నించడంతో రిమాండ్‌కు తరలించకుండా విడుదల చేశారు.

5న ఆర్టీసీ అమరుల సంస్మరణ దినం

ఘనంగా నిర్వహించాలి: ఆర్టీసీ జాక్

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : తమ హక్కుల పరిరక్షణ, న్యాయమైన డిమాండ్ల సాధనకు జరిపిన 55రోజుల జనుల సమ్మె 32మంది కార్మికుల ఆత్మబలిదానంతో ముగిసిందని ఆర్టీసీ కార్మిక జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ జాక్ కార్యాలయంలో కన్వీనర్ మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేశ్, యాదగిరితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐక్యపోరాటానికి నాంది పలికిన(అక్టోబర్ 5న) రోజుకు ఐదేండ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఆర్టీసీ అమరవీరుల సంస్మరణ దినంగా పాటించాలని కోరారు. అన్ని యూనిట్లలో అమరవీరులకు నివాళులర్పించాలని పిలుపునిచ్చారు.

మంచం కింద డిటోనేటర్లు పేల్చి హత్య

- వివాహేతర సంబంధం నేపథ్యంలో ఘాతుకం
- వైఎస్‌ఆర్ కడప జిల్లాలో దారుణం

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఏపీలోని వైఎస్‌ఆర్ కడప జిల్లాలో వివాహేతర సంబంధం ఓ వ్యక్తి ప్రాణాలను బలితీసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్‌ఆర్ జిల్లా వేముల మండలం కొత్తపల్లిలో వీఆర్‌ఏ నరసింహ తన ఇంట్లో నిద్రిస్తుండగా బాబు అనే వ్యక్తి మంచం కింద డిటోనేటర్లుపెట్టి పేల్చాడు. ఈ ఘటనలో నరసింహ అక్కడికక్కడే మృతిచెందాడు. నరసింహ భార్య సుబ్బలక్ష్మమ్మకు గాయాలు కాగా, హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నరసింహ మృతికి వివాహేతర సంబంధమే కారణమని ప్రాథమికంగా తేల్చారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

దుబాయిలో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): దుబాయిలో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు టామ్‌కామ్ దరఖాస్తులు కోరుతున్నది. ఇండియన్ టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్సు, 21-40 ఏండ్ల మధ్య వయసు వారు అర్హులని తెలిపింది. ఆసక్తి గల వారు tomcom. resume@ gmail.comకు రెజ్యూమ్ మెయిల్ చేయాలని సూచించింది.

మెట్రో లేని 'ఉత్త'ర నగరం!


- మెట్రో మాకొద్దా.. మేం చేసిన పాపమేమిటి?
- ఉత్తర హైదరాబాద్‌పై సీఎం రేవంత్ చిన్నచూపు
- జనమే లేని ఫ్యూచర్ సిటీకి 40 కి.మీ. మెట్రోనా?
- సర్కారుపై మేడ్చల్, శామీర్‌పేట వాసుల మండిపాటు



హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): 'మేమూ మనుషులమే. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నవాళ్లమే. లేని ఫోర్త్ సిటీ కోసం 40 కి.మీ మేర మెట్రో మార్గాన్ని నిర్మిస్తున్నారు. అలాంటిది ఉత్తర హైదరాబాద్‌లోని సుచిత్ర, మేడ్చల్, అల్వాల్, శామీర్‌పేట ప్రాంతాలకు మెట్రో రైలు కారిడార్ ఎందుకు వేయరు? మాకొద్దా మెట్రో? మేం ఏం పాపం చేశాం?' అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆదివారం మెట్రో రైలు సంస్థ ప్రకటించిన రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టులో 116 కి.మీ మేర కొత్తగా మెట్రో కారిడార్‌లను నిర్మిస్తామని ప్రకటించగా.. అందులో మేడ్చల్, శామీర్‌పేటవైపు ఉన్న ప్రాంతాలకు మెట్రో ప్రతిపాదన లేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉత్తర హైదరాబాద్‌కు మెట్రో కావాలని అడుగుతున్నా పరిగణనలోకి తీసుకోవడం లేదని మండిపడుతున్నారు. మేడ్చల్ మెట్రో సాధన సమితిగా సంఘటితమై కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యమానికి సిద్ధమయ్యారు. మేడ్చల్, దాని పరిసర ప్రాంతాలతో కూడిన ఉత్తర హైదరాబాద్‌ను ప్రభుత్వం విస్మరించిందని, ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని ధ్వజమెత్తారు.

ఈ నెల 6న ధర్నా

హైదరాబాద్‌కు ఉత్తరాన ఉన్న సికింద్రాబాద్ ప్యాట్నీ-శామీర్‌పేట, ప్యారడైజ్-మేడ్చల్ మార్గంలో లక్షల మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు కూడా భారీగానే ఉన్నాయి. నిత్యం లక్షల మంది ఈ రెండు మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో కేసీఆర్ ప్రభుత్వం మెట్రో మార్గాలను ప్రతిపాదించింది. కానీ, అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రెండు మార్గాలను పక్కనపెట్టింది. దీన్ని నిరసిస్తూ ఈనెల 6న జీడిమెట్ల గాంధీ విగ్రహం వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు నిర్ణయించారు. ప్రభుత్వంపై పోరాడేందుకు హైకోర్టును ఆశ్రయిస్తున్నామని, పిటిషన్‌ను కూడా సిద్ధం చేశామని తెలిపారు.



బోధన్‌లోని నిజాం చక్కెర ఫ్యాక్టరీ ఎదుట మాట్లాడుతున్న కార్మిక సంఘ నేతలు

చక్కెర ఫ్యాక్టరీ ప్రారంభం ఏమైంది?


- కార్మిక సంఘాల నాయకుల ఆగ్రహం

బోధన్, సెప్టెంబర్ 30: సెప్టెంబర్ 17 లోపు నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఏమైందని ఫ్యాక్టరీ కార్మికులు ప్రశ్నించారు. ఏకంగా సీఎం మాటకే దిక్కు లేకపోతే? ఎలా అని నిలదీశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని షుగర్ ఫ్యాక్టరీ ఎదుట కార్మిక సంఘాల నేతలు మీడియాతో మాట్లాడారు. అసియాలోనే అతిపెద్ద చక్కెర కర్మాగారమైన నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎలాంటి విధివిధానాలు రూపొందించలేదని వాపోయారు. ప్రైవేట్ యాజమాన్యం అక్రమంగా లేఆఫ్ ప్రకటించిందని, వేతనాలు లేక తమ పరిస్థితి దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కుమారస్వామి, రవిశంకర్‌గౌడ్, శ్రీనివాస్, బాలకృష్ణ, రాంబాబు, భాస్కర్ పాల్గొన్నారు.

దసరాకు 6 వేల ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): దసరా సందర్భంగా హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్లే వారి కోసం 6 వేల ప్రత్యేక బస్సులను ఏర్పాట్లు చేసినట్టు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. సోమవారం సంబంధిత అధికారులతో ఆయన వర్చువల్‌గా సమావేశమై మాట్లాడారు. 1 నుంచి 15 వరకు ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, కేపీహెచ్‌బీ, సంతోష్‌నగర్ నుంచి జిల్లాలకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్టు వెల్లడించారు. కరీంనగర్, నిజామాబాద్ మార్గాల్లో ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులను వినియోగించుకోవాలన్నారు. గచ్చిబౌలి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరుకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు చెప్పారు. tgsrtbus.inలో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని సూచించారు. సమాచారం కోసం ఆర్టీసీ కాల్‌సెంటర్ నంబర్లు 040-69440000,040-23450033ను సంప్రదించాలని కోరారు.

సైబర్ క్రిమినల్స్‌పై సీబీ'ఐ'



- దేశవ్యాప్తంగా 32 చోట్ల సోదాలు, 26 మంది అరెస్టు
- రూ.58.45 లక్షల నగదు, కీలక పత్రాలు స్వాధీనం
- డిజిటల్ సామగ్రి, లాకర్ల తాళాలు, కార్లు కూడా

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): అమాయకులను లక్ష్యంగా చేసుకొని కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) దృష్టి సారించింది. 'ఆపరేషన్ చక్ర-3'లో భాగంగా గురువారం నుంచి దేశవ్యాప్తంగా విస్తృత సోదాలు చేపట్టింది. హైదరాబాద్‌లోని వయాజెక్స్ సొల్యూషన్స్, పుణెలోని వీసీ ఇన్‌ఫ్రాటెక్, విశాఖపట్నంలోని వీసీ ఇన్‌ఫ్రాటెక్, అత్రియా గ్లోబల్ సర్వీసెస్ సంస్థల కాల్‌సెంటర్లలో సోదాలు నిర్వహించి 26 మందిని అరెస్టు చేసినట్టు ప్రకటించింది. వీరిలో విశాఖకు చెందిన 11 మంది, పుణెకి చెందిన 10 మంది, హైదరాబాద్‌కు చెందిన నలుగురు ఉన్నట్టు వెల్లడించింది. రూ.58.45 లక్షల నగదుతోపాటు పలు కీలక పత్రాలు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, కమ్యూనికేషన్ రికార్డులు, భారీ సంఖ్యలో లాకర్ల తాళాలు, 3 లగ్జరీ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపింది. సైబర్ నేరగాళ్లు 'టెక్ సపోర్ట్ సర్వీస్'ల పేరుతో కంపెనీలను ప్రారంభిస్తున్నట్టు సీబీఐ గుర్తించింది. మీ సిస్టమ్స్ హ్యాక్ అయ్యాయని, మీ బ్యాంకు ఖాతాల నుంచి పెద్ద ఎత్తున అనధికార లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపింది.

గురుకుల పాఠశాలకు తాళం

ఎర్రవల్లి చౌరస్తా, సెప్టెంబర్ 30: గురుకుల పాఠశాల భవనానికి 10 నెలలుగా అద్దె చెల్లించడం లేదని యజమాని సోమవారం పాఠశాలకు తాళం వేశాడు. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకుంది. అయిజ మండలానికి సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల మంజూరు కాగా.. అక్కడ సౌకర్యాలు లేవని అధికారులు ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఎంజీ కృష్ణకు చెందిన భవనంలో స్కూల్‌ను నడుపుతున్నారు. నెలకు రూ.2 లక్షల చొప్పున 10 నెలలకు రూ.20 లక్షల వరకు అద్దె డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయమై పాఠశాల సిబ్బందిని యజమాని ఎన్నిసార్లు అడిగినా ఈరోజు, రేపు అంటూ దాటవేస్తూ వచ్చారు. దీంతో ఆగ్రహించిన యజమాని సోమవారం ఉపాధ్యాయులు పాఠశాల లోపలికి వెళ్లకుండా గేటుకు తాళం వేశాడు. ఈ విషయం తెలుసుకున్న జోనల్ ఆఫీసర్ రజని స్పందించి ఓనర్‌తో మాట్లాడి రెండ్రోజుల్లో డబ్బులు చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో కృష్ణ గేటుకు తాళం తీశాడు. అలాగే విద్యార్థుల హాస్టల్ భవన నిర్మాణానికి సంబంధించి రూ.30 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని యజమాని కృష్ణ వాపోయాడు.



జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లిలో అద్దె డబ్బులు చెల్లించాలని గురుకుల పాఠశాలకు తాళం వేస్తున్న భవన యజమాని

ఉపాధ్యాయులను నియమించాలని ధర్నా


నిర్మల్ జిల్లా కడెం మండలం పెద్దూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులు నిర్మల్-మంచిర్యాల ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. పాఠశాలలో రెండు ఉపాధ్యాయ పోస్టులకు గాను ఒకరే ఉండగా.. ఈ మధ్య జరిగిన బదిలీల్లో ఉన్న ఉపాధ్యాయుడు కూడా వేరే గ్రామానికి వెళ్లారు. పాఠాలు బోధించే వారు లేకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. – కడెం

ఎస్సీ గురుకుల సొసైటీకి 6233 పోస్టులు

హైదరాబాద్, సెప్టెంబర్30 (నమస్తే తెలంగాణ): ఎస్సీ గురుకుల సొసైటీకి పార్ట్‌టైం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, హానరోరియం ప్రాతిపదికపై 6233 పోస్టులు మంజూరయ్యాయి. సొసైటీ పరిధిలోని స్కూళ్లు, కాలేజీలు, సీవోఈ, స్పోర్ట్స్ అకాడమీలు, వొకేషనల్ కాలేజీలు, ప్రత్యేక గురుకులాల్లో కాంట్రాక్ట్‌పై ఇద్దరు, ఔట్‌సోర్సింగ్‌పై 1423 మంది, పార్ట్‌టైమర్లుగా 3907 మంది, హానరోరియంపై 901 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వారందరి సర్వీస్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వం జీవో 1313ను విడుదల చేసింది. పోస్టుల మంజూరుకు కృషి చేసిన సొసైటీ కార్యదర్శి వర్షిణికి ఉద్యోగుల తరఫున టిగారియా అధ్యక్షుడు నారాయణ, జనరల్ సెక్రటరీ డాక్టర్ మధుసూదన్, యూనియన్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

మరమ్మతులకు రాపిడ్ యాక్షన్ టీం

ఎస్సీ గురుకుల భవనాల్లో అత్యవసర పనుల నిర్వహణకు రాపిడ్ రెస్పాన్స్ బృందాలను నియమించారు. సొసైటీ సెక్రటరీ వర్షిణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బృందంలో ప్లంబర్, ఎలక్ట్రీషియన్, మాషన్, కార్పెంటర్ ఉండనున్నారు. భవనాల్లో విద్యుత్ మరమ్మతులు, కార్పెంట్, ప్లంబింగ్, నిర్మాణాల పనులను ఈ బృందాలే పూర్తిచేస్తాయి.

స్థానికతపై రాష్ట్రాలదే నిర్ణయం

మెడికల్ సీట్ల భర్తీపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): నీట్ యూజీ మెడికల్ సీట్ల భర్తీలో 'స్థానికత' అంశం మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం వద్దకే చేరింది. కౌన్సెలింగ్‌లో తమకు కూడా అవకాశం ఇవ్వాలంటూ నాన్ పిటిషనర్లు వేసిన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. సెప్టెంబర్ 20న తాము ఇచ్చిన ఉత్తర్వులను నాన్ పటిషనర్లకు కూడా వర్తింపజేయాలా? లేదా? అనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ ఉత్తర్వులను వారికి కూడా అమలు చేసిన పక్షంలో ఎదురయ్యే సమస్యలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వాలే తగిన నిబంధనలు రూపొందించాలని పేర్కొంటూ.. ఈ అంశంపై ఈ నెల 3న తమ తుది నిర్ణయాన్ని వెల్లడిస్తామని ప్రకటించింది.

ప్రభుత్వం నిర్ణయంపైనే ఆశ

మెడికల్ సీట్ల భర్తీలో స్థానికతను నిర్ధారిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 33పై ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై తొలుత హైకోర్టును ఆశ్రయించిన 135 మంది పిటిషనర్లకు ఈ ఏడాది కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడంతో తదనుగుణంగా సుప్రీంకోర్టు సెప్టెంబర్ 20న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వులను తమకు కూడా వర్తింపజేయాలని, తమను కూడా స్థానికులుగా పరిగణించి కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అవకాశాన్ని కల్పించాలని కోరుతూ నాన్ పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రెండేండ్లు ఇతర రాష్ట్రాల్లో చదివిన కారణంగా తాము ఇటు తెలంగాణతోపాటు అటు ఇతర రాష్ట్రాల్లోనూ స్థానికేతరులుగా మారిపోయామని, తెలంగాణ బిడ్డలమైనప్పటికీ సొంత రాష్ట్రంలోనే తీవ్రంగా నష్టపోతున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునేలా ఆదేశించాలని కోరారు. దీంతో వారి విజ్ఞప్తిపై రాష్ట్ర ప్రభుత్వమే తుది నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది.

ఎల్‌ఎల్‌ఎంలో 90% సీట్లు భర్తీ

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): పీజీ లా కోర్సు అయిన ఎల్‌ఎల్‌ఎంలో ఈ ఏడాది 90శాతం సీట్లు భర్తీ అయ్యాయి. 961 సీట్లకు మొదటి విడతలోనే 871 సీట్లు భర్తీ అయ్యాయి. పీజీ లాసెట్ మొదటి విడత సీట్లను సోమవారం కేటాయించారు. సీట్లు పొందిన వారు 5లోగా కాలేజీల్లో రిపోర్ట్‌చేయాలని, 9 నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని ప్రవేశాల కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్ బాబు పేర్కొన్నారు.

జేఎన్‌ఏఎఫ్‌ఏయూ వీసీ నియామకం ఆలస్యం

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్‌ఎఫ్ఏయూ) వైస్‌చాన్స్‌లర్ నియామకం ఆలస్యంకానుంది. కొత్త వీసీలను ఖరారుచేసేందుకు 4,5న సెర్చ్ కమిటీలు సమావేశం కానున్నాయి. 10 వర్సిటీల సెర్చ్ కమిటీ సమావేశాల కోసం షెడ్యూల్ రూపొందించారు. జేఎన్‌ఎఫ్ఏయూ సెర్చ్‌కమిటీలో ఓ సభ్యుడు అందుబాటులో ఉండటంలేదని సమాచారమిచ్చారు. దీంతో ఈ వర్సిటీ మినహా 9 వర్సిటీల సెర్చ్ కమిటీ సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.

నోడల్ అధికారిగా హరిత

సెర్చ్ కమిటీ సమావేశాలకు నోడల్ అధికారిగా విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి హరిత వ్యవహరించనున్నారు. ఇది వరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉన్న బుర్రా వెంకటేశం గవర్నర్ సెక్రటరీగా కూడా ఉన్నారు. వీసీ నియామక ఫైల్ రాజ్‌భవన్ ఆమోదానికి పంపాల్సి ఉండటంతో విద్యాశాఖలో పనిచేస్తున్న హరితకు బాధ్యతలను అప్పగించారు.

ఎమ్మెస్సీ నర్సింగ్‌కు అవకాశం ఇవ్వండి

ప్రభుత్వానికి ఇన్ సర్వీస్ నర్సింగ్ ఆఫీసర్ల విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఎమ్మెస్సీ నర్సింగ్ చేయాలని ఆశపడుతున్నా.. ప్రభుత్వ నిబంధనలు తమకు ఆ అవకాశం ఇవ్వడం లేదని ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్లు వాపోతున్నారు. కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ప్రస్తుతం ఎమ్మెస్సీ నర్సింగ్ అడ్మిషన్లను మెరిట్ ప్రతిపాదికన నిర్వహిస్తున్నది. సోమాజిగూడలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో 12 సీట్లను ఇన్‌సర్వీస్ కోటా కింద నర్సింగ్ ఆఫీసర్లకు కేటాయించారు. ఇందులో ఒక సీటు ప్రైవేట్ స్పాన్సర్డ్ సీటు. అంటే.. 11 సీట్లను మాత్రమే వర్కింగ్ నర్సులకు కేటాయిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11వేల మందికిపైగా ప్రభుత్వ నర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో దాదాపు 6-7 వేల మంది బీఎస్సీ నర్సింగ్ చేసినవారు ఉంటారని అంచనా. అందరికీ కలిపి కేవలం 11 సీట్లు కేటాయించడంతో తాము నష్టపోతున్నామని వర్కింగ్ నర్సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంట్రెన్స్ ఆధారంగా అడ్మిషన్లు చేపడితే అవకాశాలు పెరుగుతాయని చెప్తున్నారు. ఇద్దయన్ నర్సింగ్ కౌన్సిల్ కూడా ఇదే సూచిస్తున్నది. కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించాలని కోరుతూ హెల్త్ సెక్రటరీ, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వీసీ, డీఎంఈకి వినతిపత్రాలు సమర్పించినట్టు చెబుతున్నారు.

'బీఆర్ఏవోయూ భూమిని కేటాయించొద్దు'

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి చెందిన పదెకరాల స్థలాన్ని జేఎన్‌ఎఫ్ఏయూకు కేటాయించడాన్ని వెనక్కి తీసుకోవాలని వర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసింది. వారు సోమవారం వర్సిటీలో సమావేశమై మాట్లాడుతూ.. తక్కువ ఫీజులతో ఉన్నత విద్యనందిస్తున్న విశ్వవిద్యాలయ భూమిని వేరే విశ్వవిద్యాలయానికి కేటాయించడాన్ని ఖండించారు. సమావేశంలో వర్సిటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బానోత్ ధర్మ, అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, సెక్రటరీ ఉదయిని పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పు

మొదటిపేజీ తరువాయి...

ఉంది. ఇంతలోనే గుర్తు తెలియని దుండగులు విగ్రహంపై కప్పి ఉంచిన ముసుగుకు నిప్పంటించారు. దీంతో విగ్రహం పాక్షికంగా కాలిపోయింది. సోమవారం ఉదయం స్థానిక బీఆర్ఎస్ నాయకులు గద్దల రమేశ్, గంగాధరి రాజయ్య, వెల్ది రంగారావు గమనించి మాజీ ఎంపీపీ మాలోతు లక్ష్మీబీలూనాయక్, మాజీ జడ్పీటీసీ భూక్య మంగ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు సహా ముఖ్య నాయకులకు సమాచారం అందించారు. విగ్రహం దగ్గరికి చేరుకున్న నాయకులు తెలంగాణ తల్లి విగ్రహాన్ని నీళ్లతో శుభ్రంగా కడిగి ఆ తర్వాత క్షీరాభిషేకం చేశారు. అనంతరం విగ్రహంపై మళ్లీ ముసుగు వేశారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నాయకులు.. తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



సన్నధాన్యం అవుట్ టర్న్‌పై తేల్చండి

రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్

హైదరాబాద్, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): సన్నధాన్యంలో బియ్యం అవుట్ టర్న్ రేషియోను తేల్చాలని రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అవుట్ టర్న్ తేల్చకుండా ముందుకెళ్తే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించింది. సోమవారం హైదరాబాద్ నగర శివారులో గణపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశంలో పలు కీలక తీర్మానాలు చేశారు. వానకాలం ధాన్యంలో అవుట్ టర్న్ రేషియోను తేల్చిన తర్వాతే ధాన్యం దించాలని, ఇందుకోసం టెస్ట్ మిల్లింగ్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. టెస్ట్ మిల్లింగ్‌లో ఎంత శాతం బియ్యం వస్తే అంత ఇస్తామని స్పష్టంచేశారు. ఇప్పటికే వానకాలం ధాన్యం దించుకోబోమని మిల్లర్లు కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చారు. రా రైస్ మిల్లర్లు సైతం అదే బాటలో నడుస్తున్నారు.

కొండా అనుచరుల దౌర్జన్యకాండ

- తెలంగాణ భవన్ వద్ద హంగామా
- కేసీఆర్ దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- నిలువరించిన గులాబీ శ్రేణులు
- ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు
- మంత్రి సురేఖపై అనుచిత పోస్టులు
- దుష్ప్రచారంపై కఠిన చర్యలు : మంత్రి సురేఖ
- వికృత చేష్టలను ఖండిస్తున్నా: హరీశ్‌రావు



తెలంగాణ భవన్ వద్ద సోమవారం దౌర్జన్యానికి దిగిన కొండా అనుచరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అనుచరులు బరితెగించారు. మంత్రిపై సోషల్‌మీడియాలో పెట్టిన అనుచిత పోస్టును బీఆర్ఎస్‌కు ఆపాదిస్తూ తెలంగాణ భవన్‌పై దాడికియత్నించారు. సోమవారం ఆరుగురు వ్యక్తులు నిరసన పేరిట బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం ఎదుట హంగామా చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏకంగా కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించారు. షెడ్యూల్ ప్రకారం కేటీఆర్ ప్రెస్‌మీట్ ఉండడంతో అప్పటికే అక్కడికి భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ భవన్ నుంచి బయటకు వచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తలు వేరేచోట నిరసన తెలుపుకోవచ్చు కదా? ఇక్కడికెందుకు వచ్చారు? అని వారించే ప్రయత్నం చేశారు. మరింత రెచ్చిపోయిన మంత్రి సురేఖ అనుచరులు ఆఫీసులోనికి దూసుకెళ్లేందుకు మెయిన్ గేటు వద్దకు వచ్చారు. బూతులు తిడుతూ బీఆర్ఎస్ నాయకులపై దాడికి యత్నించారు. అప్పటి వరకు సంయమనం పాటించిన బీఆర్ఎస్ నాయకులు మంత్రి అనుచరులను అడ్డగించారు. పార్టీ ఆఫీసుపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటినా బీఆర్ఎస్ ఆఫీసు వద్దకు చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు.

అసలేం జరిగిందంటే..

మంత్రి కొండా సురేఖ ఇటీవల మెదక్ పర్యటనకు వెళ్లిన సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు కలిశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మూడు రంగులు గల నూలుతో తయారు చేసిన మాలను మంత్రి మెడలో వేశారు. ఈ ఫొటోను ట్యాగ్ చేస్తూ కొందరు యువకులు సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారు. బీఆర్ఎస్‌కు చెందిన వారే ఇలా దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ ఆక్షేపించారు. సోమవారం గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని, సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

వికృత చేష్టలను ఖండిస్తున్నా: హరీశ్‌రావు

మంత్రి కొండా సురేఖకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నానని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మహిళలను గౌరవించడం మనందరి బాధ్యత అని, వారి పట్ల అగౌరవంగా ప్రవర్తించడాన్ని ఏ ఒక్కరూ సహించరని సోమవారం ఎక్స్‌వేదికగా పేర్కొన్నారు. మంత్రి సురేఖపై సోషల్ మీడియాలో ట్రోలింగ్‌ను బీఆర్ఎస్ పార్టీ అయినా, వ్యక్తిగతంగా తానైనా ఉపేక్షించబోనని స్పష్టం చేశారు. ఇలాంటి వికృత చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

భవన్ ముందు వాళ్లకేం పని



తెలంగాణ భవన్ ఎదుట కాంగ్రెస్ కార్యకర్తలకేం పని. కాంగ్రెస్ నేతలు దిష్టిబొమ్మతో భవన్‌కు రావడం ఏమిటి? సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొడుతూ.. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతున్నారు. యథారాజా తథా ప్రజా అన్నట్టు రేవంత్‌లాగే కాంగ్రెస్ కార్యకర్తలు అసభ్య భాషవాడుతున్నారు.

- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

• మంత్రి ఉత్తమ్‌కు కేటీఆర్ పరామర్శ



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పరామర్శించారు. సోమవారం కొండాపూర్‌లోని మంత్రి నివాసానికి వెళ్లి, ఇటీవల చనిపోయిన ఉత్తమ్ తండ్రి పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, కార్తీక్‌రెడ్డి, విజయ్‌కుమార్ ఉన్నారు.

ప్రభుత్వం సిగ్గుపడాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఆసరా పింఛన్లను విరాళంగా ఇచ్చి రోడ్లు వేయించుకోవాల్సిన పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నదని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సిగ్గుపడాలని కేటీఆర్ దుయ్యబట్టారు. వృద్ధులు దాతలుగా మారి సహాయం చేస్తే తప్ప రోడ్లు వేయలేని పరిస్థితి ఉంటే మీ పాలన ఎందుకు? అని ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై మండిపడ్డారు. కేసీఆర్ ఇచ్చిన ఆసరా పింఛన్లు అవ్వ, తాతలకే కాదు చివరకు గ్రామ పనులకు కూడా ఆసరా అవుతున్నాయని పేర్కొన్నారు. రోడ్లు వేయడానికి కూడా ప్రభుత్వం దగ్గర నిధులు లేవా? అని ప్రశ్నించారు. మాజీ సర్పంచుల సంగతి సరే చివరకు పంచాయతీ కార్యదర్శులు కూడా అప్పులపాలు కావల్సిందేనా? అని ప్రశ్నించారు.



దాస్యం వినయ్‌భాస్కర్‌ను అరెస్టు చేస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

అక్రమంగా వినయ్‌భాస్కర్ అరెస్ట్

- హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. ప్రతీకార పాలన
- మాపై దాడి చేసి మాపైనే కేసులా?: దాస్యం వినయ్

హనుమకొండ, సెప్టెంబర్ 30: బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్‌ను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యే సవాల్‌ను స్వీకరించి హనుమకొండ నయీంనగర్ నాలా అభివృద్ధి పనులను బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులతో కలిసి శాంతియుతంగా పరిశీలిస్తుండగా.. కాంగ్రెస్ శ్రేణులు ఒక్కసారిగా 'జై నాయిని రాజేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డికి అడ్డేవడు' అంటూ నినాదాలు చేస్తూ.. బీఆర్ఎస్ శ్రేణుల వైపు దూసుకురావడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌తోపాటు పార్టీ కార్యకర్తలపై జులుం ప్రదర్శించారు. కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాన్ని వ్యతిరేకిస్తూ దాస్యం అక్కడే నిరసన తెలుపగా.. పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి సొంత పూచీకత్తుపై వదిలారు. తన 30 ఏండ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి గూండాల సంస్కృతిని ఎన్నడూ చూడలేదని, తెలంగాణలో కాంగ్రెస్ సర్కారుది ప్రజా పాలన కాదని, ప్రతీకార పాలనని దాస్యం ధ్వజమెత్తారు. పాలన చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని విమర్శించారు. తమపై దాడి చేసిన వారిని వదిలిపెట్టి పోలీసులు తమనే అక్రమంగా అరెస్ట్ చేయడం శోచనీయమని పేర్కొన్నారు. దమ్ముంటే పెద్దమ్మగడ్డ శ్మశానవాటిక గోడ కూల్చిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించి, వెంటనే కూల్చిన గోడను నిర్మించి దళితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ నాయకులపై దాడిని ఖండిస్తున్నా: రాకేశ్‌రెడ్డి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సవాలును స్వీకరిస్తూ.. హనుమకొండలోని నయీంనగర్ బ్రిడ్జిని పరిశీలించేందుకు దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో వెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి తెలిపారు. ప్రశాంతంగా ఉన్న హనుమకొండలో స్వయంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డినే అత్యుత్సాహం ప్రదర్శిస్తూ శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్నారని ఆరోపించారు. 9 నెలల కాంగ్రెస్ పాలనలో 2 నెలలు ఎన్నికల కోడ్‌కే పోయిందని, అప్పుడే ప్రపోజల్, టెండర్లు, నిధుల మంజూరు పనులు పూర్తి అయ్యాయా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన నిధులతో మాత్రమే ఎమ్మెల్యే తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాడని, ఒకసారి నిధులు మంజూరయ్యాక ఆ స్థానంలో ఎవరున్నా పనులు పూర్తిచేస్తారని తెలిపారు.

ఎంపీ అనిల్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ఎక్స్ నుంచి ఆ వ్యాఖ్యలను తొలగించాలి
- లేకుంటే పరువునష్టం దావా వేస్తా
- కాంగ్రెస్ ఎంపీకి హరీశ్‌రావు లీగల్ నోటీస్
- వ్యక్తిగత దాడుల్లో భాగమే:కార్తీక్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఆనంద కన్వెన్షన్‌లో తనకు వాటాలున్నాయంటూ కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ చేసిన ఆరోపణలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికి గోబెల్స్ ప్రచారాలను ఆశ్రయిస్తున్న తీరుపై ఆయన మండిపడ్డారు. ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో గోల్కొండకోట, చార్మినార్‌లోనూ హరీశ్‌కు వాటాలున్నాయని అంటారేమోనని అసహనం వ్యక్తం చేశారు. అసత్య ఆరోపణలు చేసిన అనిల్‌కుమార్ యాదవ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని, నిరాధారమైన ఆ వ్యాఖ్యలను సామాజిక మాధ్యం ఎక్స్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు హరీశ్‌రావు కాంగ్రెస్ ఎంపీకి లీగల్ నోటీస్ పంపించారు. అనిల్‌కుమార్ బహిరంగ క్షమాపణ చెప్పకపోతే ఆయనపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. హిమాయత్ సాగర్ ఎఫ్‌టీఎల్ భూముల్లో అక్రమంగా నిర్మించిన ఆనంద కన్వెన్షన్‌లో హరీశ్‌రావుకు వాటాలున్నాయంటూ ఎక్స్ వేదికగా ఎంపీ అనిల్ ఆరోపించారు. అక్రమ ఆస్తులను కాపాడుకొనేందుకు సామాన్యులను అడ్డుపెట్టుకుంటున్నారంటూ మరో వ్యాఖ్యను జోడించారు. దీనిపై హరీశ్‌రావు లీగల్ నోటీస్ ద్వారా స్పందించారు.

కాంగ్రెస్ నేతలు పిచ్చివేషాలు మానుకోవాలి : కార్తీక్‌రెడ్డి

ప్రతిపక్ష పార్టీగా ప్రజల తరఫున పోరాడుతున్న బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ వ్యక్తిగతంగా దాడులు చేస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పీ కార్తీక్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో సోమవారం మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆనంద కన్వెన్షన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు భాగస్వామి అని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ సోషల్‌మీడియాలో పెట్టిన పోస్టులను ఆయన తప్పుపట్టారు. ఇది కాంగ్రెస్ వ్యక్తిగత దాడుల్లో భాగమేనని విమర్శించారు. ఆనంద కన్వెన్షన్‌తో హరీశ్‌రావుకు సంబంధంలేదని స్పష్టం చేశారు. ఆనంద కన్వెన్షన్‌ను కూలగొడితే అక్కడ జేసీబీకి ముందు కొబ్బరికాయ కొట్టేది తామేనని తెలిపారు. కాంగ్రెస్ నేతలు పిచ్చివేషాలు మానుకోవాలని హితవు పలికారు. హైడ్రాపై హైకోర్టు అక్షింతలు వేసిందని, ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకోవాలని సూచించారు.

ఎంపీ అనిల్‌వి పిల్లచేష్టలు: దాసోజు శ్రవణ్

పార్లమెంట్ సభ్యుడు అయినా అనిల్‌కుమార్‌కు ఇంకా పిల్లాడి చేష్టలు పోలేదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో ఆయన మాజీ మంత్రి హరీశ్‌రావుపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

1962 సేవలపై సర్కార్ నిర్లక్ష్యం

మాజీ మంత్రి హరీశ్ ఫైర్


హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : మూగజీవాల వద్దకే వైద్య సిబ్బంది వచ్చి తక్షణ చికిత్స అందించేందుకు కేసీఆర్ ప్రారంభించిన 1962 -సంచార పశు వైద్య వాహన సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం శోచనీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ ప్రశంసలు సైతం పొంది దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన గొప్ప కార్యక్రమాన్ని గాలికి వదిలేసి మూగజీవుల రోదనకు కాంగ్రెస్ ప్రభుత్వం కారణమవుతున్నదని విమర్శించారు. ఓ వైపు వాహనాల్లో మందుల కొరత కారణంగా అత్యవసర పరిస్థితుల్లో మూగజీవుల ప్రాణాలు కాపాడాలనే సదాశయం నీరుగారిపోతున్నదని, మరోవైపు వాహన డ్రైవర్, డాక్టర్, ఇతర సిబ్బందికి వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కుటుంబ పోషణ భారంగా మారి ఆవేదన చెందుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి 1962 వాహనాల్లో మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని, సిబ్బందికి ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

10లోపు సంపూర్ణ రుణమాఫీ చేయాలి

- లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తాం
- మాజీ ఎమ్మెల్యే సురేందర్

గాంధారి, సెప్టెంబర్ 30: రైతులకు రుణమాఫీతోపాటు ఇతర హామీలను అక్టోబర్ 10లోగా నెరవేర్చకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని మాజీ ఎమ్మెల్యే సురేందర్ హెచ్చరించారు. కామారెడ్డి జిల్లా గాంధారిలో కామారెడ్డి-బాన్సువాడ ప్రధాన రహదారిపై సోమవారం మహాధర్నా నిర్వహించారు. రెండుగంటలకుపైగా కొనసాగిన ఆందోళనతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచి పోయాయి. కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, రైతులను దారుణంగా మోసం చేసిందని సురేందర్ విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల్సిందేనని రైతులు, అఖిల పక్ష నేతలు డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతుభరోసా ఎకరాకు రూ.15 వేల చొప్పున ఖాతాల్లో జమ చేయాలని కోరారు.

• రుణమాఫీ చేయని రేవంత్ రాజీనామా చేయాలి



రామన్నపేట, సెప్టెంబర్ 30 : రుణమాఫీతోపాటు ఆరు గ్యారెంటీలను అమలు చేయని సీఎం రేవంత్‌రెడ్డి గన్‌పార్క్ వద్ద ముక్కు నేలకు రాసి పదవికి రాజీనామా చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రైతు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 9న రూ.2 లక్షల పంట రుణాలను మాఫీ చేస్తానని ప్రగల్భాలు పలికి తొమ్మిది నెలలు గడిచినా మాఫీ చేయకుండా రైతులను మోసగిస్తున్నారని విమర్శించారు.

• రుణమాఫీ కోసం రైతుల ధర్నా



రుణమాఫీ చేయాలని సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి సొసైటీ కార్యాలయం ఎదుట రైతులు రాస్తారోకో చేపట్టారు. అంతకు ముందు సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు అధ్యక్షతన సొసైటీ కార్యాలయంలో జరిగిన మహాజన సభను అడ్డుకొని నిరసన తెలిపారు. పెంట్లవెల్లి సొసైటీ 499 మంది రైతులు రుణం తీసుకుంటే ఒక్కరికీ పైసా మాఫీ కాలేదని అన్నారు. -పెంట్లవెల్లి

రబీ వచ్చినా రైతుభరోసాఏదీ?

- వానకాలం ముగిసినా అందని పెట్టుబడి సాయం
- కమిటీలు, అభిప్రాయ సేకరణ పేరుతో హంగామా
- ఎన్నికలకు ముందు పెంచి ఇస్తామని పోజులు
- ఉన్నది ఊడగొతున్నారని రైతుల ఆగ్రహం
- 11 సీజన్లు నిర్విరామంగా ఇచ్చిన కేసీఆర్ సర్కారు
- రెండు సీజన్లకే కాంగ్రెస్ సర్కారు ఆపసోపాలు



రుణమాఫీ చేసి రైతుభరోసా అందించాలని సోమవారం వనపర్తి జిల్లా పెబ్బేరులో ఆందోళన చేస్తున్న రైతులు

హైదరాబాద్, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): వ్యవసాయ శాఖ నిబంధనల ప్రకారం వానకాలం పంటల సాగు సీజన్ సోమవారంతో ముగిసింది. మంగళవారం నుంచి యాసంగి (రబీ) సీజన్ ప్రారంభమవుతున్నది. అయినప్పటికీ రైతులకు 'రైతు భరోసా' పెట్టుబడి సాయం పంపిణీ చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. సీజన్ ముగిసినా రైతుభరోసా రాకపోవడంతో రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. ఎన్నికలకు ముందు రైతుభరోసాను పెంచి ఇస్తామని హామీలు గుప్పించి ఇప్పుడు ఉన్నది కాస్త ఊడగొడుతున్నారని రైతులు మండిపడుతున్నారు.

పెంచి ఇస్తామని పోజులు

'రైతుబంధు కింద కేసీఆర్ ఏటా 10వేలే ఇస్తున్నాడు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు భరోసా పేరుతో 15వేలు ఇస్తాం. కౌలు రైతులకు కూడా ఎకరాకు 15వేలు ఇస్తాం. రైతు కూలీలకు రూ. 12వేలు ఇస్తాం' అని అసెంబ్లీ ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు. కానీ రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక రైతుభరోసా సంగతి దేవుడెరుగు ఉన్న రైతుబంధును కూడా ఇవ్వడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత యాసంగి, వానకాలం రెండు సీజన్లు పూర్తయ్యాయి. యాసంగి కోతల సమయంలో పాత పెట్టుబడిసాయం అందించి.. ప్రభుత్వం ఇప్పుడే వచ్చిందని, వానకాలం నుంచి అమలు చేస్తామని ప్రకటించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ మాట కూడా తప్పింది. ఇప్పటి వరకు పాత రైతుబంధు ఇవ్వలేదు... కొత్త రైతుభరోసా ఇవ్వలేదు. దీంతో రైతుల్లోనూ తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. చేతగానప్పుడు తప్పుడు హామీలు ఇవ్వడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

కమిటీలతో కాలయాపన

'గతంలో రైతుబంధు దుర్వినియోగం అయింది. రైతుభరోసాలో సమూల మార్పులు తీసుకొస్తాం. పంట వేసిన భూమికి, రైతుకు మాత్రమే పెట్టుబడి సాయం పంపిణీ చేస్తాం. ఇందుకోసం రైతులు, మేధావులు అభిప్రాయాల సేకరణకు మంత్రులతో కమిటీ వేస్తున్నాం. ఈ కమిటీ 15 రోజుల్లో నివేదిక ఇవ్వగానే అసెంబ్లీలో చర్చించి రైతులకు పెట్టుబడి సాయం పంపిణీ చేస్తాం.' ఇది జూలై 2వ తేదీన రైతుభరోసాపై క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు సమయంలో ప్రభుత్వం చేసిన ప్రకటన. ప్రభుత్వం చెప్పిన గడువు దాటి రెండు నెలలు పూర్తయింది. ఇప్పటి వరకు మంత్రుల కమిటీ నివేదిక ఇచ్చింది లేదు... అసెంబ్లీలో చర్చించిందీ లేదు.. రైతులకు రైతుభరోసా పంపిణీ చేసింది లేదు. కమిటీ ఏర్పాటు తర్వాత వారం రోజుల పాటు పలు జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి భారీ హడావిడి చేశారు. రైతులను మభ్యపెట్టేందుకు, కాలయాపన చేసేందుకే ప్రభుత్వం కమిటీ ఏర్పాటు, అభిప్రాయ సేకరణ పేరుతో డ్రామా ఆడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


కేసీఆర్ నిర్విరామంగా

రైతులకు పెట్టుబడి గోసను తీర్చాలనే సంకల్పంతో నాటి సీఎం కేసీఆర్ రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద ఎకరానికి ఏటా రూ. 10 వేల పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేశారు. ఈ విధంగా ప్రతి సీజన్‌లో సుమారు 65-70 లక్షల మంది రైతులకు రూ.7500కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసేవారు. ఇలా పదకొండు విడతల్లో ఏకంగా రూ. 73వేల కోట్లను రైతులకు పెట్టుబడి సాయంగా అందించిన ఘనత కేసీఆర్ సర్కారు దక్కించుకున్నది. సుమారు ఐదున్నరేండ్లలో ఏ సీజన్‌లోనూ రైతులు రైతు బంధు కోసం ఇంతలా ఎదురు చూసే పరిస్థితి రాలేదు. చివరికి కరోనా కాలంలోనూ రైతులకు కేసీఆర్ సర్కారు టంచనుగా పెట్టుబడి సాయాన్ని అందించింది.

భరోసా లేనట్టే..

వానకాలం సీజన్ పూర్తి కావడంతో రైతు భరోసా పెట్టుబడిసాయం పంపిణీపై రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు కొత్త నిబంధనలు రూపొందించి, సర్వే చేసి, సాగు చేసే భూముల వివరాలు, రైతుల వివరాలు సేకరించి రైతుభరోసా ఇవ్వడం సాధ్యమయ్యే పని కాదని రైతులే తేల్చిచెబుతున్నారు. జూన్‌లో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం అక్టోబర్ వచ్చినా ఇవ్వకపోవడంతో ఈ సీజన్ రైతుభరోసాకు ప్రభుత్వం రాం రాం పలికినట్టేననే అభిప్రాయాలను రైతులు వ్యక్తంచేస్తున్నారు.


రైతుబంధు ఊసే లేదు



కాంగ్రెస్ వచ్చాక రైతుబంధు ఊసే లేదు. వానకాలం పంటల సాగు చేపట్టి నాలుగు నెలలు పూర్తయినా ఒక్క రూపాయి కూడా పడలేదు. కేసీఆర్ ఉన్నప్పుడు రైతుబంధు డబ్బులు కచ్చితంగా పడ్డాయి. మరి ఇప్పుడు ఎందుకు వేయట్లేదో ప్రభుత్వం చెప్పాలి.

- గోవర్ధన్, కొణిజర్ల, ఖమ్మం జిల్లా


30 వేలు అప్పు తెచ్చిన



కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.15 వేలు ఇస్తే.. నేను రూ.30 వేలు అప్పు చేయాల్సిన పరిస్థితి వచ్చేది కాదు. కేసీఆర్ ఉండగా ఏనాడూ అప్పు తెచ్చుకోలేదు. ఇప్పుడు మళ్లీ అప్పు కోసం షావుకారు దగ్గరకు పోవాల్సి వస్తోంది.

- భాస్కర్‌రావు, ఎం.వెంకటాయపాలెం, ఖమ్మం జిల్లా

రైతులను ఇబ్బంది పెట్టొద్దు..



ప్రజా ప్రభుత్వమని చెప్పే సీఎం రేవంత్ రెడ్డి రైతులను ఇబ్బందులు పెట్టడం సరికాదు. వానకాలం సీజన్ పూర్తయినా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు వేయలేదు. కేసీఆర్ ఉన్నప్పుడు వానకాలం మొదట్లోనే రైతుబంధు పడేది.

- బొడ్డు నర్సయ్య, చినబండిరేవు, భద్రాద్రి జిల్లా

సొంతవారే కొంపముంచారా?

- పొంగులేటికి కాంగ్రెస్‌లోనే ఇంటిపోరు
- మరో ఏక్‌నాథ్ షిండే కావొచ్చని అనుమానమా
- ఆయనంటే ముఖ్యనేతకు, అనుచరులకు కంటగింపు
- అందులో భాగమే ఈడీ దాడులంటున్న పొంగులేటి అనుచరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎవరికి టార్గెట్ అయ్యారు? రోజురోజుకు రాష్ట్రంలో కీలక నేతగా ఎదుగుతున్న ఆయన ఎవరికి కంటగింపుగా మారారు? చోటా భాయ్‌కా? లేక బడే భాయ్‌కా? సీనియర్ పెద్దలకా? ఈడీ కొరడా విసరడం వెనుక ఏ రాడార్ పనిచేసింది? గాంధీభవన్ పరిసరాల్లో ఏ ఇద్దరు నేతలు కలిసినా ఇదే అంశం మీద చర్చ జరుగుతున్నది. పదేండ్ల స్వల్పకాలంలోనే కీలక ఆర్థిక, రాజకీయ శక్తిగా ఎదిగిన పొంగులేటి మెల్లమెల్లగా సొంత ఎమ్మెల్యేల బలం పెంచుకుంటున్నారని, కర్ణాటకలో డీకే శివకుమార్ తరహాలో మారుతున్నారని గత ఐదారు నెలలుగా కాంగ్రెస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇప్పటికిప్పుడు ఆయన బలప్రదర్శన చేస్తే.. 25 మంది ఎమ్మెల్యేలు ఆయన వెనుకే ఉంటారని అంచనా వేస్తున్నారు. మరోవైపు ఇప్పుడున్న ముఖ్యనేతలను అధిష్ఠానం పూర్తి స్థాయిలో నమ్మటం లేదట. ఢిల్లీ అవసరాలకు తగ్గట్టుగా కప్పం కట్టలేక ఎప్పుడు కొప్పు ఎత్తేస్తారో అనే అనుమానంతోనే ఉందట. ఆ ముఖ్యనేత వ్యవహారశైలి బడేభాయ్‌కి కొంత దగ్గరగా మసిలినట్టు ఉండటం, బీజేపీ స్థానిక నేతలు రాష్ట్ర ప్రభుత్వంతో అంటకాగినట్టు ఉండటం కూడా అధిష్ఠానాన్ని అసౌకర్యానికి గురి చెస్తున్నట్టు గాంధీ భవన్ వర్గాలు చెప్తున్నాయి. కాంగ్రెస్ అంటేనే ముఖ్యమంత్రుల మార్పుకు బ్రాండ్ అంబాసిడర్ పార్టీ. ఎప్పుడు ఎవరని మారుస్తారో తెలియదు. ఈ నేపథ్యంలోనే ఏదైనా జరగరానిది జరిగితే.. పొంగులేటి ముందు వరుసలో ఉంటాడని, లేదంటే మరో ఏక్‌నాథ్‌షిండేగా మారవచ్చని తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఆందోళనతో ఉన్నట్టు సమాచారం.



సీనియర్లకూ కంటగింపే

బయటికి రాసుకొని పూసుకొని తిరుగుతున్నారు కానీ 'ముఖ్య'నేతతోపాటు సీనియర్ నాయకులు కూడా పొంగులేటి అంటే కంటగింపుగానే ఉన్నారని నాయకుడు ఒకరు చెప్పారు. పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కాంట్రాక్టు పనులు తీసుకుంది. ఈ పనులకు సంబంధించిన బ్యాంకు ష్యూరిటీలను కరేబియన్‌కు చెందిన ఎగ్జిమ్ బ్యాంకు నుంచి తీసుకొచ్చారు. ఈ ష్యూరిటీని అప్పుడున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆమోదించింది. ఆ తరువాత వచ్చిన చంద్రబాబునాయుడు ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయగా.. దాన్ని ఆంధ్రాలో టీడీపీకి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉండే మీడియా సంస్థ హైలైట్ చేసింది. అది మొదలు వరుసగా లగ్జరీ రిస్టు వాచ్‌లు, హిమాయత్‌సాగర్‌లో ఆయన ఇంటిమీద ఆరోపణలు, ఈడీ దాడుల వ్యవహారాల పరంపర కొనసాగింది. ఇవి ఏవి కూడా పొంగులేటి పార్టీని అడ్డంపెట్టుకొని చెసుకున్న పనులు కావని, అయినప్పటికీ అధిష్ఠానానికి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చిందని ఆయన వర్గీయులు అంటున్నారు. సొంత పార్టీలోని 'ముఖ్య' నేతలే పక్కా పథకంతో ఇరికించారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏపీలోనూ 'పొంగులేటి' దుమారం

- అనుభవం లేకున్నా 270 కోట్ల డ్రెడ్జింగ్ కాంట్రాక్టు
- పనులు చేయకుండానే బిల్లులు పొందినట్టు ఆరోపణలు
- ఇసుక ఏదంటే ఎత్తుకు పోయారంటున్న 'రాఘవ' కంపెనీ
- కంపెనీకి నోటీసులు.. విచారణకు సిద్ధమైన అధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఇప్పుడు ఏపీ రాజకీయాల్లోనూ దుమారం రేపుతున్నది. గోదావరిలో కాటన్ బ్యారేజీ వద్ద పేరుకుపోయిన ఇసుకను డ్రెడ్జింగ్ ద్వారా తొలగించే రూ.270 కోట్ల విలువైన టెండర్‌ను అడ్డదారిలో దక్కించుకుందని, పనులేవీ చేయకుండానే బిల్లులు స్వాహా చేసిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కంపెనీపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఏపీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రూ.270 కోట్ల టెండర్

ధవళేశ్వరం కాటన్ బరాజ్ లోపల రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లకు మధ్య



గోదావరిలో చాలా కాలంగా ఇసుక మేటలు పెరిగిపోయాయి. దీంతో డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక మేటలు తొలగించాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు మూడేండ్ల కింద రూ.270 కోట్ల అంచనాతో రాఘవ కన్‌స్ట్రక్షన్ టెండర్ దక్కించుకున్నది. అయితే అడ్డదారిలోనే ఆ టెండర్ దక్కిందని తాజాగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్‌లో 3 కంపెనీలు పోటీపడినా డ్రెడ్జింగ్‌లో ఎలాంటి అనుభవం లేని రాఘవ కంపెనీకి కాంట్రాక్టు ఇవ్వడంపై గతంలోనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. టెండర్‌ను దక్కించుకునేందుకు సదరు కంపెనీ కొందరితో లోపాయికారి ఒప్పందం చేసుకుని, తమకు వ్యతిరేకంగా ఉన్న పలువురు ఇంజినీర్లను అక్కడి నుంచి బదిలీ చేయించిందని, ఆ తరువాత అనుకూలంగా ఉన్న వారిని నియమించుకుందని సాగునీటి ఇంజినీర్లు, అక్కడి బోట్స్‌మెన్ సొసైటీలు బాహాటంగా ఆరోపిస్తున్నాయి.

పనులేవీ చేయకుండానే బిల్లులు..

టెండర్ దక్కించుకున్న రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఏపీలో ప్రభుత్వం మారే సమయానికి దాదాపు రూ.50 కోట్ల విలువైన పనులు చేసినట్టు బిల్లులు పెట్టుకుంది. అయితే అక్కడ డ్రెడ్జింగ్ చేసిన సూచనలేమీ లేవని క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన అధికారులే స్వయంగా వెల్లడిస్తున్నారు. డ్రెడ్జింగ్ చేసిన ఇసుక ఏదని అడిగితే పక్కన గుట్టలుగా పోస్తే ఎత్తుకుపోయారని సమాధానం చెబుతున్నదని అధికారులు వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ వ్యవహారంలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ నిర్వాకంతో ఉన్నతాధికారులు వరుసగా నోటీసులు సైతం జారీ చేశారు. ఎలాంటి డ్రెడ్జింగ్ చేయలేదని బరాజ్ నిర్వహణ చూస్తేనే తెలిసిపోతున్నదని ఇంజినీర్లు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో పొంగులేటి కంపెనీపై విచారణకు సిద్ధమైనట్టు వెల్లడించారు.

ఏడాది భారత్‌లో.. మరో ఏడాది యూఎస్‌లో

- నోట్రీడ్యామే డీ న్యామర్ యూనివర్సిటీ డీన్ జాన్ విట్చ్ వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): అమెరికాలో మూడేండ్ల వర్క్ పర్మిట్ లభించే ట్విన్నింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు ఆశావాహుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నోట్రీడ్యామే డీ న్యామర్ యూనివర్సిటీ డీన్ జాన్ విట్చ్, ఎడ్యు టూ టెక్ సంస్థ సీఈవో హరికాంత్ తెలిపారు. ఇందులో చేరిన వారు ఎంబీఏను ఒక ఏడాది భారత్‌లో, మరో ఏడాది యూఎస్‌లో చదవొచ్చని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌కు వచ్చిన జాన్ విట్చ్ మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటికే ఎంబీఏలో మొదటి సంవత్సరం పూర్తిచేసిన వారు ట్విన్నింగ్ ప్రోగ్రాంలో చేరవచ్చని సూచించారు. బీకాం, బీబీఏ విద్యార్థులు రెండేండ్లు ఇండియాలో, చివరి సంవత్సరం ఎన్‌డీఎన్‌యూ వర్సిటీలో చదవొచ్చని తెలిపారు. అక్టోబర్ 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 99597 42565 నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఈడీ నివేదిక ఆలస్యమెందుకో?

- సోదాలు జరిగి ఐదురోజులైనా వివరాలు వెల్లడించని ఈడీ
- తనిఖీలపై ఇంతవరకు నోరు మెదపని పొంగులేటి
- నాటకీయ పరిణామాలపై సర్వత్రా ఉత్కంఠ

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇండ్లు, కార్యాలయాల్లో రెండురోజులపాటు సోదాలు నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఇంతవరకు దానిపై ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఏం జరిగింది? ఎంత నగదు దొరికింది? ఏవేం డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు? క్రిప్టో ఖాతాల వివరాలు ఏంటి? అనే విషయాలు సోమవారం కూడా వెల్లడి కాలేదు. రెండ్రోజుల సోదాల్లో కొన్ని కోట్ల రూపాయల నగదు దొరికిందని, ఇతర అక్రమ లావాదేవీల వివరాలు తెలిశాయని పలువురు అంటున్నా.. ఈడీ అధికారులు మాత్రం వాటిపై స్పష్టతనివ్వకపోవడం సర్వత్రా ఆసక్తిగా మారింది. సోదాలపై అధికారిక ప్రకటన లేకపోవడంతో ఏమైనా రాజకీయ కోణం ఉందా? అనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

వివరాలు వెల్లడించని పొంగులేటి..

గతంలో తన ఇండ్లు, ఆఫీసుల్లో ఎప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్థల సోదాలు జరిగినా.. అదే రోజు ఏం జరిగిందో? ఎందుకు సోదాలు చేశారో? పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించేవారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అతని ఇండ్లు, ఆఫీసుల్లో జరిగిన మొదటి సోదాలు కావడం, భారీగా డబ్బులు దొరికాయనే వార్తలు వెలువడటం, ఈడీ నుంచి అధికారిక ప్రకటన ఏమీ లేకపోవడంతో ఆయన కూడా మీడియా సమావేశం పెట్టేందుకు వెనక్కి తగ్గారని చర్చించుకుంటున్నారు. 'ఏం జరిగింది అన్నా' అని కొందరు అంటే.. 'ఏం జరుగుతుందో చూడాలి అన్నా' అంటూ దాటవేస్తున్నారని సన్నిహితులు చెప్తున్నారు. ఇంకా వివరాలు వెల్లడి కాకపోవడం పట్ల.. 'రాత్రికి రాత్రే ఎవరు చక్రం తిప్పారు' అంటూ మరికొందరు మాట్లాడుకుంటున్నారు.

ఈడీ సోదాలన్నీ హైడ్రామానా?

తెలంగాణలో శుక్ర, శనివారాల్లో ఢిల్లీ ఈడీ అధికారులు జరిపిన సోదాల్లో మూడు కౌంటింగ్ మెషీన్లతో లెక్కపెట్టేంత డబ్బు దొరికినా కూడా.. లెక్క బయటికి రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. జూబ్లీహిల్స్, హిమాయత్‌సాగర్‌లలో ఈడీ సోదాలు జరిగాయి. సోదాల మధ్యలో అధికారులు బయటికి వెళ్తూ.. డబ్బులు లెక్కపెట్టే కౌంటింగ్ మెషీన్లు తెస్తూ.. నానా హంగామా చేశారు. సోదాలు చేపట్టి ఐదు రోజులు అయినా కూడా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. మరోవైపు బంజారాహిల్స్‌లోని ఓ కార్యాలయంలో 'సీపీయూలు, హార్డ్‌డిస్క్‌లు, ఇతర కీలక పత్రాల తరలింపు'పై సైతం ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిసింది. దీంతో అసలేం జరుగుతోంది? అనే అనుమానాలు, ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

బర్రె హెల్త్‌సర్టిఫికెట్‌కూ లంచం

పశువైద్యాధికారిని పట్టుకున్న ఏసీబీ అధికారులు

మాల్, సెప్టెంబర్ 30 : సర్టిఫికెట్ జారీ చేసేందుకు పాడి రైతు వద్ద లంచం తీసుకుంటూ నల్లగొండ జిల్లాలో ఓ పశువైద్యాధికారి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌చంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలం నసర్లపల్లికి చెందిన పాడి రైతు బర్రెలపై రూ.10 లక్షల బ్యాంకు లోన్ తీసుకునేందుకు వీలుగా సదరు బర్రెలకు సంబంధించిన హెల్త్ సర్టిఫికెట్ జారీ కోసం పశువైద్యాధికారి జీజే పాల్‌ను సంప్రదించాడు. సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.8 వేలు లంచం డిమాండ్ చేయగా, రూ.6 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ మేరకు రైతు సోమవారం పశువైద్యాధికారికి అతడి కార్యాలయంలో రూ.6 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పశువైద్యాధికారిని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్‌లోని అతడి ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు.



ఏసీబీ అధికారులకు పట్టుబడిన పశువైద్యాధికారి జీజే పాల్

ఆ పిల్‌పై విచారణ వాయిదా వేయండి

- దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో పోలీసుల విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): జస్టిస్ సిర్పూర్కర్ కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సింగిల్ జడ్జి తీర్పు వెలువడే వరకు దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసు విచారణను వాయిదా వేయాలని పోలీసులు హైకోర్టును కోరారు. దీంతో మధ్యంతర పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు పిటిషనర్లను ఆదేశించింది. దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసును సీబీఐకి అప్పగించాలన్న ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది ఆర్‌ఎన్ హేమేంద్రనాథ్ రెడ్డి వాదిస్తూ.. జస్టిస్ సిర్పూర్కర్ కమిషన్ నివేదికకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లు సింగిల్ జడ్జి పరిశీలనలో ఉన్నాయని, వాటిని సింగిల్ జడ్జి అనుమతిస్తే సిర్పూర్కర్ కమిషన్ నివేదిక ఉనికిలో ఉండదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సింగిల్ జడ్జి తీర్పు వచ్చే వరకు దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసును సీబీఐకి అప్పగించాలన్న పిల్‌పై విచారణ వాయిదా వేయాలని కోరారు. దీనిపై కౌంటర్ దాఖలు చేస్తామని పిటిషనర్ల తరఫు న్యాయవాది వసుధానాగరాజ్ తెలియజేయడంతో.. తదుపరి విచారణను దసరా సెలవుల తర్వాత చేపడతామని హైకోర్టు ప్రకటించింది.

23వ సారి ఢిల్లీకి సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి...

హైడ్రా కూల్చివేతలు, మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్టు వార్తలొస్తున్న నేపథ్యంలో అధిష్ఠానం సీరియస్‌గా ఉన్నదని, వారికి వివరణ ఇచ్చేందుకే సీఎం ఢిల్లీ వెళ్లారన్న చర్చ జరుగుతున్నది. దీంతోపాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఈడీ దాడుల గురించి కూడా అధిష్ఠానం పెద్దలకు వివరించే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. దసరాలోపు మంత్రివర్గాన్ని విస్తరించే దిశగా అధిష్ఠానంతో సంప్రదింపులు జరిపే అవకాశం ఉన్నట్టు పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత హస్తినకు వెళ్లడం ఇది 23వ సారి.

26వేల స్కూళ్లల్లో అరకొరగా వసతులు

- గురుకులాల స్థానంలోనే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- ఫీజుల నియంత్రణకు కమిటీ: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): 26వేల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు తక్కువగా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాము అన్ని స్కూళ్లల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం సచివాలయం లో డీఎస్సీ-2024 ఫలితాలను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే డీఎస్సీని నిర్వహించడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పుడున్న గురుకులాలను ఒకే ప్రాంగణంలోకి చేర్చి 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. నియోజకవర్గంలోనే 20-25 ఎకరాల్లో రూ. 100-125 కోట్లను వెచ్చించి భవనాలను నిర్మించి వసతులు కల్పిస్తామని వెల్లడించారు. డీఎస్సీ పరీక్షలు ముగిసిన 55 రోజుల్లోనే ఫలితాలు విడుదల చేశామని, 1: 3 నిష్పత్తిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని వెల్లడించారు. అక్టోబర్ 9న ఎల్బీస్టేడియంలో నియామక పత్రాలను అందజేస్తామని పేర్కొన్నారు. ఫీజుల నియంత్రణకు కమిటీ వేస్తామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

238 ప్రాంతాల్లో ఎఫ్‌డీసీ సర్వే

- కుటుంబం ఫొటో దిగడం ఆప్షన్ మాత్రమే
- ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఫ్యామిలీ డిజిటల్ కార్డుల (ఎఫ్‌డీసీ) జారీకి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 238 ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. 119 నియోజకవర్గాల్లో ఈ నెల 3వ తేదీ నుంచి ఐదు రోజులపాటు సర్వే చేయాలని ఆదేశించారు. ఎఫ్‌డీసీ అం శంపై సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టు కోసం ప్రతి నియోజకవర్గం నుంచి ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఒకవేళ పూర్తిగా పట్టణ/నగర నియోజకవర్గమైతే రెండు వార్డు లు/డివిజన్లు, పూర్తిగా గ్రామీణ నియోజకవర్గమైతే రెండు గ్రామాల్లో సర్వే చేయాలని, మొత్తంగా 238 ప్రాంతాల్లో సర్వే సమర్థం గా నిర్వహించాలని ఆదేశించారు. కుటుంబసభ్యులు అందరూ సమ్మతిస్తేనే కుటుంబం ఫొటో తీయాలని, లేకుంటే ఫొటో తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ఉమ్మడి జిల్లాలకు ఉన్న నోడల్ అధికారులు కలెక్టర్లకు మార్గనిర్దేశం చేయాలని, అప్పుడే పకడ్బందీగా కార్యక్రమం కొనసాగుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. కుటుంబసభ్యుల వివరాల నమోదు, మార్పులుచేర్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పొరపాట్లకు తావివ్వవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎదురయ్యే సానుకూలతలు, ఇబ్బందులతో నివేదిక తయారుచేయాలని ఆదేశించారు. దానిపై చర్చించిన అనంతరం లోపాలను సవరించి సర్వేకు శ్రీకారం చుట్టాలని సూచించారు.

200 ఏండ్ల చెట్టుకు అంత్యక్రియలు

యూపీలో హిందూ పద్ధతిలో నిర్వహణ

ముజఫర్ నగర్, సెప్టెంబర్ 30: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్‌లో 200 ఏండ్లు గల పెద్ద చెట్టుకు మనుషుల మాదిరి శుక్రవారం అంత్యక్రియలు జరిగాయి. బుధవారం ఈ చెట్టు నేల కూలింది. అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించే శాలు సైని(37) ఈ చెట్టుకు అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మొదటిసారి ఇలా ఒక చెట్టుకు అంత్యక్రియలు నిర్వహించారు. హిందూ మత సంప్రదాయం ప్రకారం చెట్టులోని కొన్ని భాగాలకు ఆమె దహన సంస్కారాలు నిర్వహించారు. 'ముక్తి' లభించడంలో చెట్టుకు సాయపడమని తన అంతరంగం తనకు చెప్పిందని సైని అన్నారు. ఆ చెట్టును మొదటిసారి శుక్రవారమే చూశానని.. కుటుంబంలో పెద్దవారిని కోల్పోయినట్టు అనిపించిందని తెలిపారు.

డీఎస్సీ ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి...

చేశారు. డీఎస్సీకి హాజరైన అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్‌ఎల్)ను జిల్లాలు, పోస్టులవారీగా వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. జూలై 7 నుంచి ఆగస్టు 5 వరకు కం ప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో పరీక్షలను నిర్వహించగా, 2.46 లక్షల మంది హాజరయ్యారు. డీఎస్సీలో వచ్చిన మార్కులకు టెట్ మార్కులను కలిపి జీఆర్‌ఎల్‌ను విడుదల చేశారు.

నేటి నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్


జీఆర్‌ఎల్ విడుదలైన నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ 1:3 చొప్పున అభ్యర్థులను ఎంపికచేస్తుంది. జిల్లాల వారీగా, పోస్టులు, రోస్టర్ వారీగా జాబితాలను జిల్లాలకు పంపిస్తుంది. మొత్తంగా 33 వేల మందిని సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఎంపిక చేస్తారు. వీరికి మంగళవారం నుంచి ఈ నెల 5 వరకు ఆయా జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపడతారు. ఇది ముగిసిన తర్వాత 1:1 చొప్పున అభ్యర్థులను ఎంపికచేసి, ఈ నెల 9 ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలను అందజేస్తారు.

మొరాయించిన వెబ్‌సైట్

డీఎస్సీ ఫలితాల విడుదల తర్వాత డీఎస్సీ వెబ్‌సైట్ మొరాయించింది. అభ్యర్థులంతా ఒకేసారి ఫలితాలు తెలుసుకునేందుకు తాపత్రయపడటంతో వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. సాయంత్రం వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. రాత్రి తర్వాతే ఫలితాలపై అభ్యర్థులకు ఒక స్పష్టతవచ్చింది. విద్యాశాఖ రూపొందించిన రివైజ్డ్ ఫైనల్ కీ' ప్రకారమే డీఎస్సీ ఫలితాలను ప్రకటించారు. గతంలో విడుదలచేసిన ఫైనల్ కీపై అభ్యంతరాలు రావడంతో యూనివర్సిటీ ప్రొఫెసర్లతో పరిశీలన జరిపిన అధికారులు రివైజ్డ్ ఫైనల్ కీని తయారుచేశారు. మొత్తం నాలుగైదు ప్రశ్నలకు సమాధానాలు మారినట్టు అధికారులు తెలిపారు.

డీఎస్సీలో ఆటో డ్రైవర్‌కు జిల్లా ఫస్ట్ ర్యాంకు


నెల్లికుదురు, సెప్టెంబర్ 30: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలో నిరుపేద కుటుంబానికి చెందిన బండారి ఎల్లమ్మ-రామరాజు దంపతుల కుమారుడు నరేశ్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చిన్న వయసులోనే తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ బాధ్యతలు మీదపడ్డాయి. చెల్లి, తమ్ముడికి పెండ్లి చేశాక తాను పెండ్లి చేసుకున్నాడు. తెలంగాణ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ వేయగానే ఎలాంటి కోచింగ్ లేకుండా పట్టుదలతో చదివాడు. 76.67 మార్కులు సాధించి ఎస్‌ఏ తెలుగు సబ్జెక్టులో జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించాడు.



బండారి నరేశ్

డీఎస్సీ లో తండ్రీకొడుకుల సత్తా


మరికల్, సెప్టెంబర్ 30: నారాయణపేట జిల్లా రాకొండకు చెందిన జంపుల గోపాల్ తెలుగు పండిట్ విభాగంలో జిల్లాలో ఫస్ట్ ర్యాంక్, స్కూల్ అసిస్టెంట్ తెలుగులో జిల్లా 3వ ర్యాంకు సాధించాడు. ఆయన పెద్ద కొడుకు భానుప్రకాశ్‌కు గణిత విభాగంలో ఎస్‌ఏగా జిల్లాలో 9వ ర్యాంక్ సాధించాడు. ఇటీవల చిన్న కుమారుడు చంద్రకాంత్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈగా ఉద్యోగం సాధించాడు. గోపాల్ భార్య విజయలక్ష్మి ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేటలోని ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్నారు.



భానుప్రకాశ్, గోపాల్

ఒకే డీఎస్సీలో రెండు కొలువులు

మహదేవపూర్ (కాళేశ్వరం), సెప్టెంబర్ 30: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన గుండోజి నగేశ్ సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ చాటాడు. తెలుగు పండిత్‌లో జిల్లాలో రెండో ర్యాంక్, ఎస్జీటీలో 38వ ర్యాంక్ సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన నగేశ్ తండ్రి బ్రహ్మయ్య కులవృత్తి చేసుకుంటూ నలుగురు పిల్లలను చదివించాడు. నగేశ్ ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివి ఒకేసారి రెండు కొలువులకు ఎంపికయ్యాడు. కన్నవారి కండ్లల్లో ఆనందాన్ని నింపాడు.



గుండోజి నగేశ్

డీఎస్సీ జాబితాలో పలువురి పేర్లు గల్లంతు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): విద్యాశాఖ విడుదల చేసిన డీఎస్సీ-2008 అర్హులైన అభ్యర్థుల జాబితాలో పలువురి పేర్లు గల్లంతయ్యాయి. ఐటీడీఏకు చెందిన 67 పోస్టులు కలిపితే మొత్తంగా 102 మందిని జాబితాలో చేర్చలేదు. దీంతో వారు సోమవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌కు తరలివచ్చారు. 100 మందికి పైగా అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డిని కలిసి న్యాయం చేయాలని కోరారు. దీంతో స్పందించిన ఆయన ప్రాథమిక జాబితాలో పేర్లుండి, కొత్త జాబితాలో పేర్లు లేకపోతే ఇలాంటి వారికి సైతం అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే సర్క్యులర్‌ను జారీచేస్తామని అభ్యర్థులకు భరోసాకల్పించారు.

సచివాలయంలో డిప్యూటేషన్లు రద్దు?

- దీర్ఘకాలంగా కొనసాగుతున్న అధికారులు వెనక్కి
- ఎస్‌వోలు మొదలు పీఎస్‌ల వరకు జాబితా సిద్ధం

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): సచివాలయంలో సుదీర్ఘంగా డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న అధికారులపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్టు తెలిసింది. మంత్రులు, ఉన్నతాధికారుల దగ్గర పీఎస్‌లుగా, పీఏలుగా, వివిధ విభాగాల్లో సెక్షన్ ఆఫీసర్లుగా, ఇతర హోదాల్లో కొనసాగుతున్న వారి జాబితాను సిద్ధం చేసినట్టు సచివాలయ వర్గాలు తెలిపాయి. కొందరిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, మరికొందరిపై సహోద్యోగులే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ముఖ్యంగా సచివాలయంలోని ఓ ఉన్నతాధికారి దగ్గరున్న పీఎస్ తీరుపై సీఎంవో వరకు ఫిర్యాదులు వెళ్లినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. తమకు కనీస మర్యాద ఇవ్వడం లేదని, ప్రతి చిన్న విషయానికి కసురుకుంటున్నారని సహచర ఉద్యోగులు, సిబ్బంది ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీంతో ఇతర శాఖల నుంచి సచివాలయంలోకి డిప్యూటేషన్‌పై వచ్చి, ఇక్కడే తిష్టవేసిన అధికారుల జాబితాను తయారు చేయాలని సీఎంవో ఆదేశించినట్టు సమాచారం. ఈ వివరాలు జీఏడీకి చేరాయని తెలిసింది. ఫైల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపితే డిప్యూటేషన్లను రద్దు చేసి వారిని మాతృవిభాగాలకు పంపనున్నట్టు సచివాలయవర్గాల్లో చర్చ జరుగుతున్నది.

బాగుచేయరు.. నీళ్లివ్వరు!

- ఇటీవలి వర్షాలకు తెగిన కాలువలు
- దెబ్బతిన్న చెరువులు, ప్రాజెక్టులు
- మంత్రిపర్యటనలే తప్ప ఫలితం శూన్యం
- 280కోట్లకు 75కోట్లే విడుదల
- పెండింగ్ బిల్లులే 40కోట్లకు పైగా
- ఎక్కడా సాగని మరమ్మతులు
- 25శాతం కూడా పూర్తికాని పరిస్థితి
- 5లక్షల ఎకరాలకు నీరందని దుస్థితి

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. కాలువలు, చెరువులకు గండ్లు పడ్డాయి. షట్టర్లు, వియర్లు దెబ్బతిన్నాయి. వాటిని తక్షణం పునరుద్ధరించి సాగునీటిని అందివ్వాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టపోవడం విమర్శలకు తావిస్తున్నది. సమీక్షలు తప్ప మరమ్మతులకు పైసా విదిల్చకపోవడంతో 25శాతం కూడా పనులు పూర్తికాలేదు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో ఒక్కటంటే ఒక్క పనీ మొదలు కాలేదు.

284 చెరువులు, 133కాలువలకు గండ్లు

రాష్ట్రవ్యాప్తంగా 284చెరువులకు గండ్లు పడ్డాయి. మరో 274 చెరువుల వియర్లు, తూములు, షట్టర్లు దెబ్బతిన్నాయి. సాగర్ ఎడమకాలువ సహా మేజర్ ప్రాజెక్టులకు సంబంధించి మొత్తం 133 కాలువలు తెగిపోయాయి. 87చోట్ల మేజర్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. ఎత్తిపోతల పథకాలకు సంబంధించి పాలమూరు రంగారెడ్డి స్కీమ్‌లోని వట్టెం, భక్త రామదాసు పంప్‌హౌస్, పలు ఐడీసీ లిఫ్టులు నీట మునిగాయి. మొత్తంగా 786 నిర్మాణాలు దెబ్బతినగా వాటి శాశ్వత మర్మమతులకు రూ.253.42కోట్లు, తాత్కాలిక మరమ్మతులకు రూ.23.90కోట్లు కావాలని అంచనా వేయగా ప్రభుత్వం రూ.75కోట్లే మంజూరు చేసింది. మొత్తంగా నిధులు రాకపోవడంతో సంబంధిత చీఫ్ ఇంజినీర్లే తమ పరపతిపై పనులు చేయిస్తున్నారు. అవీ మందకొడిగా కొనసాగుతున్నాయి. 786 పనుల్లో 190చోట్ల పూర్తయ్యాయి. మరో 37చోట్ల పురోగతిలో ఉండగా, 559చోట్ల మొదలే కాలేదు. ఇక ఓఅండ్‌ఎం పనులకు దాదాపు రూ.40 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం మంజూరు చేసిన వాటిలో సగానికిపైగా బకాయిల చెల్లింపునకే ఖర్చుకానున్నాయి. దీంతో ఆ నిధులతో పనులు ఎలా చేసేదని ఇంజినీర్లు తలలు పట్టుకుంటున్నారు. ప్రాజెక్టులు, చెరువుల్లో నీళ్లున్నా మరమ్మతులు పూర్తికాక 5లక్షల ఎకరాలకు సాగునీరందని దుస్థితి నెలకొనడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ముగ్గురు మంత్రులున్నా ఖమ్మంలో సున్నా..

చెరువులు, ఇతర పథకాలన్నీ కలిపి అత్యధికంగా వరంగల్‌లో 150చోట్ల, ఖమ్మంలో 109, ములుగులో 94, ఆదిలాబాద్‌లో 60, సూర్యాపేటలో 49చోట్ల నష్టం వాటిల్లింది. ఇప్పటివరకు ఆయా జిల్లాల్లో పనులు మొదలు కాలేదు. ఖమ్మం జిల్లా నుంచి డిప్యూటీ సీఎం భట్టి సహా, మంత్రులు తుమ్మల, పొంగులేటి ప్రాతినిధ్యం వహిస్తున్నా అక్కడ ఒక్క పనీ మొదలు కాకపోవడం గమనార్హం. నల్లగొండ, ములుగు, జిల్లాలదీ ఇదే పరిస్థితి. ప్రధానంగా ఎడమకాలువ మరమ్మతులు పూర్తికాకపోవడంతో నీటిని విడుదల చేయలేని పరిస్థితి నెలకొన్నది.

ఇటీవల వర్షాలకు దెబ్బ తిన్న కాల్వలు

క్యాటగిరీ	దెబ్బ తిన్నవి	గండ్లు పడినవి
చెరువులు	271	284
ప్రాజెక్టులు/కాలువలు	87	133
మేజర్/ఐడీసీ లిఫ్ట్‌స్కీములు	8	00
పునరుద్ధరించినవి		190
పురోగతిలో ఉన్నవి		37
ఇంకా చేపట్టనివి		559

మంత్రి ఉత్తమ్ ఆర్భాటమే..

వర్షాలతో దెబ్బతిన ప్రాజెక్టులు, చెరువులు, కాలువల పునరుద్ధరణ పనులను ఆగమేఘాల మీద పూర్తిచేస్తామని సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢంకా బజాయించి చెప్పారు. చీఫ్ ఇంజినీర్లు, ఎస్‌ఈలతో సమీక్షలు నిర్వహించారు. తెగిన సాగర్ ఎడమ కాలువను చూసేందుకు రెండు సార్లు పర్యటించారు. మీడియా ప్రతినిధులను సైతం వెంటబెట్టుకొని హెలికాప్టర్‌లో వెళ్లారు. కానీ సొంత జిల్లాలోనే పునరుద్ధరణ పనులు పూర్తిచేయలేకపోయారు. సాగునీరందించాలని సొంత జిల్లా రైతులే రోడ్డెక్కుతున్నారు.



ఆగయా 'గమ్‌బాల్'

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

సంప్రదాయక టెస్టు క్రికెట్ ఆడే తీరును పూర్తిగా మార్చేసిన ఇంగ్లండ్.. వారి దూకుడుకు పెట్టుకున్న పేరు 'బజ్‌బాల్'. కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్, కెప్టెన్ బెన్ స్టోక్స్ ఆధ్వర్యంలో ఆ జట్టు సంచలన ఆటతీరుతో టెస్టు క్రికెట్‌ను సరికొత్త పుంతలు తొక్కిస్తున్నది. ఇక ఇప్పుడు దానికి అడ్వాన్స్‌డ్ వర్షెనా? అన్నట్టుగా కాన్పూర్‌లో భారత్ 'గమ్‌బాల్' ఆట ఆడింది. డ్రా దిశగా సాగుతున్న రెండో టెస్టులో ఫలితం తేలే అవకాశం కనిపిస్తుందంటే దానికి కారణమూ ఈ ఆటే. నయా కోచ్ గౌతం గంభీర్ పేరు మీదుగా వచ్చిన ఈ గమ్‌బాల్.. కాన్పూర్ టెస్టులో రోహిత్ సేన తొలి ఇన్నింగ్స్ సమయంలో సోషల్ మీడియాలో ట్రెండ్ అయింది. 3 ఓవర్లలో 50 పరుగులు, 10.1 ఓవర్లలో 100, 24.2 ఓవర్లలో 200, 30.1 ఓవర్లలో 250.. వన్డేలలో కూడా అరుదుగా కనబడే ఈ అంకెలను రోహిత్ సేన.. కాన్పూర్‌లో అలవోకగా ఆడేసింది. 34.4 ఓవర్లలో ఏకం గా 8.22 రన్‌రేట్‌తో దూకుడు ప్రదర్శించిం ది. ఇక హిట్‌మ్యాన్ భారత ఇన్నింగ్స్‌ను డిక్లే ర్ చేయడమూ ఒక ఆశ్చర్యకర నిర్ణయమే. 12 ఓవర్ల ఆట మిగిలున్న నాలుగో రోజు ఆటలో వీలైనన్ని వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడానికి వేసిన ఎత్తుగడ కూడా ఫలించింది. 11 ఓవర్లు ఆడిన బంగ్లా ఇప్పటికే రెండు వికెట్లు కోల్పోయింది. ఇదే స్ట్రాటజీని రాబోయే రోజుల్లో పాటిస్తుందో లేదో ఇప్పుడే చెప్పలేము గానీ కాన్పూర్ వరకైతే అభిమానులకు పసందైన క్రికెట్ విందును పంచుతున్నది.



భారత్‌కు రజతం

హైదరాబాద్,ఆట ప్రతినిధి: సింగపూర్ వేదికగా జరిగిన 10వ ఎఫ్‌కేకే ఇంటర్నేషనల్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ రజత పతకంతో మెరిసింది. సోమవారం జరిగిన టీమ్ ఈవెంట్ ఫైనల్స్‌లో మలేషియా చేతిలో ఓటమితో భారత్ ద్వితీయ స్థానంలో నిలిచింది. టోర్నీలో దేశం తరఫున విద్యాధర్, లక్ష్మణ్, నందగోపాల్, జితేందర్‌రెడ్డి, మనోజ్, యూవీఎన్ బాబు మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

షూటర్లకు మరో రెండు కాంస్యాలు

లిమా (పెరూ): ఐఎస్‌ఎస్‌ఎఫ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ షూటర్లు పతకాల మోత మోగిస్తున్నారు. ఇదివరకే ఈ టోర్నీలో రెండు స్వర్ణాలు, ఓ కాంస్యం గెలిచిన భారత్.. సోమవారం మరో రెండు కాంస్య పతకాలు గెలిచింది. పది మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో గౌతమి భానోత్, అజయ్ మాలిక్ మూడో స్థానంలో నిలిచారు.

సెమీస్‌కు సిన్నర్, అల్కారజ్

బీజింగ్: చైనా ఓపెన్‌లో టాప్ సీడ్ జన్నిక్ సిన్నర్, కార్లోస్ అల్కారజ్, డేనియల్ మెద్వెదెవ్ సెమీస్‌కు దూసుకెళ్లారు. పురుషుల క్వార్టర్స్‌లో సిన్నర్.. 6-2, 7-6 (8/6) జిరి లెహెకాను ఓడించగా అల్కారజ్ 7-5, 6-2తో కరెన్ ఖచనోవ్‌ను చిత్తు చేశాడు. మెద్వెదెవ్.. 6-2, 6-4తో ఫ్లావి యొ కొబొలిను మట్టికరిపించాడు.

పరుగుల హోరు

- కాన్పూర్‌లో భారత్ ధనాధన్ ఆట
- జైస్వాల్, రాహుల్, కోహ్లీ దూకుడు
- తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 233 ఆలౌట్
- రసవత్తరంగా రెండో టెస్టు

టెస్టులలో 'ఫాస్టెస్ట్' రికార్డుల బద్దలు



యశస్వీ జైస్వాల్ (72)

వరుణుడి దోబూచులాట, మైదానం సరిగ్గా లేకపోవడంతో రెండు రోజుల పాటు టెస్టు మ్యాచ్‌కు దూరమై ఫలితం వస్తుందో? రాదో? అన్న నిరాశలో కూరుకుపోయిన క్రికెట్ అభిమానులకు భారత జట్టు నాలుగో రోజు పసందైన విందు భోజనం అందించింది. టెస్టులలో టీ20 ఆటను ఆడుతూ ఫ్యాన్స్‌కు ఆనందాన్ని, మ్యాచ్‌లో ఫలితాన్ని తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తోంది. ధనాధన్ బ్యాటింగ్‌కు తోడు అదిరిపోయే బౌలింగ్‌తో ప్రత్యర్థిని ఓటమి దిశగా నడిపిస్తోంది. టెస్టులలో ఫాస్టెస్ట్ 50, 100, 200.. ఇలా రికార్డులన్నింటినీ చెల్లాచెదురు చేసిన రోహిత్ సేన.. నాలుగో రోజు ప్రత్యర్థి 2 వికెట్లు పడగొట్టి వికెట్ల వేట మొదలెట్టింది. పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తున్న నేపథ్యంలో మ్యాచ్‌లో ఫలితం తేలే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

కాన్పూర్: భారత్, బంగ్లాదేశ్ మధ్య కాన్పూర్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టు నాలుగో రోజు అనూహ్య మలుపులు తిరిగింది. వర్షం అంతరాయానికి తోడు మైదానం ఆటకు అనువుగా లేకపోవడంతో రెండు రోజుల ఆట కోల్పోయిన ఈ టెస్టులో నాలుగో రోజు భారత్ అన్ని విభాగాల్లో అదరగొట్టింది. మొదట బంగ్లాదేశ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 233 పరుగులకు ఆలౌట్ చేసిన రోహిత్ సేన.. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చి మెరుపులు మెరిపించింది. బంగ్లా జట్టులో మోమినుల్ హక్ (107 నాటౌట్, 17 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదంతొక్కగా మిగిలినవారంతా విఫలమయ్యారు. భారత్ 34.4 ఓవర్లలోనే 9 వికెట్ల నష్టానికి 285 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. యశస్వీ జైస్వాల్ (51 బంతుల్లో 72, 12 ఫోర్లు, 2 సిక్సర్లు), కేఎల్ రాహుల్ (43 బంతుల్లో 68, 7 ఫోర్లు, 2 సిక్సర్లు), విరాట్ కోహ్లీ (35 బంతుల్లో 47, 4 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడారు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో భారత్‌కు 52 పరుగుల కీలక ఆధిక్యం దక్కింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడుతున్న పర్యాటక జట్టు.. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 11 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 26 పరుగులు చేసింది. నాలుగో రోజు ఆటలో ఒక్క రోజే 18 వికెట్లు నేలకూలడం గమనార్హం.

మోమినుల్ హక్ సెంచరీ..

బంగ్లాకు నాలుగో రోజు ఉదయం సెషన్ ఐదో ఓవర్లోనే తొలి షాక్ తాకింది. బుమ్రా బౌలింగ్‌లో ముష్ఫీకర్ (11) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. బుమ్రా బౌలింగ్‌లో 3 బౌండరీలు బాదిన లిటన్ దాస్ (13) డ్రింక్స్ తర్వాత సిరాజ్ వేసిన తొలి ఓవర్లో రోహిత్‌కు క్యాచ్ ఇచ్చాడు. అశ్విన్ బౌలింగ్‌లో సిరాజ్ పట్టిన సంచలన క్యాచ్‌తో షకిబ్ (9) కథ ముగిసింది. సహచర ఆటగాళ్లు వెనుదిరుగుతున్నా మోమినుల్ హక్ మాత్రం భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. లంచ్ విరామానికి ముందు ఓవర్లో బౌండరీతో అతడు శతకాన్ని పూర్తిచేసుకున్నాడు. లంచ్ తర్వాత బంగ్లా ఇన్నింగ్స్ పతనం వేగంగా సాగింది. మెహిది హసన్ మిరాజ్ (20) నిష్క్రమణతో ఆరు పరుగుల తేడాతో ఆ జట్టు మూడు వికెట్లు కోల్పోయింది.

భారత్ ధనాధన్..

ఇన్నింగ్స్‌ను భారత్ ఫోర్లు, సిక్సర్లతో దూకుడుగా మొదలుపెట్టింది. హసన్ మహ్మూద్ తొలి ఓవర్లోనే జైస్వాల్ హ్యాట్రిక్ ఫోర్లు కొట్టి భారత ఇన్నింగ్స్ ఎలా ఉండబోతుందో చెప్పకనే చెప్పాడు. రెండో ఓవర్లో రోహిత్ (11 బంతుల్లో 23, 1 ఫోర్, 3 సిక్సర్లు) రెండు వరుస సిక్సర్లు బాదాడు. హసన్ మూడో ఓవర్లో అయితే ఈ ఇద్దరూ కలిసి 22 పరుగులు రాబట్టడంతో 3 ఓవర్లలోనే టీమ్‌ఇండియా 50 పరుగుల మార్కును దాటింది. మిరాజ్ 4వ ఓవర్లో రోహిత్ బౌల్డ్ అయినా భారత్ దూకుడు మాత్రం తగ్గలేదు. వన్‌డౌన్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ (36 బంతుల్లో 39, 4 ఫోర్లు, 1 సిక్సర్) అండగా జైస్వాల్ రెచ్చిపోయాడు. ఈ క్రమంలో 31 బంతుల్లోనే అతడి అర్ధశతకం పూర్తయింది. జైస్వాల్, గిల్ మెరుపులతో 10.1 ఓవర్లోనే భారత్ వంద పరుగుల మార్కును దాటింది. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 72 పరుగులు జోడించారు. ధాటిగా ఆడే క్రమంలో జైస్వాల్, గిల్ నిష్క్రమించారు. రిషభ్ పంత్ (9) నిరాశపరిచినా ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన కోహ్లీ(47)ధాటిగా ఆడాడు. తొలి టెస్టులో విఫలమైనా రాహుల్ కాన్పూర్‌లో మాత్రం జూలు విదిల్చాడు. ఈ ఇద్దరూ వేగంగా పరుగులు రాబట్టడంతో 25 ఓవర్లకే భారత స్కోరు 200 దాటింది. ఇన్నింగ్స్ 28వ ఓవర్కే రోహిత్ సేన.. బంగ్లా స్కోరు (233)ని అధిగమించింది. దూకుడుగా ఆడిన రాహుల్ 33 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. అయితే 30వ ఓవర్లో షకిబ్.. కోహ్లీని బౌల్డ్ చేయడంతో భారత్ త్వరత్వరగా వికెట్లు కోల్పోయింది. జడేజా (8), అశ్విన్ (1), ఆకాశ్ దీప్ (12) వేగంగా ఆడే క్రమంలో పెవిలియన్‌కు క్యూ కట్టారు. రాహుల్ స్టంపౌట్ అయ్యాడు. ఆకాశ్ నిష్క్రమణ తర్వాత రోహిత్.. భారత ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేశాడు. దీంతో భారత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 52 పరుగుల విలువైన ఆధిక్యం దక్కింది.

వికెట్ల వేట..

సుడిగాలిలా ఆడిన భారత ఆటగాళ్ల ఇన్నింగ్స్ తర్వాత మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లా వికెట్లను కాపాడుకోవడానికి కష్టపడింది. ఓపెనర్లు షద్మాన్ ఇస్లాం (40 బంతుల్లో 7 బ్యాటింగ్), జకీర్ హసన్ (10) డిఫెన్స్‌నే ఆశ్రయించారు. బుమ్రా, అశ్విన్ కవ్వించే బంతులు విసిరినా షాట్ల జోలికి పోలేదు. అయితే 8వ ఓవర్లో అశ్విన్.. ఫ్లైటెడ్ డెలివరీతో జకీర్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. నైట్ వాచ్‌మెన్‌గా వచ్చిన హసన్ మహ్మూ ద్ (4) నూ బౌల్డ్ చేసి బంగ్లాకు గట్టి హెచ్చరికలు పంపాడు.

కోహ్లీ @27 వేలు

అంతర్జాతీయ క్రికెట్‌లో 27వేల కోహ్లీ పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ప్రపంచ క్రికెట్‌లో వేగంగా (594 ఇన్నింగ్స్) ఈ రికార్డు సాధించిన తొలి క్రికెటర్ అతడే. ఈ జాబితాలో సచిన్ (623 ఇన్నింగ్స్), సంగక్కర (648 ఇన్నింగ్స్), పాంటింగ్ (650 ఇన్నింగ్స్) రికార్డులను కోహ్లీ అధిగమించాడు.

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 233 ఆలౌట్ (మోమినుల్ 107 నాటౌట్, శాంతో 31, బుమ్రా 3/50, ఆకాశ్ 2/43);భారత్ తొలి ఇన్నింగ్స్: 285/9 డిక్లేర్డ్ (యశస్వీ 72, రాహుల్ 68, మిరాజ్ 4/41, షకిబ్ 4/78); బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: 26/2 (జకీర్ 10, అశ్విన్ 2/14)

1 టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా 50, 100, 150, 200, 250 పరుగులు సాధించిన జట్టుగా భారత్ ఘనత.

2 టెస్టులలో వేగంగా (74 టెస్టులలో) 300 వికెట్లు, 3 వేల పరుగులు చేసిన రెండో ఆటగాడు జడేజా. ఇయాన్ బోథమ్ (72) ముందున్నాడు.

4 టెస్టులలో భారత్ తరఫున యశస్వీ నాలుగో వేగవంతమైన (31 బంతుల్లో) ఫిఫ్టీ చేశాడు. ఈ జాబితాలో పంత్ (28), కపిల్ దేవ్ (30), శార్దూల్ (31) తర్వాత జైస్వాల్ నిలిచాడు. ఓపెనర్ల పరంగా చూస్తే జైస్వాల్‌దే అగ్రస్థానం.

భారత్ దూకుడు

3.0	ఓవర్లలో	50
10.1	ఓవర్లలో	100
24.2	ఓవర్లలో	200
30.1	ఓవర్లలో	250



రాహుల్ (68)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



కళ్లజోడు తీస్తే నీలాంటివాడ్నే..

ఎట్టకేలకు అభిమానుల నిరీక్షణకు బ్రేక్ పండింది. రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' నుంచి రెండో పాటను మేకర్స్ విడుదల చేశారు. 'కళ్లజోడు తీస్తే నాలాంటి వాడ్నే.. షర్ట్ పైకి పెడితే నీలాంటివాడ్నే..' అంటూ సాగే ఈ పాటను అనంతశ్రీరామ్ రాయగా, తమన్ స్వరపరిచారు. నకాష్ అజీజ్ ఆలపించారు. ఈ పాటను హిందీ, తమిళ వెర్షన్లను కూడా విడుదల చేశారు. దర్శకుడు శంకర్ తనదైన మార్క్ చూపిస్తూ గ్రాండియర్‌గా ఈ పాటను తెరకెక్కించారని, రామ్‌చరణ్ ఎనర్జిటిక్‌గా, స్టైలిష్ లుక్‌తో ఈ పాటలో అలరించారని నిర్మాత దిల్‌రాజు తెలిపారు. 'వెయ్యిమంది జానపద కళాకారులతో కలిసి రామ్‌చరణ్ చేసిన డాన్స్ ఈ పాటకు హైలైట్‌గా నిలుస్తుంది. వివిధ రాష్ట్రాలకు చెందిన జానపద కళాకారులు ఈ పాటలో భాగం అవ్వడం విశేషం. తెలుగు రాష్ట్రాలకు చెందిన గుసాడి, కొమ్ము కోయ, తప్పెటగుళ్లు వంటి జానపద రీతులతోపాటు వెస్ట్ బెంగాల్‌కు చెందిన చౌ, ఒరిస్సాకు చెందిన గుమ్రా, రానప్ప, పైకా, దురువ, కర్ణాటకకు చెందిన హలారి, ఒక్కలిగ, గొరవర, కుణిత వంటి నృత్య రీతుల్ని ఈ పాటలో శంకర్ భాగం చేశారు. తమన్ సంగీతం, గణేశ్ ఆచార్య కొరియోగ్రఫీ, రామ్‌చరణ్ స్టెప్పులు థియేటర్లలో జాతరను తలపిస్తాయ్' అని మేకర్స్ తెలిపారు. కియారా అద్వానీ, అంజలి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, ఎస్.జె.సూర్య సముద్రఖని కీలక పాత్రలు పోషిస్తున్నారు.

భవభూతి బాధ్యత



శ్రీవిష్ణు కథానాయకుడిగా రూపొందిన యునిక్ ఎంటర్టైనర్ 'స్వాగ్'. 'రాజ రాజ చోర' ఫేం హసిత్ గోలి దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన చిత్రం ఈ నెల 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. '1551 నుంచి మగవాడి ప్రయాణం' అంటూ ట్రైలర్ మొదలైంది. ఈ రాజవంశానికి చెందిన ఏకైక వారసుడైన సింగాకు రాజవంశం తాలూకు నిధిని అప్పగించడం అదే వంశానికి చెందిన భవభూతి బాధ్యతగా భావిస్తాడు. అయితే.. వింధ్యామర రాణి దీన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఈ నేపథ్యంలో కథ సాగుతుందని ట్రైలర్ చెబుతున్నది. జెండర్ గేమ్స్‌ని ట్రైలర్‌లో ఆసక్తిగా దర్శకుడు ప్రజెంట్ చేశారు. శ్రీవిష్ణు నాలుగు గెటప్పుల్లో కనిపించారు. ఆయన బాడీలాంగ్వేజ్, డైలాగ్ డిక్షన్, అన్నీ వైవిధ్యంగా ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. రీతూ వర్మ, మీరా జాస్మిన్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రానికి కెమెరా: వేదరామన్ శంకరన్, సంగీతం: వివేక్‌సాగర్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

డిస్కో డ్యాన్సర్‌ను వరించిన దాదా సాహెబ్ ఫాల్కే

'ఐయామ్ ఏ డిస్కో డ్యాన్సర్..' అంటూ తనదైన సిగ్నేచర్ నృత్యంతో ఎనభై దశకంలో యువతరాన్ని ఉర్రూతలూగించిన విలక్షణ నటుడు మిథున్ చక్రవర్తికి సోమవారం కేంద్ర ప్రభుత్వం భారతీయ సినీరంగంలో అత్యున్నత పురస్కారమైన దాదా సాహెబ్ ఫాల్కేను ప్రకటించింది. కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్విన్ వైష్ణవ్ ఈ విషయాన్ని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలియజేశారు. ఆశాపరేఖ్, ఖుష్బూ సుందర్, విపుల్ అమృత్‌షాలతో కూడిన జ్యూరీ మిథున్ చక్రవర్తిని ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారానికి ఎంపిక చేశారు. 'డిస్కో డ్యాన్సర్'గా నాటి ప్రేక్షకులకు సుపరిచితుడైన మిథున్ చక్రవర్తి చిత్ర పరిశ్రమలో బెంగాల్ టైగర్ అనే గుర్తింపును పొందారు. మూడుసార్లు జాతీయ అవార్డులు అందుకొని రికార్డు సృష్టించారు.



◆ ఉద్యమాల నుంచి హీరోగా ప్రస్థానం

మిథున్ చక్రవర్తి అసలు పేరు గౌరంగా చక్రవర్తి. బసంత కుమార్ చక్రవర్తి, శాంతి రాణి దంపతులకు 1950 జూన్ 16న కోల్‌కతాలో జన్మించారు. బీఎస్సీ కెమిస్ట్రీతో పాటు పూనే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ నుంచి డిగ్రీలు పొందారు. అనంతరం భుస్వామ్య, పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా ఆనాడు జరిగిన నక్సల్ ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. అయితే సోదరుడి అకాల మరణంతో కలత చెందిన ఆయన కోల్‌కతాను వదిలి బతుకుతెరువు కోసం ముంబయిలో అడుగుపెట్టారు. తొలుత చిన్న ఉద్యోగాలు చేస్తూ ఓ నైట్‌క్లబ్‌లో డ్యాన్సర్‌గా చేరారు. అక్కడే అతని జీవితం మలుపు తిరిగింది. నృత్యంలో అతని ప్రతిభను చూసి అక్కడకొచ్చిన సినీ ప్రముఖులు మెచ్చుకునేవారు. దాంతో సినీరంగంలో అదృష్టాన్ని పరీక్షించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో నటనలో శిక్షణ కూడా తీసుకున్నారు

◆ 'మృగయా' చిత్రంతో సినీరంగ ప్రవేశం

మృణాల్‌సేన్ దర్శకత్వంలో రూపొందిన 'మృగయా' (1978) చిత్రం ద్వారా మిథున్ సినీ రంగ ప్రవేశం చేశారు. అద్భుత నటనకుగాను తొలి చిత్రంతోనే జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డును గెలుచుకున్నారు. అదే ఏడాది 'నది తేకే సాగరే' సినిమా ద్వారా బెంగాలీ ఇండస్ట్రీలో అడుగుపెట్టారు. ఆ సినిమా కూడా పెద్ద విజయాన్ని సాధించింది. అనంతరం సురక్ష, షౌకిన్, అశాంతి, డిస్కో డ్యాన్సర్, డ్యాన్స్ డ్యాన్స్, ఘర్ ఏక్ మందిర్, గురు, తరానా, వర్దత్, బాక్సర్, అగ్నిపథ్, జల్లాద్, కమాండో, ప్యార్ ఝుక్తా నహీ వంటి చిత్రాలతో స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్నారు. మృగయా, తహదీర్ కథా చిత్రాలకు ఉత్తమ నటుడిగా, స్వామి వివేకానంద (1998) చిత్రానికిగాను ఉత్తమ సహాయ నటుడిగా జాతీయ అవార్డులను సొంతం చేసుకున్నారు. 80, 90 దశకాల్లో అగ్ర హీరోల్లో ఒకరిగా మిథున్ చక్రవర్తి పేరుప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. హిందీ, బెంగాలీ, భోజ్‌పురి, పంజాబీ, తెలుగు, కన్నడ, ఒరియా భాషల్లో 350కిపైగా చిత్రాల్లో నటించారు. తెలుగులో గోపాల గోపాల, మలుపు చిత్రాల్లో నటించారు. బుల్లితెరపై ప్రయోక్తగా కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు మిథున్ చక్రవర్తి.

◆ 'డిస్కో డ్యాన్సర్'తో యువతలో క్రేజ్

1982లో విడుదలైన 'డిస్కో డ్యాన్సర్' చిత్రం మిథున్ చక్రవర్తికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిపెట్టింది. 'ఐయామ్ ఏ డిస్కో డ్యాన్సర్' పాట నాటి యువతను ఉర్రూతలూగించింది. ఈ పాట అంతర్జాతీయంగా మిథున్ చక్రవర్తికి పాపులారిటీ తీసుకొచ్చింది. ఆ రోజుల్లోనే సిక్స్‌ప్యాక్‌తో కూడిన దేహదారుఢ్యంతో పాటు బ్రేక్ డ్యాన్సులు, అద్భుతమైన ఫైట్లతో యాక్షన్ హీరోగా తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్నారు. 1989లో ఒకే ఏడాదిలో అత్యధికంగా 19 సినిమాలు చేసి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సంపాదించుకున్నారు. భారతీయ సినీ చరిత్రలో తొలిసారి వందకోట్లు వసూలు చేసిన చిత్రంగా 'డిస్కో డ్యాన్సర్' చరిత్ర సృష్టించింది.

◆ రాజకీయరంగ ప్రవేశం

నటనతో పాటు సినీ నిర్మాణం, హోటల్ వ్యాపారంలో మిథున్ చక్రవర్తి రాణించారు. 80, 90 దశకాల్లో అగ్రశ్రేణి వ్యాపార సంస్థలకు ప్రచారకర్తగా వ్యవహరించారు. అనంతరం తృణమూల్ కాంగ్రెస్‌లో చేరిన ఆయన 2014లో రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. 2021లో బీజేపీలో చేరారు. అక్టోబర్ 8న జరిగే 70వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో మిథున్ చక్రవర్తి దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని అందుకోనున్నారు.



మూడ్రోజుల్లో 304 కోట్లు

సెప్టెంబర్ 27న ఎన్టీఆర్ 'దేవర 1' చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదలైన విషయం తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వంలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె, నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మించిన ఈ చిత్రం తొలి రోజున 172 కోట్ల వసూళ్లను రాబట్టిందని, అదే స్పీడును కొనసాగిస్తూ ఈ వారాంతం ముగిసే వరకూ.. అంటే మూడు రోజుల్లోనే 304కోట్ల గ్రాస్ కలెక్షన్లను సాధించిందని నిర్మాతలు తెలిపారు. 'ఇప్పటికే 80శాతం రికవరీ అయ్యింది, తెలుగు రాష్ట్రాల్లో 87.69 కోట్ల షేర్ సాధించిన ఈ సినిమా హిందీలోనూ మంచి వసూళ్లను రాబడుతున్నది. సముద్ర నేపథ్యంలో భయం లేని వారియర్స్ చుట్టూ అల్లిన ఈ కథ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఎన్టీఆర్ వన్‌మ్యాన్ షోగా 'దేవర'ను అభివర్ణిస్తున్నారు. అనిరుథ్ సంగీతం, రత్నవేలు ఛాయాగ్రహణం సినిమాను మరోస్థాయిలో నిలబెట్టాయి. జాన్వీకపూర్, సైఫ్ ఆలీఖాన్, ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో నటించిన ఈ చిత్రం మరిన్ని రికార్డులతో దూసుకుపోవడం ఖాయం.' అని నిర్మాతలు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.



తండేల్ శివరాత్రి సంబరం

శ్రీకాకుళం జిల్లా డి.మత్స్యలేశం గ్రామంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'తండేల్'. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీకి చందూ మొండేటి దర్శకుడు. గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకాకుళంలో దక్షిణకాశీగా పేరు గాంచిన శైవక్షేత్రం శ్రీముఖలింగం. అక్కడ వైభవంగా జరిగే శివరాత్రి మహోత్సవాలను స్ఫూర్తిగా తీసుకొని అద్భుతమైన శివరాత్రి పాటను ఈ సినిమా కోసం చిత్రీకరించారు. దేవిశ్రీప్రసాద్ టైమ్‌లెస్ క్లాసిక్‌గా ఈ పాటను కంపోజ్ చేశారని, శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో వేలాదిమంది డ్యాన్సర్స్‌తో కలిసి నాగచైతన్య, సాయిపల్లవి ఈ పాటకోసం చేసిన డ్యాన్స్ కొన్నేళ్లపాటు గుర్తుండిపోతుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సందర్భంగా ఈ సాంగ్ షూట్ నుంచి రెండు పోస్టర్లను మేకర్స్ విడుదల చేశారు. నాగచైతన్య, సాయిపల్లవి సంప్రదాయ దుస్తులతో ఈ పోస్టర్లో కనిపించారు. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: షామ్‌దత్, సమర్పణ: అల్లు అరవింద్.



అలా అయితే ఐటమ్‌సాంగ్‌కి రెడీ..

ఒకప్పుడు ఐటెమ్ సాంగ్స్ అంటే.. వాటికోసం ప్రత్యేకంగా నర్తకీమణులుండేవారు. జయమాలిని, సిల్క్‌స్మిత, అనూరాధ.. ఇలా అనమాట. ఇప్పుడు ఆ బాధ్యతను కూడా స్టార్ హీరోయిన్లే మోసేస్తున్నారు. ఒక సినిమాలో హీరోయిన్‌గా చేస్తే ఎంత పారితోషికం ముడుతుందో.. ఒక్క పాటకు అంత పారితోషికం ఇస్తామంటే ఎవరు కాదంటారు చెప్పండి? ఐశ్వర్యరాయ్ దగ్గర్నుంచి శ్రియ, సమంత, కాజల్, తమన్నా రీసెంట్‌గా త్రిష.. ఇలా చాలామంది స్టార్ హీరోయిన్లు ఐటమ్ సాంగ్స్‌లో మెరిసిన వారే. ఇప్పుడు ఈ లిస్ట్‌లో చేరడానికి బాలీవుడ్ భామ అనన్య పాండే కూడా సుముఖత వ్యక్తం చేస్తున్నది. ఇటీవల ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'ఐటమ్ సాంగ్స్‌లో చేయడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. కాకపోతే కథకు సంబంధం లేకుండా, కథ డిమాండ్ చేయకపోయినా కొందరు అనవసరంగా ఐటమ్ సాంగ్స్ పెడుతుంటారు. అలాంటి పాటల్లో నర్తించను, నటించను. నేను ఐటమ్ సాంగ్ చేస్తే అది కథలో ఉండాలి. కథ ఆ పాటను డిమాండ్ చేయాలి. అలాంటి పాట వస్తే తప్పకుండా ఐటమ్ సాంగ్ చేస్తా.' అని తెలిపింది అనన్య పాండే.

అడవికే పాఠాలు నేర్పే గురువులు



మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడు. డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. మహాశివభక్తుడు కన్నప్ప జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో మోహన్‌లాల్, శరత్‌కుమార్, అక్షయ్‌కుమార్, మోహన్‌బాబు, ప్రభాస్ వంటి అగ్రతారలు భాగమయ్యారు. ఈ సినిమాలో ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం, సప్తగిరి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సోమవారం వారి పాత్రల తాలూకు లుక్స్ విడుదల చేశారు. ఇందులో బ్రహ్మానందం పిలక పాత్రలో, సప్తగిరి గిలక పాత్రలో కనిపించనున్నారు. 'చేపకు ఈత, పులికి వేట, కోకిలకు పాట నేర్పిన గురువులు అడవికే పాఠాలు చెప్పడానికి వస్తే..' అంటూ వీరిద్దరి పాత్రలను పరిచయం చేశారు. వీరిద్దరి కామెడీ సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తుందని చిత్ర బృందం పేర్కొంది. అవా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

పెళ్లి నాకిష్టంలేదు



సినిమా పేరు 'ఐ హేట్ మ్యారేజ్'. సుగి విజయ్, జుఫ్సీ భద్ర జంటగా నటిస్తున్నారు. పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడు. ఎం.దయానంద్ నిర్మాత. ఈ చిత్రం షూటింగ్ సోమవారం హైదరాబాద్‌లో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత శ్రీనివాసరాజు క్లాప్ ఇవ్వగా, అగ్ర దర్శకుడు సుకుమార్ అన్నయ్య, రచయిత, నిర్మాత విజయ్‌కుమార్ కెమెరా స్విచాన్ చేశారు. చిత్ర సంగీత దర్శకుడు వరికుప్పల యాదగిరి గౌరవ దర్శకత్వం వహించారు. భావోద్వేగాలతో కూడిన యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ ఇదని దర్శకుడు చెప్పారు. నేటి నుంచి ఏకధాటిగా డిసెంబర్ వరకూ జరిగే షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుందని, కాన్సెప్ట్‌ని నమ్మి చేస్తున్న సినిమా ఇదని నిర్మాత తెలిపారు. పృథ్వీ, ఆశ్రిత, లోహిత్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విజయ్ సి.కుమార్.

దిష్టి తగులుతుందని చెప్పలేదు



గత ఏడాది జూన్‌లో తన ప్రియుడు జహీర్ ఇక్బాల్‌ని పెళ్లాడి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది బాలీవుడ్ అందాలభామ సోనాక్షి సిన్హా. తన తాజా ఇంటర్వ్యూలో తన ప్రేమ, పెళ్లి, వైవాహిక జీవితం గురించి ఆసక్తికరంగా మాట్లాడింది సోనాక్షి. 'పెళ్లికి ముందు ఏడేండ్లు మేం డేటింగ్‌లో ఉన్నాం. కానీ ప్రపంచానికి తెలీదు. మా బంధం మా వ్యక్తిగతం. ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం లేదని భావించాం. చెబితే ఏదిపడితే అది రాసేస్తారు. పైగా దిష్టి తగిలే అవకాశం ఉంది. అందుకే చెప్పలేదు. ఏడేండ్ల తర్వాత ఇద్దరం కలిసి పెళ్లి నిర్ణయం తీసుకున్నాం. పెళ్లి జీవితంలో మరపురాని ఘట్టం. అందుకే గుర్తుండిపోయేలా చేసుకోవాలనుకున్నాం. ముందు పెద్దల అంగీకారం తీసుకున్నాం. ఆత్మీయులు, మమ్మల్ని ప్రేమించేవాళ్ల సమక్షంలో సింపుల్‌గా సెలబ్రేట్ చేశాం. మా పెళ్లిలో హాజరైన అందరూ మమ్మల్ని ప్రేమించేవారే కావడం విశేషం. వారందరి దీవెనల వల్లే ఇప్పుడు భార్యాభర్తలుగా ప్రతిక్షణాన్నీ ఎంజాయ్ చేస్తున్నాం' అంటూ చెప్పుకొచ్చింది సోనాక్షి.

మైలురాయిలాంటి సినిమా



దర్శకుడు ఈశ్వర్ కార్తీక్ ఈ కథని జంగిల్, రాబిట్, లయన్.. అంటూ చెప్పడం మొదలుపెట్టాడు. జంగిల్ బుక్ తీస్తున్నాడేమో నా వాయిస్ కోసం వచ్చాడని అనుకున్నా. తర్వాత అసలు కథ చెప్పాడు. స్టోరీ అదిరిపోయింది. ఇంత అద్భుతమైన కథ ఇచ్చిన ఈశ్వర్‌కి థ్యాంక్స్. చాలా క్లారిటీగా స్క్రిప్ట్ రాసుకున్నాడు. ఇందులో చాలా కొత్తగా కనిపిస్తా. నా కెరీర్‌కి ఇది మైలురాయిలా నిలిచే సినిమా.' అని హీరో సత్యదేవ్ నమ్మకం వెలిబుచ్చారు. సత్యదేవ్, కన్నడ నటుడు డాలీ ధనుంజయ్ లీడ్ రోల్స్ చేసిన సినిమా 'జీబ్రా'. ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. ఎస్.రెడ్డి, ఎస్.పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మాతలు. అక్టోబర్ 31న సినిమా విడుదల కానుంది. సోమవారం హీరో నాని ఈ సినిమా టీజర్‌ని ఆన్‌లైన్‌లో లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్యదేవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన మంచు మనోజ్ చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. దర్శకుడు ఈశ్వర్ అంకితభావంతో చేసిన సినిమా ఇదని, ఆడియన్స్ మంచి సినిమా చూడబోతున్నారని నటుడు డాలీ ధనుంజయ చెప్పారు. మంచి కంటెంట్‌తో తెరకెక్కుతున్న సినిమా ఇదని దర్శకుడు తెలిపారు. ఇంకా సత్యరాజ్, హీరోయిన్ జెన్నిఫర్ పిసినాటో, నిర్మాతలు కూడా మాట్లాడారు.

ఆత్మహత్య పరిష్కారం కాదని చెప్పే కథ



'చిన్నప్పట్నుంచీ సాహిత్యాభిమానిని. చదవడం, రాయడం ఇష్టం. దర్శకుడు కావడం నా కల. కొన్ని సినిమాలకు ఘోస్ట్ రైటర్‌గా చేశా. ఆ తర్వాత 'భాగమతి' దర్శకుడు అశోక్ దగ్గర, 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' దర్శకుడు అరుణ్ పవార్ దగ్గర పనిచేశా. లాక్‌డౌన్ టైమ్‌లో ఖాళీ దొరికింది. 'కలి' స్క్రిప్ట్ రాశా. హీరో ప్రిన్స్‌కి వినిపిస్తే బావుంది చేద్దాం అన్నారు. నిర్మాత గౌతమ్‌వర్మ ప్రొడ్యూస్ చేసేందుకు ముందుకొచ్చారు. అలా 'కలి' మొదలైంది. ' అంటూ చెప్పుకొచ్చారు దర్శకుడు శివ శేషు. ఆయన దర్శకత్వంలో రూపొందిన సైకలాజికల్ థ్రిల్లర్ 'కలి'. ప్రిన్స్, నరేష్ ఆగస్త్య హీరోలు. రుద్ర క్రియేషన్స్ పతాకంపై లీలా గౌతమ్‌వర్మ ఈ చిత్రాన్ని నిర్మించారు. అక్టోబర్ 4న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు దర్శకుడు శివ శేషు. 'ఈ సినిమా ప్రీప్రొడక్షన్‌కి ఏడాదిన్నర కేటాయించాం. ఇది ఒకే లొకేషన్‌లో జరిగే కథ కావడంతో ఫిల్మ్‌సిటీలో సెట్ వేశాం. ఈ సినిమాకు పనిచేసినవారంతా యంగ్ బ్యాచ్. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని చెప్పే కథ ఇది. ఇందులో ప్రిన్స్ శివరామ్ అనే కేరక్టర్ చేశాడు. మంచివాడు, మృదుస్వభావి అయిన శివరామ్ సమస్యల్ని భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు. ఇంతలో అతని ఇంటికి ఓ అపరిచిత వ్యక్తి వస్తాడు. ఆ కేరక్టరే నరేష్ ఆగస్త్య చేశాడు. అతనొచ్చాక శివరామ్ జీవితంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయ్? అనేదే ఈ సినిమా కథ. ఇది రెండు పాత్రల మధ్య నడిచే స్క్రిప్ట్. ఇద్దరూ అద్భుతంగా నటించారు. పురాణాల్లో కలి పురుషుడి పాత్రను ప్రేరణగా తీసుకొని రాసుకున్న కథ ఇది' అని తెలిపారు శివ శేషు.